


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




మంగళవారం | 31-3-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 346 | శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి తె. 3.50 వరకు తదుపరి అష్టమి; నక్షత్రం: మృగశిర సా. 5.45 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: రా. 3.24-5.03 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.41-9.29 వరకు, రా. 10.17-11.03 వరకు; అమృతఘడియలు: ఉ. 9.25-11.06 వరకు; రాహుకాలం: మ. 3.00-4.30 వరకు; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

## కరోనాపై సీసీఎంబీ సమరం

వారంలోగా ఆర్ఎన్ఏ విశ్లేషణ

కొవిడ్ -19 పరీక్షలు ప్రారంభం

రోజుకు 750 టెస్టుల సామర్థ్యం

ఎండతో వైరస్ వ్యాప్తి తగ్గదు

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కరోనాపై భారత్ జరుపుతున్న పోరులో హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత పరిశోధనా సంస్థ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) నేను సైతం అంటూ పాల్గొంటోంది. ఆ సంస్థలో కొవిడ్-19 నిర్ధారణ పరీక్షలు సోమవారం (మార్చి 30) నుంచి ప్రారంభమయ్యాయి. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా వైరస్ జన్యుక్రమాన్ని కనుగొనడంపై ఇక్కడి శాస్త్రవేత్తలు దృష్టిసారించారు. దీంతోపాటు కరోనా పీచమణిచే కొత్త మందులను కనుగొనడానికి దోహదపడే పరిశోధనలూ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

2

### కరోనాపై యుద్ధానికి 'నానో' అస్త్రం

అభివృద్ధి చేసిన చైనా శాస్త్రవేత్తలు

వైరస్‌ను పీల్చేసి, నిర్వీర్యం చేయగల నానో మెటీరియల్ ఆవిష్కరణ

యన్‌హ్వా ప్రావిన్స్‌లోని అమెరికా ల్యాబ్ ప్రయోగాలు సఫలం



శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటున్న సీఎం

## ఇల్లిల్లూ జల్లెడ!

ఒక్కరోజులో వైరస్ బయటపడదు

రోజూ అందరికీ ఆరోగ్యపరీక్ష

అనుమానం వస్తే క్వారంటైన్‌కు..

వలంటీర్లు, వైద్యులతో 2 టీమ్‌లు

వార్డుకు ఒకరు చొప్పున వైద్యుడు

బాధ్యత కలెక్టర్లు, కమిషనర్లదే..

క్రిటికల్‌కు 4 ప్రత్యేక ఆస్పత్రులు

పాజిటివ్ కోసం జిల్లాకో ఆస్పత్రి: సీఎం

కలెక్టర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టాలని, కరోనా వైరస్ సోకిందని గుర్తిస్తే తక్షణమే క్వారంటైన్ కేంద్రానికి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిరోజూ అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని

మిగతా 7వ పేజీలో...

# 'ఢిల్లీ' దడ!

## నిజాముద్దీన్ నుంచి కరోనా విస్తరణ

మార్చి 1 నుంచి మత సమావేశాలు

ఇరాన్, ఇండోనేషియా నుంచీ రాక

16, 17 తేదీల్లో పాల్గొన్న తెలుగు వారు

రెండు రాష్ట్రాల నుంచి 2 వేలమంది!

సామూహిక ప్రయాణాలు, బస

అక్కడే కరోనాతో కాంటాక్ట్‌లోకి!?

రైళ్లలో తిరుగు ప్రయాణం

ఇప్పటికే పలువురికి కరోనా పాజిటివ్

ఆ లక్షణాలతో రాష్ట్రంలో ముగ్గురి మృతి

నిజాముద్దీన్ ప్రాంతంలో హై అలర్ట్

ఐసొలేషన్‌కు సుమారు 200 మంది

పోలీసుల స్వాధీనంలో మత సంస్థ కార్యాలయం

ఎవ్వరూ బయటికి రాకుండా కట్టుదిట్టం

డ్రోన్లతోనూ నిఘా





ఢిల్లీ నిజాముద్దీన్ ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు వెళుతున్న మెడికోలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దక్షిణ ఢిల్లీలోని 'నిజాముద్దీన్' ప్రాంతంలో ఒక్కసారిగా కరోనా కలకలం చెలరేగింది. ఆ ప్రాంతం మాత్రమే కాదు... అక్కడ జరిగిన మత సదస్సులో పాల్గొని వచ్చిన వారిలోనూ కలవరం రేపుతోంది. ఏపీ, తెలంగాణలో 'కరోనా పాజిటివ్'గా తేలిన వారిలో చాలామంది ఢిల్లీలో జరిగిన సదరు మత సదస్సుకు

మిగతా 8వ పేజీలో...

### 'ఢిల్లీ సభ'కు వెళ్లొచ్చారా!?

అయితే పరీక్ష చేయించుకోండి.. ఏపీలో 6 పాజిటివ్ కేసులతో కనెక్షన్

దాదాపు ప్రతి జిల్లా నుంచి హాజరు.. అప్రమత్తమైన యంత్రాంగం

సదస్సుకు వెళ్లిన వారిపై ఆరా.. క్వారంటైన్‌కు 376 మంది 8

49 మంది హోం క్వారంటైన్‌లో.. ఆచూకీ లభించని వారు 113 మంది

### మరో ఇద్దరికి కరోనా పాజిటివ్

'తూర్పు'లో 2 పాజిటివ్ కేసులు.. బాధితులు ఇద్దరికీ 'ఢిల్లీ కనెక్షన్'

రాష్ట్రంలో 23కి చేరిన బాధితులు.. గుంటూరులో క్యూ కట్టిన అనుమానితులు

తెలంగాణలో ఐదుగురు మృతి.. అందరూ ఢిల్లీ వెళ్లిన వారే 3

| ప్రభావిత దేశాలు | అమెరికా | ఇటలీ | చైనా | స్పెయిన్ | జర్మనీ | ఇరాన్ | బ్రిటన్ | ఇండియా | ప్రపంచం | తెలంగాణ | ఏపీ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| సోమవారం నమోదు | 9,140 | 4,050 | 31 | 5,085 | 1,494 | 3,186 | 2,619 | 227 | 53,879 | 06 | 02 |
| మరణాలు | 2,817 | 11,591 | 3,304 | 7,340 | 560 | 2,757 | 1,408 | 32 | 36,864 | 06 | 0 |
| బాధితులు | 1,52,631 | 1,01,739 | 81,470 | 85,195 | 63,929 | 41,495 | 22,141 | 1,251 | 7,64,866 | 76 | 23 |

వరల్డోమీటర్ ప్రకారం సోమవారం రాత్రి 11.30 గంటలకు..

## ఒకే కుటుంబంలో 25 మందికి కరోనా

దేశంలో ఒకే రోజు 227 కేసులు

### ఇరుకు ఇంట్లో ఉండడమే కారణం

29కి చేరిన మృతుల సంఖ్య

బతికే చాన్సుంటేనే బెడ్?

వయసు పైబడితే నో వెంటిలేటర్

అమెరికాలోనూ బాధాకర సన్నివేశాలు

న్యూయార్క్‌లో 1000 దాటిన మృతుల సంఖ్య

మహా నగరానికి వెళ్లడానికి ట్రంప్ వెనుకంజ

అమెరికాలో 2లక్షల వరకూ చనిపోవచ్చు: ట్రంప్

అయ్యో ఐరోపా.. 25 వేలు దాటిన మృతులు

స్పెయిన్‌లో గంటకు 35 మంది వైరస్‌కు బలి

నెతన్యాహూ స్వీయ నిర్బంధం.. మాస్కో బంద్



న్యూఢిల్లీ/ముంబై, మార్చి 30: మహారాష్ట్రలోని సాంగ్లీలో ఓ పెద్ద కుటుంబానికి చెందిన 25 మందికి కరోనా సోకింది. వారంతా ఇరుకు ఇంట్లో నివసిస్తుండడంతో వైరస్ వేగంగా వ్యాపించింది. సౌదీ అరేబియా నుంచి తిరిగొచ్చిన ఆ కుటుంబంలోని నలుగురు ముందుగా మహమ్మారి బారినపడినట్లు ఈ నెల 23న నిర్ధారణ అయింది. వారంలోపే

మిగతా 8వ పేజీలో...

### ఇల్లే.. ఆనంద మందిరం!

భార్యాభర్తలు మాట్లాడుకోవడమే బెటర్

పిల్లల్ని తీర్చిదిద్దుకునే మంచి సమయమిదే

మందు మానడానికి లాక్‌డౌన్ తోడ్పాటు

- వివరాలు నవ్య పేజీలో...



## వరికి వైరస్ వర్రీ

### 3.35 లక్షల హెక్టార్లలో సాగు సంకటం

ఉభయ గోదారిలో వరి పంట రెడీ

కరోనాతో కోతకు కూలీలు కరువు

వచ్చేవారూ రెట్టింపు కూలి డిమాండ్

యంత్రాలున్నా నడిపే డ్రైవర్లు లేరు

చేలలోనే రాలిపోతున్న వరి గింజలు

అది చూసి అన్నదాతలు కంటతడి

కరోనా వంకతో ధరకు దళారీల కోత

75 కిలోల ధాన్యం బస్తా రూ.1220

లాక్‌డౌన్ తర్వాత అది రూ.1100కు

కాకినాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రబీ పంట చేతికి వచ్చే సమయంలో కరోనా కాటుతో ఉభయ గోదావరి జిల్లాల్లో వరి సంక్షోభంలో చిక్కుకుపోయింది. పంట కోతకు వచ్చిన ఈ కీలక దశలో భౌతిక దూరం కారణంగా కూలీలు దొరకడం లేదు. కొన్ని చోట్ల బతిమాలితే రెట్టింపు కూలి ఇస్తే రావడానికి కొందరు ముందుకొచ్చినా.. పెట్టుబడి వ్యయాలు పెరుగుతాయని రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ గడ్డు పరిస్థితుల్లో వరికోత యంత్రాలే దిక్కు అని అధికారులు చెబుతున్నా.. వాటిని నడిపే డ్రైవర్లు ఇళ్ల నుంచి బయటకు రావడానికి

మిగతా 3వ పేజీలో...

## బాధ్యత ఉండక్కర్లేదా!

పదేపదే లాక్‌డౌన్ ఉల్లంఘనులు

మాటలతో చెబితే వినరు

లాఠీలతో కొడితే విమర్శలు

అత్యవసర సేవలకు మినహాయింపు

వారిని గుర్తించేదెలాగో తెలియదు

అనుమతి పత్రాలు ఇవ్వని ప్రభుత్వం

కట్టడి 'ఒత్తిడి'లో పోలీసు యంత్రాంగం

సామాజిక శిక్షలతోనే పరిష్కారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

చెబితే వినరు... కొడితే ఏడుస్తారు! పైగా... వాట్సాప్‌లో వీడియోలు షేర్ చేసి బద్నాం చేయడమొకటి! వద్దంటున్నా వినకుండా, అవసరం లేకున్నా రోడ్లపైకి వస్తున్న వారి తీరుపై పోలీసుల ఆక్రోశమిది! కరోనా కట్టడి పోరులో ప్రధానంగా కనిపిస్తున్నది ఇద్దరే! ఒకటి... వైద్య సిబ్బంది! రెండు... పోలీసులు! క్లిష్టమైన ఈ సమయంలో, జనం రోడ్లెక్కకుండా కట్టడి చేసేందుకు పోలీసులు నానా తంటాలు పడుతున్నారు. ఎలాంటి అవసరం లేకున్నా రోడ్లెక్కడం, ఎందుకొచ్చారని ప్రశ్నిస్తే అడ్డదిడ్డమైన సమాధానాలు

మిగతా 7వ పేజీలో...

## లాక్‌డౌన్ 14 వరకే!

పొడిగింపు అవకాశాల్లేవు.. కేంద్ర కేబినెట్ సెక్రటరీ స్పష్టీకరణ

కొత్త కేసులు ఆగితే లాక్‌డౌన్ పొడిగించం.. మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు 8

ఈ 14 రోజులు కఠినంగా లాక్ డౌన్?.. సనత్‌నగర్ ఈఎస్ఐలో పరీక్ష కేంద్రం

### రూ. 10 ఉచిత టాక్‌టైమ్

బ్యాలెన్స్ లేకున్నా వ్యాలిడిటీ.. 2

బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ ఆఫర్

## రెండో రోజూ బారులే

కార్డుదారులకు 'రేషన్' చుక్కలు.. క్యూ లైన్లలో గంటల తరబడి నిరీక్షణ

'కరోనా' భౌతిక దూరానికి చెల్లుచీటీ.. 2 రోజుల్లో 16.89 లక్షల మందికి సరుకులు

వలంటీర్లతో ఇంటికే పంపాలని వినతులు 7



విజయవాడ భవానీపురం రేషన్ షాపు వద్ద జనం బారులు




గమనిక: కరోనా వ్యాప్తి, లాక్ డౌన్ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' టాబ్లాయిడ్‌ను మెయిన్ పేజీల్లో కలిపి ఇస్తున్నాం. ప్రధాన పత్రికలోని I, II, III, IV పేజీలను టాబ్లాయిడ్ ఫుల్ అవుట్‌గా తీసుకోవచ్చు.



## తెలంగాణలో సగం జీతం కోత!

ఉద్యోగుల వేతనాల్లో 50% కట్

4వ తరగతి ఉద్యోగులకు 10%

సీఎం నుంచి ఎంపీటీసీ వరకు ప్రజాప్రతినిధులకు 75 శాతం

ఐఏఎస్, ఐపీఎస్‌లకు 60% కోత

కరోనా నేపథ్యంలో సీఎం నిర్ణయం



హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు, పెన్షనర్లు, ప్రజాప్రతినిధుల వేతనాల్లో భారీగా కోత పెట్టింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు సహా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరి వేతనాల్లో 75 శాతం కోత వేసింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌ల వంటి అఖిల భారత సర్వీసు అధికారుల జీతాల్లోనూ 60 శాతం

మిగతా 3వ పేజీలో...

### అప్పు పుట్టట్లేదు!

600 కోట్లడిగితే రూ.50 కోట్లే చేతికి 3

మరీ తగ్గడంతో తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం

9.5% వడ్డీ ఇచ్చేందుకు సిద్ధమైనా అంతే

### చరిత్ర పుటల్లోకి ఆంధ్రా బ్యాంక్!

రేపు యూనియన్ బ్యాంకులో విలీనం 6



పరంజ్యోతి

## మనస్సుకు, ప్రాణాలకు మూలం.. ఆత్మ శక్తి



*చిత్త వాయవః చిత్క్రియాయుతా*
*శాఖయోర్ ద్వయీ శక్తి మూలకా*

ప్రపంచం నుంచి జ్ఞానాన్ని గ్రహించే మనస్సు, కర్మలు చేయడానికి కర్మేంద్రియాలకు ఆధారమైన ప్రాణం.. ఈ రెండూ జీవశక్తి అనే ఒకే వృక్షానికి రెండు కొమ్మల్లాంటివని దీని అర్థం. రమణ మహర్షి రచించిన 30 శ్లోకాల 'ఉపదేశ సారం'లోని 12వ శ్లోకమిది. మనస్సుకు, శ్వాసకు మధ్య గల సంబంధాన్ని రమణులు ఈ శ్లోకం ద్వారా వివరించారు. ప్రాణాయామం లేదా ప్రాణేక్షణ వల్ల మనస్సు ఎలా నిగ్రహించబడుతుందో తెలిపారు. జీవునిలో జీవశక్తి (చైతన్యం) ఒక మహా వృక్షంలా ఉంది. ఆ శక్తికి రెండు కొమ్మలు. ఒకటి.. జ్ఞానేంద్రియాలతో కూడిన మనస్సు (జ్ఞాన శక్తి), రెండోది కర్మేంద్రియాలకు ఆధారంగా ఉన్న ప్రాణం (క్రియా శక్తి). మనస్సు జ్ఞానేంద్రియాల ద్వారా ప్రపంచంలోని శబ్ద, స్పర్శ, రస, రూప, గంధాలనే ఐదు విషయాలను తెలుసుకుంటుంది. కనుక అది జ్ఞాన శక్తి. ఆ తెలుసుకున్న విషయాల ఆధారంగా కర్మేంద్రియాలు కర్మలు చేస్తాయి. వాటికి ఆదారం ప్రాణవాయువే. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనే 5 పేర్లతో ప్రాణం పనిచేస్తుంది. ఇది క్రియాశక్తి. జ్ఞానాన్ని పొందాలంటే మనస్సు ఉండాలి. కర్మలు చేయాలంటే కర్మేంద్రియాలుండాలి. ఆ కర్మేంద్రియాలకు ఆధారంగా ప్రాణం ఉండాలి. ఆ మనస్సు, ఈ ప్రాణం రెండూ చెట్టుకొమ్మలైతే వాటికాధారమైన చెట్టే జీవశక్తి-ఆత్మ చైతన్యం. అంటే ఆత్మ చైతన్యం వల్ల జ్ఞానేంద్రియాలు ప్రపంచ విషయాలను గ్రహిస్తాయి. వాటిని మనస్సుకు అందజేస్తాయి. వాటిని ఆత్మచైతన్యం వల్లనే మనసు గ్రహిస్తుంది. అలాగే ఆత్మచైతన్యం వల్లనే మనలో ప్రాణవాయువులు సంచరిస్తున్నాయి. ఈ ప్రాణవాయువుల కారణంగానే అన్ని కర్మేంద్రియాలూ పనిచేయగలుగుతున్నాయి. అందుకే జ్ఞానాన్ని గ్రహించే మనస్సుకు, కర్మలు చేసే కర్మేంద్రియాలకు ఆధారమైన ప్రాణాలకూ.. ఒక్క శక్తే ఆధారం. మూలం. అదే చైతన్యశక్తి, ఆత్మశక్తి. కనుక అందులో ఒకదాన్ని నిగ్రహిస్తే మరొకటి నిగ్రహింపబడుతుంది. ఒక కొమ్మను లాగితే రెండో కొమ్మ కదులుతుంది. అలాగే.. ఒకే చైతన్యశక్తి మనస్సులోను, ప్రాణాల్లోను ఉండడం చేత మనస్సును నిరోధిస్తే ప్రాణం నిరోధించబడుతుంది. ప్రాణవాయువును నిరోధిస్తే మనస్సు నిరోధించబడుతుంది. మరి రెండింటిలో దేన్ని నిరోధించడం కష్టం? అంటే.. 'వాయోరివ సుదుష్కరం' అని గీతలో చెప్పినట్లు మనస్సును నిలబెట్టడం చాలా కష్టం (సుదుష్కరం). అందుకే ప్రాణాయామం ద్వారా మనస్సును నిరోధించాలని చెప్పారు. మనస్సుకు, ప్రాణవాయువుకు (శ్వాసకు) ఉన్న పరస్పర సంబంధం మనకు అనుభవంలో ఉన్నదే. మన మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు శ్వాస క్రియ నెమ్మదిగా, నిశ్శబ్దంగా జరుగుతుంది. అదే ఆవేశం వచ్చినప్పుడు శ్వాసవేగం పెరుగుతుంది. ఇది చాలు శ్వాసకు, మనస్సుకు గల సంబంధం తెలుసుకోవడానికి అందుకే.. శ్వాసను వీక్షించడం వల్ల మనస్సు పూర్తిగా కాకున్నా కొంతవరకూ నిగ్రహింపబడుతుంది. మనస్సును నిరోధించడానికి, హృదయస్థానంలో దానికి స్వస్థత కలిగించడానికి భగవాన్ రమణులు మనకు 'ప్రాణ వీక్షణం' అనే ప్రక్రియను మనకు అందించారు. ఇందులో కేవలం శ్వాసను గమనించడం మాత్రమే చేయాలి. దాంతో ఆలోచనలన్నీ ఆగిపోతాయి. అది చేసినంతసేపూ మనసు నిగ్రహించబడుతుంది.

- దేవిశెట్టి చలపతిరావు, care@srichalapathirao.com




| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రాజమండ్రి | 38.0 | 19.0 |
| కడప | 42.0 | 23.0 |
| అనంతపురం | 39.4 | 23.8 |
| ఏలూరు | 39.0 | 24.0 |
| విజయవాడ | 38.8 | 24.6 |
| ప్రకాశం | 35.2 | 24.6 |
| కర్నూలు | 40.2 | 25.1 |

ఎండాకాలం

### ఏప్రిల్‌లో మాడుపగిలే ఎండలు

విశాఖపట్నం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యమహారాష్ట్ర, మరట్వాడ, కర్ణాటక, కేరళ, రాయలసీమ, మధ్యప్రదేశ్, కొంకణ్, గోవా, గుజరాత్‌లో సాధారణం కంటే అర డిగ్రీ నుంచి ఒక డిగ్రీ ఎక్కువగా పగటి ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. కోస్తా, తెలంగాణ, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లో వడగాడ్పుల తీవ్రత ఉంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

# రిలయన్స్ సాయం 500 కోట్లు

**పతంజలి 5 క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు.. పీఎం కేర్స్ ఫండ్‌కు రూ. 150 కోట్లిచ్చిన ఎల్ అండ్ టీ.. ఇన్ఫోసిస్, హీరో గ్రూప్ రూ. 100 కోట్ల విరాళం**

న్యూఢిల్లీ, మార్చి 30: కరోనాపై పోరుకు రిలయన్స్ సంస్థ రూ. 500 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించింది. 10 రోజుల్లో 50 లక్షల ఆహార పొట్లాల పంపిణీ చేస్తామని, 100 పడకలతో ప్రత్యేక ఆస్పత్రిని నిర్మిస్తామని ప్రకటించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 1500 బెడ్లతో 5 క్వారంటైన్ సెంటర్లు నిర్మిస్తామని పతంజలి ప్రకటించింది. దీంతో పాటు పీఎం కేర్స్ ఫండ్‌కు రూ.25 కోట్లు విరాళం ఇచ్చింది. ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థ ఎల్‌అండ్‌టీ రూ.150 కోట్ల విరాళం ప్రకటించింది. పీఎం కేర్స్ ఫండ్‌కు ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ రూ.150 కోట్లు ప్రకటించింది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ రూ.100 కోట్ల విరాళం ప్రకటించి, రూ. 50 పీఎం కేర్స్ ఫండ్‌కు ఇస్తామని తెలిపింది. హీరో(బైక్స్) గ్రూప్ రూ.100 కోట్ల విరాళం ప్రకటించింది. దీనిలో రూ. 50 కోట్లను పీఎం కేర్స్ ఫండ్‌కు ఇచ్చింది. టీవీఎస్ మోటార్ పీఎం కేర్స్ ఫండ్‌కు రూ.25కోట్ల విరాళం ప్రకటించాయి. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రూ.20 కోట్ల విరాళం ప్రకటించింది.

### హజ్ కోసమని దాచిన డబ్బులు విరాళం

కరోనా బాధితులకు సహాయ కార్యక్రమాల కోసం జమ్మూకశ్మీర్‌లో 87 సంవత్సరాల ఖలీదాబేగం రూ. 5 లక్షలు విరాళం ఇచ్చారు. హజ్ యాత్రకు వెళ్లడానికని ఆమె కొన్నేళ్లుగా ఈ డబ్బును దాచుకున్నారు. కేంద్రం ప్రకటించిన గరీబ్ కల్యాణ్ యోజనలో భాగంగా హెల్త్ కేర్ వర్కర్లకు రూ.50 లక్షల బీమా కవరేజీ ఇవ్వనున్నట్లు న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ వెల్లడించింది. బీజేపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరు పీఎం కేర్స్ ఫండ్‌కు కనీసం రూ.100 రూపాయలు విరాళం ఇవ్వాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపు మేరకు 35 మంది ఎంపీలు రూ.కోటి చొప్పున విరాళం ప్రకటించారు. ఓం బిర్లా తన నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. సుప్రీం కోర్టు ఉద్యోగులు తమ మూడు రోజుల వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం మహారాష్ట్రకి రూ.కోటి విరాళం ఇచ్చారు.

### హీరో ప్రభాస్ 50 లక్షల విరాళం

**అల్లు అర్జున్, నారా రోహిత్ 20 లక్షలు**

హైదరాబాద్: కరోనా నేపథ్యంలో సినీ కార్మికులను ఆదుకునేందుకు చిరంజీవి అధ్యక్షతన ఏర్పాటైన కరోనా క్రైసిస్ ఛారిటీకి హీరో ప్రభాస్ రూ.50 లక్షలు ఇచ్చారు. అల్లు అర్జున్ రూ.20 లక్షలు, యూవీ క్రియేషన్స్ రూ.10 లక్షలు ప్రకటించింది. పీఎం కేర్స్ ఫండ్‌కు బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ రూ.కోటి ప్రకటించారు. నటుడు నారా రోహిత్ తెలంగాణకు రూ.10 లక్షలు, ఏపీకి మరో రూ.10 లక్షలు, పీఎం కేర్స్ ఫండ్‌కు రూ.10 లక్షలు ప్రకటించారు.

### పీఎం సహాయనిధి.. నకిలీలతో జాగ్రత్త

హైదరాబాద్: కరోనాపై పోరులో పీఎం కేర్స్ ఫండ్‌కు ప్రజల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. కానీ.. సైబర్ నేరగాళ్లు నకిలీ యూపీఐ ఐడీ సృష్టించి సహాయనిధికి వెళ్లాల్సిన సొమ్మును కాజేసే ప్రయత్నం చేశారు. పోలీసులు దీనిని భగ్నం చేశారు. సహాయనిధికి డబ్బు పంపేవారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

1. బ్యాంకు ఖాతా: PM CARES
   ఖాతా నంబరు: 2121PM20202
   ఐఎఫ్ఎస్‌సీ కోడ్: SBIN0000691
   బ్యాంక్ శాఖ: SBI. New Delhi Main Branch
2. గూగుల్ పే, భీమ్, ఫోన్‌పే, అమెజాన్ పే, పేటీఎం, మొబిక్విక్‌ద్వారా యూపీఐ ఐడీ: pmcares@sbi
3. pmindia.gov.in ద్వారా చెల్లించవచ్చు.

## అమరరాజా ఆరు కోట్ల విరాళం



చెక్కును కలెక్టర్‌కు అందిస్తున్న గల్లా రామచంద్ర నాయుడు, డాక్టర్ రమాదేవి

చిత్తూరు కలెక్టరేట్, రాజమహేంద్రవరం, మార్చి 30: కరోనా నివారణ చర్యలకు సామాజిక బాధ్యత కలిగిన సంస్థగా అమరరాజా గ్రూప్ రూ.6 కోట్ల మొత్తాన్ని విరాళంగా ప్రకటించింది. ఈ మొత్తంలో రూ.5 కోట్లు ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు, రూ.కోటిని తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చింది. అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు, ఆయన కుమార్తె డాక్టర్ రమాదేవి సోమవారం చిత్తూరులో కలెక్టర్ నారాయణ్ భరత్ గుప్తాను కలిసి రూ.6 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా రామచంద్ర నాయుడు మాట్లాడారు. అమరరాజ గ్రూపు వైస్ చైర్మన్ గల్లా జయదేవ్ ఎంపీగా తన నియోజకవర్గమైన గుంటూరులో కోవిడ్-19 నివారణ కోసం ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.2.50 కోట్ల మొత్తాన్ని ప్రకటించారన్నారు. కొద్ది రోజుల క్రితం కలెక్టర్ సమక్షంలో రూ.5 లక్షల విలువైన మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లను అందించామన్నారు. తిరుపతిలో స్థిరపడ్డ పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వర్షిణి ఇండస్ట్రీస్ ఎండీ శ్రీనివాస్ రూ.1.10 కోట్ల విరాళం ఇచ్చారు.

### ఓఎన్జీసీ విరాళం రూ.316 కోట్లు

పీఎం కేర్స్ ఫండ్‌కి సీఎస్ఆర్ నిధులు రూ.300 కోట్లు, దేశవ్యాప్తంగా వున్న ఉద్యోగుల రెండు రోజుల జీతం రూ.16 కోట్లు... మొత్తం రూ.316 కోట్లు విరాళంగా ఇచ్చినట్టు ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ పీఆర్వో ఆక్రతా భాటియా సోమవారం తెలిపారు.

### సంగం డెయిరీ 50 లక్షలు, విట్ 25 లక్షలు

సంగం డెయిరీ తరపున రూ.50 లక్షలు అందించనున్నట్లు డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. రాజధాని ఐనవోలు పరిధిలోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ(వీఐటీ) రూ.25 లక్షలు అందజేసింది. 200 పడకలున్న వర్సిటీ భవనాన్ని క్వారంటైన్ కేంద్రంగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఎన్.జీ.రంగా వర్సిటీ ఉద్యోగులు ఒకరోజు వేతనం(42లక్షలు) విరాళంగా ఇచ్చారు. పీఎం కేర్స్‌కి ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రూ.27.5 లక్షల విరాళం అందించారు. సింబియోసిస్ టెక్నాలజీ తరపున నరేశ్‌కుమార్ రూ.10 లక్షలు, సాగి కాశీ విశ్వనాథరాజు రూ.10 లక్షలు, పారిశ్రామికవేత్త రఘువర్మ రూ.5 లక్షలు, శ్రావణ్ షిప్పింగ్ తరపున సాంబశివరావు రూ.లక్ష అందించారు.



### సంగ్లీలో 25 పాజిటివ్ కేసులు.. పాటిల్‌కు 'శిక్ష'

సంగ్లీ జిల్లా ఇస్లాంపూర్‌లో ఓ పెద్ద కుటుంబానికి చెందిన 25 మందికి కరోనా సోకింది. లాక్‌డౌన్‌పై ప్రధాని మోదీని విమర్శించిన మహారాష్ట్ర మంత్రి జయంత్ పాటిల్ నియోజకవర్గంలో కోవిడ్-19 వ్యాపించడం ఆయనకు విధించిన 'శిక్ష'. ప్రధాని అప్పుడే లాక్‌డౌన్ ప్రకటించకుంటే దేశంలో కరోనా మహమ్మారి మరింత విజృంభించేది.

- అవధూత్, మహారాష్ట్ర బీజేపీ నేత



### కరోనా నిర్ధారణ పరీక్షలు పెంచాలి

కరోనా నిర్ధారణ పరీక్షలను మరింత పెంచి వైరస్ విస్తరణను ప్రభుత్వం అడ్డుకోవాలి. తమ ప్రాణాలను పణంగా పెట్టి బాధితులకు చికిత్స అందిస్తున్న డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి రక్షణ పరికరాలు వెంటనే అందజేయాలి. విదేశాల నుంచి వచ్చిన వారిలో వేలాది మందికి ఇంకా వైరస్ నిర్ధారణ పరీక్షలు కూడా చేయలేదు. కమ్యూనిటీ వ్యాప్తిని నిలువరించడం కీలకం.

- రణదీప్ సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ నేత



### ఒకే సిలిండర్‌తో ఆరుగురికి ఆక్సిజన్ సరఫరా

**విశాఖ డాక్‌యార్డు సిబ్బంది ఆవిష్కరణ**

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అవసరమే కొత్త ఆవిష్కరణలకు ఊపిరి పోస్తుందనే విషయాన్ని విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళం నావల్ డాక్‌యార్డు ఉద్యోగులు నిరూపించారు. ప్రస్తుతం కోవిడ్-19 కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. పరిమితంగా ఉన్న వనరులతో ఎక్కువ మందికి వైద్య చికిత్సలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. సాధారణంగా రోగులకు ఆక్సిజన్ అవసరమైనప్పుడు ఆ బెడ్ దగ్గరలోనో, సమీపంలోనో సిలిండర్ పెట్టి పైపుల ద్వారా సరఫరా చేస్తారు. ఒక్కో రోగికి ఒక్కో సిలిండర్ అవసరమవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో రోగులు ఆస్పత్రులకు వస్తున్నందున ఒక సిలిండర్‌ను ఎక్కువ మందికి ఎలా ఉపయోగించవచ్చనే అంశంపై డాక్‌యార్డు సిబ్బంది ప్రయోగాలు చేశారు. ఒక సిలిండర్‌తో ఆరుగురికి ఒకేసారి ఆక్సిజన్ అందించేందుకు అవసరమైన మొబైల్ పరికరం రూపొందించారు. దానికి 'మల్టీ-ఫీడ్ ఆక్సిజన్ మానిఫోల్డ్ (ఎంవోఎం)' అని నామకరణం చేశారు. ఈ విధానంలో ఆక్సిజన్ సిలిండర్‌కు 6-వే రేడియల్ హెడర్‌ను అమర్చి ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రిలో మార్చి మార్చి ప్రయోగాలు చేసి విజయం సాధించారు. ఈ అమరిక 30 నిమిషాల్లోనే పూర్తవుతుందని నేవీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం పది ఎంవోఎంలను సిద్ధం చేశామని, అవసరమైతే మరిన్ని తయారుచేస్తామని పేర్కొన్నాయి. తక్కువ సిలిండర్లతో ఎక్కువ మందికి ఆక్సిజన్ అందించి క్రిటికల్ కేర్‌లో చక్కటి చికిత్స అందేలా చూడడమే ధ్యేయమని ఓ నేవీ అధికారి తెలిపారు.

### కరోనాపై యుద్ధానికి 'నానో' అస్త్రం

**అభివృద్ధిచేసిన చైనా శాస్త్రవేత్తలు**

బీజింగ్, మార్చి 30 : కరోనాపై యుద్ధానికి చైనా శాస్త్రవేత్తలు 'నానో' అస్త్రాన్ని సిద్ధం చేశారు. అది ఔషధమో, రసాయన మిశ్రమమో కాదు. మానవాళిని వణికిస్తున్న కొవిడ్-19 వైరస్‌ను తనలోకి పీల్చుకొని, దాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయగల శక్తివంతమైన నానో మెటీరియల్. యన్‌హ్యా ప్రావిన్స్‌లో ఉన్న అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీపీ) విభాగంలో పరిశోధనలు చేస్తున్న చైనా శాస్త్రవేత్తలు ఈ నానో మెటీరియల్‌ను అభివృద్ధిచేశారంటూ 'గ్లోబల్ టైమ్స్' పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. కరోనా వైరస్‌ను 96.5-99.9 శాతం మేర నశింపజేయగల సామర్థ్యం ఆ మెటీరియల్‌కు ఉందని పేర్కొంది. ఇది 'నానోజైమ్'లా.. అంటే అచ్చం ఎంజైమ్‌లా ప్రవర్తించి వైరస్‌ను అంతమొందిస్తుందని కథనంలో ప్రస్తావించింది. కరోనా కట్టడికి ఈ నానో మెటీరియల్‌ను ఎయిర్ ప్యూరిఫయర్లు, ఫేస్ మాస్కుల తయారీలో వాడనున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం ఆయా ఉపకరణాలను తయారుచేసే కంపెనీలతో సదరు పరిశోధనా సంస్థ జట్టుకట్టనున్నట్లు సమాచారం. కాగా, కరోనా వ్యాక్సిన్ కోసం 'జాన్సన్ అండ్ జాన్సన్' కంపెనీతో అమెరికా భారీ డీల్ కుదుర్చుకుంది. దీని విలువ రూ.3,438 కోట్లు. దీనికి సంబంధించిన ఒప్పందంపై అమెరికా ప్రభుత్వానికి చెందిన బయోమెడికల్ అండ్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(బార్డా), జాన్సన్ అండ్ జాన్సన్ సంతకాలు చేశాయి.

### మీడియాలో ఫేస్‌బుక్ భారీ పెట్టుబడులు

శాన్‌ఫ్రాన్సిస్కో, మార్చి 30: కరోనాపై పోరాటానికి మద్దతుగా సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ స్థానిక జర్నలిజంలో రూ.750 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. మీడియాతో బలమైన సంబంధాలు కొనసాగిస్తున్న ఫేస్‌బుక్ ఈ రంగంలో రూ.2,250 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు ఇదివరకే ప్రకటించింది. ఇప్పుడు ప్రకటించిన ఈ 750 కోట్లు దానికి అదనం.

### ముగిసిన హెచ్1-బీ వీసా దరఖాస్తుల పరిమితి

వాషింగ్టన్, మార్చి 30: అమెరికాలో పనిచేసేందుకు వృత్తి నిపుణులకిచ్చే 65 వేల హెచ్1-బీ వీసాల దరఖాస్తుల పరిమితి ముగిసిందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తెలిపింది. ఎంపికైన వారి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, దరఖాస్తులు సమర్పించడానికి జూన్ 30 చివరి తేదీ అని ప్రకటించింది.

### వైద్యులకు ఫైవ్‌స్టార్ హోటళ్లలో క్వారంటైన్

లఖ్‌నవూ, మార్చి 30: కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని లఖ్‌నవూలోని 4 ఫైవ్‌స్టార్ హోటళ్లలో క్వారంటైన్‌లో ఉంచనున్నారు. వారికి హోటల్ హయాత్, హోటల్ ఫైర్‌ఫీల్, హోటల్ పికాడిలీ, హోటల్ లెమన్ ట్రీలో వసతి కల్పించనున్నారు.

### లాక్‌డౌన్‌లో రూ.10 ఉచిత టాక్‌టైమ్

న్యూఢిల్లీ, మార్చి 30: లాక్‌డౌన్‌తో రిచార్జ్ చేయించుకోని వినియోగదారులకు రూ.10 టాక్‌టైమ్ అందిస్తామని బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఎయిర్‌టెల్ ప్రకటించాయి. ప్రీ పెయిడ్ వ్యాలిడిటీని ఏప్రిల్ 17 వరకు పొడిగిస్తామని వెల్లడించాయి. ఈ ప్రయోజనాలను 48 గంటల్లోగా వినియోగదారులకు అందజేస్తామన్నాయి.

### బ్రహ్మకుమారీ చీఫ్‌గా దాదీ హృదయ మోహిని

జైపూర్, మార్చి 30: బ్రహ్మకుమారీ సంస్థ కొత్త చీఫ్‌గా రాజయోగిని దాదీ హృదయ మోహిని నియమితులయ్యారు. ఈ మేరకు బ్రహ్మకుమారీ సంస్థ యాజమాన్య కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఇటీవల పరమపదించిన రాజయోగిని దాదీ జానకి స్థానంలో ఆమె ఎంపికయ్యారు. సంస్థ అదనపు ముఖ్య పాలనాధికారిగా దాదీ రతన్ మోహిని, సంయుక్త ముఖ్య పాలనాధికారిగా ఇషు దాదీ నియమితులయ్యారు.

### డీడీలో 'శక్తిమాన్' మళ్లీ వస్తున్నాడహో!!

ముంబై, మార్చి 30: లాక్‌డౌన్ వేళ బుల్లితెర వీక్షకులను అలరించేందుకు దూరదర్శన్‌లో అలనాటి 'రామాయణ్', 'మహాభారత్' సీరియళ్లను పునః ప్రసారం చేస్తున్న సంగతి తెలిసిందే. 'శక్తిమాన్' కూడా త్వరలో డీడీలో ప్రసారమవుతుందని దాని కథానాయకుడు 61 ఏళ్ల ముకేశ్ ఖన్నా ట్వీట్ చేశారు. అయితే ప్రసారమయ్యే తేదీని ప్రకటించలేదు. లాక్‌డౌన్ ముగిసిన తర్వాత 'శక్తిమాన్' సీక్వెల్ నిర్మాణంపై దృష్టిసారిస్తామని స్పష్టం చేశారు.

# కరోనాపై సీసీఎంబీ సమరం

**వారంలోగా కొవిడ్-19 ఆర్ఎన్ఏ విశ్లేషణ**

**'ఆంధ్రజ్యోతి' తో సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా**



**కరోనాపై పోరులో సీసీఎంబీ పాత్ర ఏమిటి?**

కరోనా నిర్ధారణ పరీక్షలను సీసీఎంబీ ఇప్పటికే ప్రారంభించింది. దీంతోపాటు ఆ వైరస్ జన్యుక్రమాన్ని కనుగొని, దానిలో వస్తున్న మార్పులను గుర్తించడానికి పరిశోధనలు చేస్తున్నాం. దీన్ని కనుగొనగానే దాని ఆధారంగా.. వైరస్‌పై ఏయే మందులు ప్రభావవంతంగా పనిచేస్తాయో ప్రయోగపూర్వకంగా తెలుసుకుంటాం.

**రోజుకు ఎన్ని నిర్ధారణ పరీక్షలు చేయగలరు?**

ప్రస్తుతానికి రోజుకు 750దాకా పరీక్షలు చేయగలం. హైదరాబాద్‌లోనే ఉన్న సీడీఎఫ్‌డీ లాంటి పరిశోధనా సంస్థల సహకారం లభిస్తే వెయ్యి దాకా ఈ పరీక్షలు చేయొచ్చు. దీంతోపాటు అతిచౌక కరోనా పరీక్షల కిట్ల అభివృద్ధికి మేం ప్రయత్నాలు మొదలుపెట్టాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కిట్ల కంటే మేం తయారుచేయనున్న కిట్ల రేటు చాలా తక్కువ.

**జన్యుక్రమంపై సాగుతున్న పరిశోధనలేంటి?**

హైదరాబాద్‌లో చికిత్స పొందిన కరోనా పాజిటివ్ కేసుల నుంచి వైరస్ నమూనాలను సేకరించి, వాటిపై పరిశోధనలు ప్రారంభించాం. వారం రోజుల్లోగా ఈ వైరస్ ఆర్ఎన్ఏ విశ్లేషణ చేయగలుగుతాం. ఆ ఫలితాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత వైరస్‌ను ఎలా ఎదుర్కోవచ్చనే విషయంపై స్పష్టత వస్తుంది.

**మందు తయారీకి సాగుతున్న పరిశోధనలు...**

మాకు మందులు తయారుచేసే సామర్థ్యం లేదు. కానీ మానవుల నుంచి సేకరించిన కణాలపై ప్రయోగశాలలో కరోనా వైరస్‌ను ప్రయోగించి, వాటికి అందుబాటులో ఉన్న మందులను ఇస్తాం. దీనికి శరీర కణాలు ఎలా స్పందిస్తున్నాయో కనుగొంటాం.

**కొవిడ్-19లో ఇప్పటివరకు ఎలాంటి మార్పులు జరిగి ఉండొచ్చు ? అది బలహీనపడుతోందా?**

వైరస్ జన్యువుల్లో మార్పులు జరగడమనేది ఒక నిరంతర ప్రక్రియ. అలాగే కొవిడ్-19 వైరస్‌లోనూ కొన్ని మార్పులు జరుగుతున్నాయి. ఇంకా జరుగుతాయి కూడా. వైరస్‌లో ఎలాంటి మార్పులు వచ్చాయనే విషయం ఆర్ఎన్ఏ విశ్లేషణ తర్వాతే తెలుస్తుంది. అయితే ఏ వైరస్ అయినా కాలంతోపాటు బలపడుతుంది తప్ప బలహీనపడదు.

**ఎండలు పెరిగితే కరోనా వ్యాప్తి తగ్గుతుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి కదా.. మీ అభిప్రాయమేమిటి?**

ఔను.. నేను కూడా చూశా. అయితే ఇవన్నీ పరిశోధనా శాలల్లో కట్టుదిట్టమైన పరిస్థితుల్లో చేసిన పరిశోధనలు. చాలా ప్రాథమికమైన పరిశోధనలు. మరిన్ని అధ్యయనాలు జరిగితే తప్ప ఆ విషయాన్ని కచ్చితంగా చెప్పలేం.

**కరోనాపై పోరాడే శక్తి భారతీయులకు జన్యుపరంగా ఉందని ఓ పరిశోధనాపత్రంలో ప్రస్తావించారు. ఇది ఎంత వరకు నిజం?**

ఈ పరిశోధనాపత్రాన్ని నేను కూడా చూశా. ఆ పరిశోధకులు రెండు ఆర్ఎన్ఏ నమూనాల ఆధారంగా ఈ ప్రతిపాదన చేశారు. కొన్ని సమూహాల ప్రజలకు ఈ వైరస్‌ను తట్టుకొనే సామర్థ్యం ఉండొచ్చు. కానీ ఇది ప్రాథమిక పత్రం మాత్రమే. దీనిపై ఇంకా సమీక్ష (పీర్ రివ్యూ) జరగాల్సి ఉంది. సాధారణంగా చాలా ఎక్కువ నమూనాలను తీసుకొని తులనాత్మకంగా విశ్లేషించిన తర్వాతే ఈ విధమైన నిర్ణయాలకు రావాలి. లేకపోతే అవి తప్పు అయ్యే ప్రమాదం ఉంటుంది.

**కరోనా వేగంగా వ్యాపించడానికి ప్రధాన కారణమేమిటి?**

ప్రతి వైరస్‌కు ఒక రిసెప్టర్ ఉంటుంది. దీని ద్వారానే వైరస్ శరీర కణాల్లోకి ప్రవేశిస్తుంది. సాధారణంగా మన శరీర కణాలు ఈ రిసెప్టర్లను పసిగట్టి, అవి లోపలికి ప్రవేశించకుండా పెద్ద యుద్ధమే చేస్తాయి. కరోనా వైరస్ రిసెప్టర్ మిగిలిన వాటి కంటే చాలా భిన్నంగా ఉండటంతో దీన్ని మన శరీర కణాల్లో ఉండే రిసెప్టర్లు అడ్డుకోవు. అందువల్లే ఈ వైరస్ చాలా వేగంగా వ్యాపిస్తోంది.

**కరోనా కట్టడిపై తెలంగాణ ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీలో మీరు కూడా ఉన్నారు కదా.. కమిటీ తరపున ఎలాంటి సలహాలిచ్చారు ?**

రెండు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశాం. వీటిలో మొదటిది హెల్త్ వర్కర్స్‌కు అవసరమైన సామగ్రిని సమకూర్చడం. వారికి అవసరమైన మాస్కులు, బాడీ సూట్‌లు, శానిటైజర్లు ఇతర సామగ్రిని అందించమని ప్రభుత్వాన్ని కోరాం. కరోనాపై అవగాహన కల్పించే సందేశాలను వీలైనంత ఎక్కువగా ప్రజలకు పంపమని కోరాం. అవగాహన పెరుగుతున్న కొద్దీ ఈ మహమ్మారిని ఎదుర్కోవడం సులభమవుతుంది.

**తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మీ అభిప్రాయం..**

మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణా ప్రభుత్వం ముందు ఉంది. ప్రభుత్వం చాలా మంచి చర్యలు తీసుకుంటోంది. నా ఉద్దేశంలో లాక్‌డౌన్ చాలా మంచి చర్య. దీని వల్ల ఈ వ్యాధి ఒకేసారి వేల మందికి రాకుండా ఉంటుంది. అందరూ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఒకటే. ఈ వైరస్‌కు వ్యాక్సిన్ లేదు. మందు లేదు. అందువల్ల భౌతిక దూరం ఒకటే మనకున్న మార్గం. దీనిని అందరూ పాటిస్తేనే మంచిది.

- స్పెషల్ డెస్క్

## కరోనా భయం.. కువైత్‌లో అమ్నెస్టీ

**విదేశీయులను అరెస్టు చేసి, సాగనంపే ప్రణాళిక**

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కరోనా బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడం, వారిలో విదేశీయులు సైతం ఉంటుండడంతో కువైత్ ప్రభుత్వం మరోసారి అమ్నెస్టీ ప్రకటించింది. ఈ మేరకు భారతీయులతోపాటు విదేశీయులు అధికంగా ఉంటున్న ప్రాంతాలను దిగ్బంధించి.. వేలాది మందిని అరెస్టు చేయడానికి కువైత్ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీరిందరినీ తాత్కాలిక జైళ్లుగా వినియోగిస్తున్న పాఠశాలల భవనాల్లో కనీస వ్యవధి వరకూ క్వారంటైన్‌లో ఉంచి, కరోనా లేదని వైద్యపత్రాలను జతపర్చి స్వదేశాలకు పంపే అవకాశాలను పరిశీలిస్తున్నారు. చిన్న దేశమైన కువైత్‌లో మొత్తం 266 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, అందులో భారతీయులే 25 మంది ఉన్నారు. దీంతో ఇక్కడి ప్రభుత్వం అప్రమత్తమై ఆమ్నెస్టీ ప్రకటించింది. ఇందులో భాగంగా వీసా గడువు ముగిసిన తర్వాత కూడా ఇక్కడే ఉంటున్న వారు, చిన్న నేరాలకు పాల్పడి స్వదేశానికి వెళ్లకుండా ఉన్న విదేశీయులు.. మాతృదేశానికి వెళ్లేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తే కువైత్ ప్రభుత్వమే ఉచితంగా విమాన టికెట్లు సమకూర్చనుంది. ఇందులో నమోదు చేసుకునేందుకు వివిధ జాతీయతల ఆధారంగా వేర్వేరు తేదీలను కేటాయించింది. ఇందులో భారతీయులకు వచ్చే నెల 11-14 వరకు తేదీలను ఖరారు చేసింది. వీరిని పంపేందుకు ప్రత్యేక విమానాలకు అనుమతి ఇవ్వాల్సిందిగా భారత్‌పై కువైత్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోంది. వాస్తవానికి కువైత్‌లో ఏపీకి చెందిన వేలాది మంది అక్రమంగా ఉంటున్నారు. కువైత్‌లో కొన్ని రోజులు, భారత్‌లో మరికొన్ని రోజులు క్వారంటైన్‌లో ఉండడానికి తెలుగు ప్రవాసీయులు ముందుకు రాకపోవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## అపోలో 'ప్రాజెక్ట్ స్టే ఐ' ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 30: కరోనాపై పోరాటంలో భాగంగా అపోలో హాస్పిటల్స్.. 'ప్రాజెక్ట్ స్టే ఐ' పేరుతో ఓ కొత్త పథకానికి సోమవారం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 500 గదులను ప్రాథమిక వైద్య సదుపాయాలు కలిగిన క్వారంటైన్, ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చనున్నట్లు అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి వెల్లడించారు. ఈ గదుల్లో వైద్య సదుపాయాలకు ఎలాంటి ఫీజూ వసూలు చేయమని, మందులకు మాత్రం ఎంఆర్‌పీ ప్రకారం చార్జ్ చేస్తామని అపోలో గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి చెప్పారు. గదులు అవసరమైన వారు 18605000202 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

### గుండె వ్యాధులు లేకున్నా కరోనాతో ఆస్కారం!

హూస్టన్, మార్చి 30: గుండె, రక్తనాళాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేని వ్యక్తులకూ కొవిడ్-19 సోకితే సదరు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. కొవిడ్‌తో ఊపిరి పీల్చుకోవడం కష్టం కావచ్చు. అది ఊపిరితిత్తులను దెబ్బతీయవచ్చు. కొన్ని కేసుల్లో అది మరణించడానికి కారణం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంతకుమునుపు గుండె సంబంధ వ్యాధులేవీ లేకున్నప్పటికీ గుండె కండరాలపై అది ప్రభావం చూపవచ్చని హూస్టన్‌లోని ద యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ హెల్త్ సైన్స్ సెంటర్‌కు చెందిన ప్రొఫెసర్ ఒకరు తెలిపారు.

## మరో 131 మొబైల్ రైతుబజార్లు

- ధరల నియంత్రణకు జిల్లా స్థాయి కమిటీలు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న

విజయవాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మరో 131 మొబైల్ రైతుబజార్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ప్రద్యుమ్న వెల్లడించారు. విజయవాడలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి నిత్యం 21వేల క్వింటాళ్ల కూరగాయలు వస్తున్నాయని, అదే పరిమాణాన్ని కొనసాగించాలని జిల్లా అధికారులకు, మార్కెటింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. సొంతంగా ట్రాలీ, గూడ్స్ వ్యాన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే, వారికీ మొబైల్ రైతుబజార్ నిర్వహణకు అనుమతిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రైతుబజార్లకు 2కిలోమీటర్ల దూరంలో ఈ వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బియ్యం, పప్పులు, కూరగాయలు, పాలు తదితర నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడానికి జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. నిత్యావసర సరుకుల సరఫరా, ఇతర సమస్యలను తెలుసుకునేందుకు విజయవాడలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో 24/7 కమాండ్ కంట్రోల్‌సెంటర్‌నుఏర్పాటుచేశామని చెప్పారు.

## లాక్‌డౌన్‌లో ఈ-పాస్‌లు

- క్యూఆర్ కోడ్‌తో జారీ
- ప్రత్యేక పర్యవేక్షణాధికారి హిమాన్షు శుక్లా

అమరావతి, విజయవాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్రంలో అత్యవసర సేవలు, నిత్యావసరాల సరుకుల సరఫరాలో భాగస్వామ్యమైన వారికి ఎమర్జెన్సీ పాస్‌లు అందించనున్నట్టు కోవిడ్ నివారణ ప్రత్యేక పర్యవేక్షణాధికారి, చేనేత, జౌళిశాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం విజయవాడలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకు ప్రజలకు నిత్యావసరాలను కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. వాటిని సరఫరా చేసే వాహనాలకు పాస్‌లు లేకపోవడంతో కొన్ని చెక్‌పోస్టుల వద్ద ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య లేకుండా చేయడానికే ఈ-పాస్‌ల విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రధానంగా ప్రైవేట్ రంగ కర్మాగారాలు, కార్యాలయాలు, సంస్థల్లో పని చేసే ఉద్యోగుల కోసం 'కోవిడ్-19 అత్యవసర పాస్'లు జారీ చేస్తామన్నారు. పాస్ పొందేందుకు ఎవ్వరూ కార్యాలయాలకు రానవసరంలేదని, ఆన్‌లైన్‌లో పూర్తి చేయవచ్చని తెలిపారు.https://gramawa rdsachivalayam.ap.gov.in/cvpassapp/cv/cvorganizationregis-rtion ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

# మరో ఇద్దరికి కరోనా

- 'తూర్పు'లో 2 పాజిటివ్ కేసులు.. బాధితులు ఇద్దరికీ 'ఢిల్లీ కనెక్షన్'
- రాష్ట్రంలో 23కి చేరిన బాధితులు
- గుంటూరులో క్యూ కట్టిన అనుమానితులు

జీజీహెచ్(కాకినాడ), గుంటూరు, మార్చి 30: రాష్ట్రంలో కరోనా కోరలు చాస్తోంది. వరుసగా రెండో రోజూ 2 కేసులు పాజిటివ్‌గా తేలాయి. అవి కూడా ఢిల్లీ కనెక్షన్ కేసులు కావడంతో భయాందోళన మొదలైంది. తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క కేసే ఉండగా సోమవారం మరో ఇద్దరికి కొవిడ్-19 పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య 23కి చేరింది. కాకినాడ బ్యాంకుపేటకు చెందిన 49 ఏళ్ల వ్యక్తి, రాజమండ్రి రూరల్ మండలం కాతేరుకి చెందిన 72 ఏళ్ల వృద్ధుడు ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చారు. వారికి పరీక్షలు నిర్వహించగా సోమవారం వచ్చిన రిపోర్టులో ఇద్దరికీ పాజిటివ్ వచ్చినట్టు నోడల్ అధికారి డాక్టర్ ఎం.కిరణ్ తెలిపారు. బ్యాంకుపేటలో పాజిటివ్ వచ్చిన వ్యక్తి కుటుంబసభ్యుల్లో ఆయన తల్లి(65), భార్య(35), ఇద్దరు కొడుకులు(11, 12 ఏళ్లు), కుమార్తె(7)ను కూడా జీజీహెచ్‌కు తరలించారు. జగన్నాథపురానికి చెందిన వ్యక్తి నివేదిక రావాల్సి ఉంది. ఇటీవల లండన్ వెళ్ళొచ్చిన రాజమండ్రి నగరానికి చెందిన ఎంబీఏ విద్యార్థి జిల్లాలో తొలి పాజిటివ్ కేసుగా తేలిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

### కాతేరులో కలకలం

రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలోని శాంతినగర్‌కు చెందిన వ్యక్తికి పాజిటివ్ రావడంతో ఆ ప్రాంతమంతా కలకలం రేగింది. అధికారులంతా అప్రమత్తమయ్యారు. ఆయన సమీపంలోని కోలమూరు, జాంపేట ప్రాంతాలకు చెందిన వారితో కలిసి మొత్తం 25 మంది ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత మేకను కోసి విందు ఇచ్చారని ఇక్కడి సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులను, మరో వీధిలో ఉండే ఆయన చిన్నకొడుకు కుటుంబ సభ్యులు మొత్తం 16 మందిని క్వారంటైన్‌కు తరలించారు.

### రెండు రోజుల్లో 97 మంది శాంపిల్స్

గుంటూరు జిల్లాను కరోనా భయం వెంటాడుతోంది. సోమవారం 200 మంది కరోనా భయంతో నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రులకు వచ్చారు. వీరిలో 42 మంది నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఆదివారం కూడా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అనుమానిత లక్షణాలతో 200 మంది రాగా.. 55 మంది నుంచి శాంపిల్స్ సేకరించారు. అంటే రెండు రోజుల వ్యవధిలోనే 97 మంది నుంచి శాంపిల్స్ సేకరించడం విశేషం. జిల్లాలో ఇప్పటి వరకు 142 మంది అనుమానితుల నుంచి నమూనాలు సేకరించగా వారిలో నలుగురికి కరోనా పాజిటివ్, 61 మందికి నెగెటివ్ వచ్చింది. 77 మంది నివేదికలు రావాల్సి ఉంది.

# తెలంగాణలో సగం జీతం కోత!

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో సమీక్ష జరిపారు. కరోనా ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా పడుతుందని ఈ సమావేశంలో అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుచూపుతో పలు నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలోనే కోతల నిర్ణయం తీసుకున్నారు.

### ఎవరెవరికి కోత?

- ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు, స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధుల వేతనాల్లో 75 శాతం కోత.
- ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి అఖిలభారత సర్వీసు అధికారుల వేతనాల్లో 60 శాతం కోత.
- మిగతా అన్ని విభాగాల ఉద్యోగుల వేతనాల్లో 50 శాతం
- నాలుగో తరగతి, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల్లో 10 శాతం
- అన్ని రకాల రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లలో 50 శాతం కోత.
- నాలుగో తరగతి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లలో 10 శాతం
- ప్రభుత్వరంగ, ప్రభుత్వ గ్రాంటు పొందుతున్న సంస్థల ఉద్యోగులకు 50 శాతం.

### ఏ చట్టం కింద కోత?

కోత నిర్ణయం వివరాలను సీఎం కార్యాలయం మీడియాకు వెల్లడించింది. అయితే, ఈ కోత ఒక్క నెలకేనా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చక్కబడే వరకు ఉంటుందా? అనేది స్పష్టం చేయలేదు. కోత పెట్టిన సొమ్మును భవిష్యత్తులో ఇస్తారా? ఎప్పటికీ రావా? అన్నది కూడా చెప్పలేదు. ఏ చట్టం కింద వేతనాల్లో కోత పెడుతున్నారో కూడా స్పష్టం చేయలేదు. కాగా, ఐఏఎస్‌ల నియామకం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతుంది. వారి వేతనాల్లో కోత పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వం అనుమతి కావాలంటున్నారు.

### కరోనా యోధులకు కోతా?

కరోనాపై పోరాటంలో ముందు వరుసలో నిలిచిన వైద్య శాఖ సిబ్బందికి కూడా సగం జీతం కోత పెట్టడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది తమ ప్రాణాలను ఫణంగా పెట్టి కొవిడ్ రోగుల మధ్య పని చేస్తున్నారు. వారికి ఇన్సెంటివ్‌లు ఇవ్వడం పోయి ఏకంగా జీతాల్లో కోత పెట్టడంపై చర్చ జరుగుతోంది.

# ఖుల్లా మాల్.. సరుకు నిల్

**మరొక వారం ఇలాగే ఉంటే మన వంటిళ్లలో కల్లోలమే**

- తెరిచారని షాపుల్లోకి వెళ్లి
- తెల్లముఖాలతో బయటకి..
- కూరలు మాత్రమే లభ్యం
- ఇతర రాష్ట్రాల సరుకులన్నీ
- రోడ్లపై నిలిపివేతే కారణం
- సప్లైచెయిన్ తెగి అవస్థలు
- సరుకురాక గోదాము వెలవెల

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): "కూరలు, సరుకులు దొరకవేమోనన్న ఆందోళన అక్కర్లేదు. దేనికీ కొరత లేదు. తొందరగా వంటింటి సరుకులు తీసుకోవాలన్న ఆత్రుత అవసరం లేకుండా లాక్‌డౌన్ విరామాన్ని మధ్యాహ్నం ఒంటి గంట దాకా పొడిగిస్తున్నాం.. అప్పటిదాకా మీకోసం షాపులు, మాల్స్ తెరిచే ఉంటాయి" అని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ ప్రకటన తరువాత ఓ బడా అధికారి శనివారం ఉదయం ఏడు గంటలకు విజయవాడలోని ఓ ప్రముఖ కిరాణా స్టోర్‌కు వెళ్లారు. అదృష్టం...అది తెరిచే ఉంది. అడిగితే.. మధ్యాహ్నం దాకా తెరిచే ఉంచుతున్నామని అక్కడి పనివారు చెప్పారు. దీంతో సంతృప్తిగా ఆయన స్టోరులోకి అడుగుపెట్టారు. ఉప్పు, పప్పు, కాఫీ పౌడర్, ఇతర సామాగ్రి ఉంచే ర్యాక్‌లన్నీ అక్కడ ఖాళీగా కనిపించాయి. కూరగాయలు మాత్రం కనిపిస్తున్నాయి. సరుకులేవి? అంటే...వాటిని తీసుకొచ్చే వాహనం రాలేదని అక్కడి పనివారు బదులిచ్చారు. ఆ వెంటనే మరో స్టోర్‌కు వెళ్లారు. అక్కడా అదే పరిస్థితి! మరో స్టోర్‌కు పరుగుపరుగున వెళ్లారు! అక్కడ మాత్రం ఒక టీ పౌడర్ లభించింది. కేజీ కందిపప్పు కావాలంటే....పావు కిలో మాత్రమే ఇస్తామన్నారు. అదేమంటే...లోడ్ తీసుకురావాల్సిన వాహనం ఆపేశారు, ఎప్పుడు వస్తుందో తెలియదని సమాధానం! ఉన్న సరుకునే కొంచెం కొంచెం సర్దుబాటు చేస్తున్నామని ఆ అధికారికి వివరించారు. చేసేదేముంది.. ఇచ్చిన దాంతోనే ఆయన సంతృప్తిపడి బయటపడ్డారు. ఒక ఉన్నతస్థాయి అధికారికే ఈ పరిస్థితి ఎదురైతే ఇక సామాన్యుడి పరిస్థితి ఏమిటి?



కూరగాయలు మినహా మిగతా నిత్యావసర సరుకులు స్థానికంగానేకాదు, ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేస్తుంటారు. బియ్యం, పప్పులు, ఉప్పు, మిర్చీ, నూనెలు ఎక్కువగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి తెప్పించుకుంటారు. లాక్‌డౌన్ కారణంగా వీటికి సంబంధించిన లారీలు, వాహనాలు నిలిచిపోయాయి. దీంతో నిత్యావసరాల పంపిణీలో కీలకమైన సప్లై చెయిన్ దెబ్బతింటోంది. వాహనాల నిలిపివేత వల్ల ఇతర రాష్ట్రాల నుంచి రావాల్సిన సరుకులు నిలిచిపోయాయని వర్తకులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. " మా దగ్గర ఉన్న సరుకు దాదాపుగా ఖాళీ అవుతోంది. స్టాక్ పాయింట్లు లేదా గోడౌన్ల నుంచి కొత్తగా సరుకులు రావాలి. అది జరగాలంటే ముందు అక్కడికి సరుకును తీసుకొచ్చే వాహనాలు వెళ్లాలి. అది జరగడం లేదు. ఎక్కడెక్కడి వాహనాలన్నీ రోడ్లపైనే నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, మరి కొద్ది రోజుల్లో అన్నీ ఖాళీ అవుతాయి. మేం షాపులు తీసినా వినియోగదారులకు సరుకులు ఇవ్వలేని పరిస్థితి. అప్పుడు లాక్‌డౌన్ నుంచి మాకు మినహాయింపు ఇచ్చినా మేం ఎవ్వరికీ సహాయం చేయలేని దుస్థితి వస్తుంది. దీనికి ఒక్కటే పరిష్కారం. సరుకు వాహనాలను పూర్తిగా అనుమతించాలి. స్టాక్‌పాయింట్లు, పంపిణీ కేంద్రాలు పూర్తిగా పనిచేసేలా వెసులుబాటు కల్పించాలి. అప్పుడే షాపులకు సరుకులు చేరుతాయి" అని ఆంధ్రప్రదేశ్ వర్తక సంఘానికి చెందిన ప్రతినిధి ఒకరు చెప్పారు.

### తెచ్చిన సరుకు ఏది?

జనతా కర్ఫ్యూ రోజు రాత్రే సూపర్‌మార్కెట్లు, కిరాణా, పచారీ షాపులు సగానికి సగం ఖాళీ అయ్యాయి. కార్పొరేట్ కంపెనీలు నిర్వహించే ఫ్రెష్‌లు, స్టోర్‌ల పరిస్థితీ ఇలాగే ఉంది. లాక్‌డౌన్ ఎన్ని రోజులు ఉంటుందోనన్న భయంతో ప్రజలు షాపుల్లో ఉన్న సరుకులను అవసరానికి మించి కొనుగోలు చేసి తీసుకెళ్లిపోయారు. ఇప్పుడు కార్పొరేట్ ఫ్రెష్‌ల నుంచి చిన్నస్థాయి పచారీ కొట్టుల మేర సరుకులు నిండుకున్నాయి. మరోవైపు లాక్‌డౌన్ తర్వాత వాహనాలను ఆపేస్తున్నారు. నిత్యావసరాలకు మినహాయింపు ఉందని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెప్పినా, అనేక ఆదేశాలు ఇచ్చినా....ఆచరణలో అది అమలు కావడం లేదని తాజా పరిస్థితి నిరూపిస్తోంది.

### జేసీలు ఏం చేస్తున్నట్లు?

నిత్యావసరాల పంపిణీ, రవాణా, పర్యవేక్షణ బాధ్యతను పౌరసరఫరాల శాఖతోపాటు, రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. జిల్లాల్లో జాయింట్ కలెక్టర్లదే ఆ బాధ్యత. లాక్‌డౌన్ నేపథ్యంలో సరుకుల రవాణా వాహనాలను పోలీసులు ఎక్కడిక్కడ అడ్డుకోకుండా, అవి గమ్యస్థానానికి చేరేలా వారు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. దీనిపై పోలీసులకు ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఇవ్వాలి. ముఖ్యంగా సప్లై చైన్ ఎలా ఉంది? ఎక్కడ కొరత ఉంది? అన్నది సమీక్షించాలి. ఈ పనిచేయాల్సిన జేసీలు కూడా కరోనా విపత్తు చర్యల్లో పాల్గొంటున్నారు. "ఇప్పటిదాకా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సప్లైచైన్ నిలిచిపోకుండా ఏ ఒక్క చర్య తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇదే పరిస్దితి కొనసాగితే మరింత ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయి. సరుకులు బ్లాక్‌మార్కెట్ కాకుండా చూడటం ఎంత ముఖ్యమో...అవి రోడ్లమీద నిలిచిపోకుండా అడ్డుకోవడం అంతే ముఖ్యం. " అని గతంలో పౌరసరఫరాల శాఖ వ్యవహారాల పర్యవేక్షించిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి అభిప్రాయపడ్డారు.

# ఒక్క రోజే 5 కరోనా మరణాలు

- అందరూ ఢిల్లీ మర్కజ్ మసీదుకు వెళ్లినవారే
- కొత్తగా 6... మొత్తం 76కు పెరిగిన కేసులు
- నిలోఫర్‌లో మూడేళ్ల పాపకు సోకిన కరోనా .. 13 మంది డిశ్చార్జి

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనా మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఆదివారం వరకు ఒకే మరణం నమోదవగా... ఒక్క రోజే ఐదుగురు చనిపోయినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం రాత్రి వెల్లడించింది. ఈ నెల 13 నుంచి 15 వరకు ఢిల్లీలోని మర్కజ్‌లో మతపరమైన ప్రార్థనల్లో పాల్గొన్నవారిలో కొందరికి కరోనా వైరస్ సోకింది. అందులో తెలంగాణకు చెందిన వారూ ఉన్నారు. వారిలో ఆరుగురు మరణించారు. ఇద్దరు గాంధీ ఆస్పత్రిలో, అపోలో, గ్లోబల్ ఆస్పత్రులు, నిజామాబాద్, గద్వాలలో ఒక్కొక్కరు మరణించారు. వీరి ద్వారా వైరస్ సోకే అవకాశం ఉందని భావిస్తున్న అనుమానితులను అయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలు గుర్తించి ఆస్పత్రులకు తరలిస్తున్నాయి.

### మరో 6 కేసులు నమోదు

సోమవారం తెలంగాణలో మరో ఆరు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో కేసుల సంఖ్య 76కు చేరింది. అయితే ఆరుగురు కరోనాతో చనిపోవడం, 14 మందిని డిశ్చార్జి చేయడంతో ప్రస్తుతం 56 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరీంనగర్‌లో ఇండోనేషియా బృందంతో కలసి తిరిగిన ఓ యువకుడికి కరోనా సోకిన సంగతి తెలిసిందే. తాజాగా అతని తల్లి, సోదరికి కూడా పాజిటివ్ వచ్చింది. ఆ కుటుంబంలో మొత్తం ఏడుగురు ఉన్నారు. అందులో ముగ్గురు ఐదేళ్లలోపు వారు. ప్రస్తుతం ఇద్దరికి మాత్రమే కరోనా బయటపడింది. మిగిలిన వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక సోమవారం 13 మందిని డిశ్చార్జి చేస్తున్నట్లు మాత్రమే ప్రకటించారు తప్ప వారెవరో కూడా వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించలేదు.

## జియోట్యాగింగ్‌తో పెన్షన్లు

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం.. పెన్షన్ల పంపిణీ లోనూ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఏప్రిల్‌లో పంపిణీ చేసే పెన్షన్లను బయోమెట్రిక్ విధానంలో కాకుండా జియోట్యాగింగ్ ద్వారా ఇచ్చేందుకు సెర్ప్ చర్యలు తీసుకుంది. వలంటీర్ తనకు కేటాయించిన 50 కుటుంబాల వద్దకు వెళ్లి పెన్షన్‌దారులకు నగదు నేరుగా అందిస్తారని, పెన్షన్ తీసుకుంటున్న సమయంలో సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారని సెర్ప్ సీఈవో రాజాబాబు తెలిపారు. వృద్ధు లు, వికలాంగులు, వితంతువులెవరైనా, ఎక్కడి నుంచైనా పెన్షన్ పొందేందుకు పోర్టబులిటీ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు.

## శ్రీవారి దర్శనాల రద్దు ఏప్రిల్ 14 వరకు పొడిగింపు

తిరుమల, మార్చి 30: లాక్‌డౌన్ నేపథ్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాల నిలుపుదలను ఏప్రిల్ 14వ వరకు పొడిగిస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. తొలుత మార్చి 20 నుంచి 27 వరకు శ్రీవారి దర్శనాలను రద్దు చేసి భక్తులెవ్వరు తిరుమలకు రాకుండా ఘాట్‌రోడ్లు మూసివేశారు. ఆ తర్వాత 31 వరకు దర్శనాలు రద్దు చేస్తున్నట్టు టీటీడీ ప్రకటించింది. తాజాగా ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్ ఉండడంతో శ్రీవారి దర్శనాలను కూడా అప్పటివరకు నిలుపుదల చేస్తున్నట్టు సోమవారం టీటీడీ ప్రకటించింది. ఏప్రిల్ 2న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే హనుమంత వాహనసేవను రద్దుచేసి శ్రీరామనవమి ఆస్థానం, 3న శ్రీరామ పట్టాభిషేక వేడుకలను, 5 నుంచి 7 వరకు జరుగనున్న వార్షిక వసంతోత్సవాలను కూడా ఏకాంతంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

## వేతనాల్లో కోతపై పునరాలోచించాలి: ఐక్య వేదిక

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేతనాల్లో కోత నిర్ణయాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రభుత్వరంగ, కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య వేదిక తీవ్రంగా ఖండించింది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ ప్రభావం ఉన్నప్పటికీ ఇంత తీవ్రమైన నిర్ణయం ఏ దేశంగానీ, ఏ రాష్ట్రం గానీ తీసుకోలేదని సంఘం నేతలు చావ రవి, సదానంద గౌడ అన్నారు. నిజంగా ఆర్థిక పరిస్థితి విషమంగా ఉంటే ప్రభుత్వం నుంచి వేల కోట్ల రాయితీలు పొందుతున్న వ్యాపార వర్గాల రాయితీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీతాల తగ్గింపు పూర్తి తిరోగమన చర్య అని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

### విద్యుత్ ఉద్యోగులకు కోత లేకుండా వేతనాలు

లాక్‌డౌన్‌తో ఆర్థిక సంక్షోభం ముసురుకున్నప్పటికీ విద్యుత్ ఉద్యోగులకు మార్చి నెలకు సంబంధించిన వేతనాలు చెల్లించాలని విద్యుత్ సంస్థలు నిర్ణయించాయి.

## 'వేతనాల్లో కోత' వదంతులే : వెంకట్రామిరెడ్డి

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరోనా ఎఫెక్ట్ వల్ల ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో 30 శాతం కోత విధిస్తారంటూ వస్తున్న వార్తలు కేవలం వదంతులేనని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. వీటిని నమ్మొదని ఉద్యోగులకు సూచించారు. వేతనాల్లో కోత విధించేలా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని తెలిపారు. ఆర్థికశాఖ అధికారులతో కూడా తాను మాట్లాడానని, మార్చి నెలకు సంబంధించిన వేతన బిల్లులన్నీ పాస్ అయ్యాయని ఆయన ప్రకటించారు.

# కరోనా కంటే కాఠిన్యమా?

*104 రోజులైనా పట్టించుకోరా?*
*మేం ఈ దేశంలో భాగం కాదా?*

- అమరావతి రైతులు, మహిళల ఆవేదన
- కొనసాగిన రాజధాని ఆందోళనలు

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తాము చేస్తున్న రాజధాని ఉద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా వైరస్ కన్నా కఠినంగా వ్యవహరిస్తున్నాయని రాజధాని అమరావతి ప్రాంత రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి కొనసాగిన జమ్ము కశ్మీర్ సమస్యకు కేవలం రెండు గంటల్లోనే చెక్ పెట్టారని, కానీ, 104 రోజులుగా రాజధాని కోసం పోరాడుతున్న తమను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రతికూల పరిస్థితుల్లో ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడుతున్నామన్నారు. అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ రాజధాని ప్రాంతాల్లో చేస్తున్న ఆందోళనల సోమవారం 104వ రోజు కూడా కొనసాగాయి. కరోనా నేపథ్యంలో దూరం దూరంగా కూర్చుంటూ ఆందోళనలు కొనసాగించారు.



వెంకటపాలెం వీధుల్లో నిరసన తెలుపుతున్న మహిళలు

### రాష్ట్ర వ్యాప్తంగా 'జై అమరావతి' మాస్కులు

'ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా పోవాలి.. రాజధానిగా అమరావతి కావాలి' అంటూ మహిళలు మాస్కులు తయారీ చేసి అందరికీ పంపిణీ చేశారు. కాగా, సోమవారం మొత్తం 29 గ్రామాల్లో మహిళలు బృందాలుగా ఏర్పడి ఆందోళనలు కొనసాగించారు. రాత్రి 7.30 గంటలకు విద్యుత్ నిలిపివేసి కొవ్వొత్తులు వెలిగించి 'అమరావతి వెలుగు' పేరిట నిరసన వ్యక్తం చేశారు.

# అప్పు పుట్టట్లేదు!

- 600 కోట్లడిగితే రూ.50 కోట్లే చేతికి
- మరీ తగ్గడంతో తీసుకోని ప్రభుత్వం
- ఆంధ్రా బాండ్లపై అనాసక్తే కారణం
- 9.5%వడ్డీకి సిద్ధమైనా అదే వైఖరి
- రుణానికి చివరి అవకాశం ఈ రోజే
- ఆర్థిక ఏడాది ముగింపునాడు కష్టమే!

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరోనా కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పు పుట్టడం లేదు. అప్పు కోసం ఆర్‌బీఐ ద్వారా బాండ్లు వేలం వేసినా కనీసం రూ.100 కోట్లు కూడా ప్రభుత్వానికి రాలేదు. ఆర్‌బీఐ ద్వారా ఓపెన్ మార్కెట్లో బాండ్లు/సెక్యూరిటీలు విక్రయించి అప్పు తెచ్చుకునేందుకు రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక శాఖ ఇచ్చిన పరిమితిలో ఇంకా రూ.600 కోట్లు మిగిలాయి. మార్చి 31లోగా ఆ అప్పు తెచ్చుకోవాలి. గడువు దాటితే తెచ్చుకోవడం కుదరదు. రూ.600 కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లు వేలానికి ఉంచితే కేవలం రూ.50 కోట్ల విలువైన బాండ్లు మాత్రమే అమ్ముడుపోయాయి. అది కూడా 9.5 శాతం వడ్డీకి. సాధారణంగా ఆర్‌బీఐ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు వేలం వేసే బాండ్లపై వడ్డీ ఏడు నుంచి ఎనిమిది శాతం లోపే ఉంటుంది. 9.5 వడ్డీ శాతానికి రాష్ట్రం సిద్ధపడినప్పటికీ పూర్తిస్థాయిలో బాండ్లు కొనేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో వచ్చిన ఆ రూ.50 కోట్లను కూడా రాష్ట్ర ఆర్థిక శాఖ తీసుకోలేదు. 31వ తేదీ మంగళవారం కానీ, ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇది చివరి రోజు కావడంతో ఆ రోజున ఆర్‌బీఐ బాండ్ల వేలం ప్రక్రియను నిర్వహిస్తుందో లేదోననేది స్పష్టత లేదు. వారం క్రితం అంటే దేశంలో కరోనా కారణంగా లాక్‌డౌన్ ప్రారంభమై అప్పటికి రెండు రోజులే. అప్పుడే మార్కెట్లో పరిస్థితి అలా ఉంటే ఇప్పుడు అసలు ప్రభుత్వ బాండ్లలో మదుపు పెట్టడానికి ఎవరూ ముందుకురాకపోవచ్చని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. లాక్‌డౌన్ ఉన్న ఈ 10 రోజులూ దేశవ్యాప్తంగా వినియోగం గణనీయంగా తగ్గింది. అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలకూ అప్పులు పుట్టడం లేదు. గత 10 రోజుల నుంచి దేశంలో లాక్‌డౌన్ కారణంగా జీఎస్టీ వసూళ్లు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఎక్సైజ్ ఆదాయం పూర్తిగా ఆగిపోగా, పెట్రోల్, డీజిల్ అమ్మకాల ద్వారా అతి స్వల్పంగా ఆదాయం వచ్చిందని ఆర్థిక శాఖ అధికారులు చెప్పారు. కరోనా నియంత్రణకు కేంద్రం అన్ని రాష్ట్రాలకు భారీ ప్యాకేజీ ప్రకటించిన నేపథ్యంలో లాక్‌డౌన్ సమయంలో కేంద్రానికి వచ్చిన అరకొర జీఎస్టీని రాష్ట్రాలకు పంచలేకపోవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఉన్న నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపాల్సిన అవసరం ఉంటుందని, ఏప్రిల్ ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు వేయగా, మిగిలిన నిధులను ఏప్రిల్ 4వ తేదీన రేషన్ కార్డుదారుల ఒక్కో కుటుంబానికి రూ.1000 చొప్పున పంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో ఈ నెలలో మార్చి 21లోగా వేతనాల బిల్లులు సమర్పించాలని అన్ని శాఖలను కోరామని, గడువులోగా బిల్లులు సమర్పించిన వారికే ఒకటో తేదీన వేతనాలు వేస్తామని చెప్పారు.

# వరికి వైరస్ వర్రీ

(మొదటి పేజీ తరువాయి)

వెనుకాడుతున్నారు. అదీగాక ఉన్న యంత్రాలు ఉభయగోదావరి జిల్లాల్లో పంట కోతకూ 30శాతం కూడా చాలవు. ఇది చాలదన్నట్టు దళారులు కరోనా సాకుతో ధాన్యం ధరను అడ్డంగా కోసేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులూ అయినకాడికి అమ్ముకొంటున్నారు. రాష్ట్రంలో ఏటా రబీ సీజన్‌లో 6.98 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుంది. ఇందులో ఉభయగోదావరి జిల్లాల విస్తీర్ణమే సుమారుగా 3.35 లక్షల హెక్టార్లు. ఇందులో తూర్పుగోదావరి జిల్లాలో 1,51,692 హెక్టార్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 1.60 లక్షల హెక్టార్లలో నాట్లు పడ్డాయి. తూర్పులో ఇప్పటికే 13,190 హెక్టార్లు, పశ్చిమలో 10వేల హెక్టార్ల వరకు కోతలు కోశారు. మిగిలిన పంటలో ఉభయ గోదావరి జిల్లాల్లోని ఈస్ట్రన్ డెల్టాలో ఏప్రిల్ నెలాఖరు వరకు కోతలు ఉంటాయి. తూర్పులోని సెంట్రల్ డెల్టా, పశ్చిమలో వెస్ట్రన్ డెల్టా మే మొదటివారం వరకు కొనసాగుతాయి. అయితే కరోనా కారణంగా ఎక్కడా కోతలు కోసే పరిస్థితి లేదు. లాక్‌డౌన్ పేరుతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దన్న ఆంక్షలతో వరికోతకు కూలీలు దొరకడం లేదు. అక్కడక్కడా తెలిసిన మహిళా కూలీలు రోజుకు వచ్చే రూ.200 కూలిని రూ.400 ఇస్తే రావడానికి సమ్మతిస్తున్నారు. మగ కూలీలు కోతకు రూ.400 నుంచి రూ.600 వరకు, కుప్ప వేయడానికి రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు డిమాండ్ చేస్తున్నారు.

### యంత్రాలకు బ్రేకులు..

రబీ కోతకు కూలీల కొరత వేధిస్తుండడంతో కొన్నేళ్లుగా వరికోత యంత్రాల వినియోగం సగం వరకు పెరిగింది. కాకపోతే యంత్రాల ద్వారా కోత, నూర్పిళ్లు చేస్తే ఎండుగడ్డి దొరకదు. దీంతో కొందరు రైతులు మాత్రం కూలీలపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీలు రానందున యంత్రాలతోనే కోతలు కోయాలని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ ఇవి కూడా దొరకడం లేదు. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారుగా 3.35 లక్షల హెక్టార్ల పంట కోయడానికి వేలల్లో కోత యంత్రాలు కావాలి. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 900 వరకు వరికోత యంత్రాలు అవసరం కాగా, అందుబాటులో 427 ఉన్నాయని వ్యవసాయశాఖ చెబుతున్నది. మరో 150 యంత్రాలు ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, కర్ణాటక నుంచి రావలసి ఉందంటున్నారు. కానీ లాక్‌డౌన్‌తో అవి నిలిచిపోయాయి. పశ్చిమ గోదావరిలో 1100 వరకు కోత యంత్రాలు అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ దొరకడం లేదు.

### దళారుల ఉచ్చు..

ఇదే అదునుగా దళారులు.. రైతులకు ఉచ్చు బిగిస్తున్నారు. తక్షణం పంట కోత జరగాల్సిన ఉన్న చోట్ల దళారులు వరి యంత్రాలను అన్నదాతలకు పురమాయిస్తున్నారు. ఎకరా కోతకు కమీషన్‌తో కలిపి రూ.3వేలు డిమాండ్ చేస్తున్నారు. చేసేది లేక కొందరు రైతులు అప్పులు తెచ్చి అధిక ధరలతో యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు. ఉదయం వేళల్లో పోలీసులు అడ్డుకుంటుండడంతో రాత్రివేళల్లో యంత్రాలతో కోతలు కోస్తున్నారు. ఇలా వేలకు వేలు ఖర్చుపెట్టి కోత కోస్తుంటే దళారులు ధాన్యం ధరలతో ఆడుకుంటున్నారు. ఇటీవల 75 కిలోల ధాన్యం బస్తా రూ.1220కు కొనగా, లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత రూ.1100 చొప్పున చెల్లిస్తామని, ఇందులో తమ కమీషన్ రూ.200 అంటూ దళారులు అన్నదాతలకు ఆఫర్‌లు పెడుతున్నారు. అటు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరవలేదు. తూర్పుగోదావరి జిల్లాలో ఈ మార్చి 20నాటికి 75,776 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని వ్యవసాయశాఖ లెక్కగట్టింది. అంటే వీటిని కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలు ఈపాటికే ఏర్పాటు చేయాలి. అలా జరగకపోవడం రైతుల కష్టాలను పెంచుతోంది.


**MSME-TOOL ROOM, HYDERABAD**
**(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)**
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN - 500 037.

**ADMISSIONS FOR DIPLOMA COURSES**

| S. No. | Course Details | Eligibility for Admission | Age Limit | Duration of Study | Batch Strength |
|---|---|---|---|---|---|
| 1 | Diploma in Tool, Die & Mould Making (DTDM) | 10th Pass with 50% for general & 45% for SC / ST | Minimum 15 years, Maximum 19 years | 4 Years | 60 |
| 2 | Diploma in Electronics & Communication Engineering (DECE) | 10th Pass | Maximum 19 years | 3 Years | 60 |
| 3 | Diploma in Automation & Robotics Engineering (DARE) | | | 3 Years | 60 |
| 4 | Diploma in Production Engineering (DPE) | | | 3 Years | 60 |

**MODE OF APPLICATION:**
Application form can be downloaded from our website **www.citdindia.org** under the link **"Diploma Admission Notification-2020"** and the filled in application forms can be sent to The Director (Trg), CITD, Balanagar, Hyderabad-500 037, along with prescribed application cost ₹ 700/- for General and ₹ 350/- for SC/ST category by way of Demand Draft drawn in favor of Principal Director, CITD, Hyderabad or By Online at www.citdindia.org (detailed steps of online payment can be found from prospectus.)

**IMPORTANT DATES:**
- Availability of applications : 02-03-2020 (Monday)
- Last date for receipt of filled-in application : 02-05-2020 (Saturday)
- Date of Entrance exam (Tentative) : 10-05-2020 (Sunday)
- Centre for Entrance Examination : Hyderabad

Further details can be obtained from prospectus available on our website under the link **"Diploma Admission Notification-2020"**

Contact Details : Admission Desk at Diploma Block
Phone No. 9502405170, 040-2377 1959
E-Mail-adminitrg@citdindia.org

Sd/-
PRINCIPAL DIRECTOR

ISO 9001 : 2015, ISO 29990:2010, ISO 14001:2004, ISO 50001:2011 Certified Institution

రేపటినుంచి దేశవ్యాప్తంగా జరగాల్సిన జనగణన, జనాభా పట్టిక నవీకరణలు కరోనా కల్లోలంగా వాయిదా పడ్డాయి. ఏప్రిల్ ఒకటినుంచి సెప్టెంబరు ముప్పయ్‌వ రకూ ప్రభుత్వం శిక్షణనిచ్చి పంపిన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి పలు వివరాలు సేకరించే ఈ బృహత్ ప్రక్రియ కరోనా రాకతో వాయిదాపడవచ్చునని ఊహించిందే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత ఆదివారం ఓ చిన్న రిహార్సల్స్‌తో ఆరంభించి ఏకంగా 21రోజులు దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించడంతో ప్రభుత్వం వెనువెంటనే ఈ ప్రక్రియల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభ స్థితిలో ఇది అత్యవశ్యకమన్నది అటుంచితే, అనూహ్యంగా అందివచ్చిన ఈ కాలాన్ని ప్రభుత్వం తలుచుకుంటే పునరాలోచన, పునఃస్సమీక్షకు కూడా వినియోగించుకోవచ్చు.

ప్రధాని ప్రకటించిన లాక్‌డౌన్ కాలం ఏప్రిల్ 15వరకూ ఉన్నది. ఆ తరువాత కూడా ఇది కొనసాగుతుందన్న ప్రచారం ఉన్నప్పటికీ, ప్రభుత్వం దానిని ఖండిస్తున్నది. ప్రస్తుతానికి కొనసాగింపు ఆలోచన ఎంత మాత్రమూ లేదనీ, ఈ ఇరవైయొక్క రోజుల కాలపరిమితి ముగిసే ఒకట్రెండు రోజుల ముందు మాత్రమే, అప్పటి పరిస్థితి ఆధారంగా ఏ నిర్ణయమూ తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వం చెబుతున్నది. మరో పదిహేను రోజుల్లోగానే వాతావరణం కాస్తంత సానుకూలపడి, లాక్‌డౌన్ కొనసాగింపు అక్కరలేదనుకున్నప్పటికీ, కరోనా కట్టడికి ప్రభుత్వం తన సమస్త వ్యవస్థలనూ, శక్తియుక్తులను మరింతకాలం వెచ్చించక తప్పదు. కరోనా దెబ్బకు కకావికలమైన సమస్త రంగాలు, ప్రజల దైనందిన జీవితాలు తిరిగి గాడినపడటానికి చాలా కాలమే పడుతుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో సిబ్బందినీ, వనరులనూ వెచ్చిస్తూ, ప్రజలతో విస్తృత సంపర్కం అవసరపడే ఈ లెక్కలను కొంతకాలం నిలిపివేయడం శ్రేయస్కరం.

## పునరాలోచనకు అవకాశం

జనగణనను ఆదిలో సీఏఏ, ఆ తరువాత ఎన్పీఆర్ కమ్మేస్తే, ఇప్పుడు కరోనా కదలనీయకుండా చేసింది. ఎట్టిపరిస్థితిల్లోనూ వీటిని ఆపేదిలేదని కేంద్ర పెద్దలు భీష్మ ప్రతిజ్ఞలు చేస్తున్న తరుణంలో, ముందుగా ఒడిశాముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నోట ఈ వాయిదా ప్రతిపాదన వెలువడింది. ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా దాదాపు డజను రాష్ట్రాలు ఉద్యమిస్తున్న తరుణంలో నిజానికి కేంద్ర పాలకులకు ప్రస్తుత వాతావరణం అవకాశంగా అందివచ్చింది. రాష్ట్రాల సహకారం లేనిదే జనగణన, జనాభాపట్టిక నవీకరణలు అసాధ్యం. కరోనా ఉపద్రవం నుంచి దేశం బయటపడటానికి ఎంత కాలం పడుతుందన్నది అటుంచితే, ఎన్పీఆర్‌లో ప్రభుత్వం అడగబోయే ప్రశ్నల విషయంలో ప్రజల అనుమానాలు అనేకం అలాగే ఉన్నాయి. తల్లిదండ్రుల పుట్టుపూర్వోత్తరాలు సహా పలు ప్రశ్నలు సంధించి తమకు రాజకీయంగా ఉపకరించే రీతిలో ప్రజలను వడబోసేందుకు పాలకులు సిద్ధపడుతున్నారన్న భయాలున్నాయి. కేంద్రపెద్దలు పలు దశల్లో దిగివచ్చి ఇచ్చిన వివరణలు సైతం వారి గతకాలపు వీరంగాల నేపథ్యంలో వీగిపోతున్నాయి. ఎన్పీఆర్‌కు రాష్ట్రాల సహకారం దక్కనిస్థితిలో ఆన్‌లైన్ విధానానికి సైతం కేంద్రం సిద్ధపడుతున్నదన్న వార్తలు కూడా గతంలో వినవచ్చాయి. కేంద్ర రాష్ట్రాలు పరస్పరం సమన్వయంతో సుహృద్భావ వాతావరణంలో నిర్వహించాల్సిన ఓ కార్యక్రమం చుట్టూ ఇంతటి ఘర్షణ నెలకొనడం సముచితంకాదు.

ప్రస్తుతం కరోనా ఉపద్రవంతో ఈ ప్రక్రియలను చుట్టుముట్టిన వివాదమంతా వెనక్కుపోయి, వాయిదా ప్రకటనతో ఉపశమించినట్టుగా కనిపిస్తున్నది కానీ, వాటిని యధాతథ రూపంలో ఎప్పుడు అమలు చేయసంకల్పించినా తిరిగి అగ్గి రాజుకోవడం తథ్యం. కరోనా ఉపద్రవం మనకు సమాజంలోని అన్ని వర్గాలు పరస్పర సహకారంతో, సమన్వయంతో సాగాల్సిన అవసరాన్ని తెలియ చెబుతున్నది. కేంద్రం ఇప్పటికైనా ఎన్పీఆర్, సీఏఏ ఇత్యాది అంశాలపై పునరాలోచన చేసి, మార్పుచేర్పులకు సిద్ధపడాలి. కరోనాపై సంఘటితంగా సాగుతున్న పోరాట స్ఫూర్తిని తదనతరం కూడా సమాజంలో కాపాడుతూ, అన్ని రాష్ట్రాలతో ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలి.

## విద్యుత్ చార్జీలు తగ్గించాలి!

రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న విద్యుత్ ధరలు గణనీయంగా పడిపోతున్నాయి. ప్రస్తుతం యూనిట్ ధర రెండు రూపాయలకే కొంటున్నట్లు పత్రికలలో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజల జీవికలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు బిల్లులు చెల్లించే స్థితిలో లేరు. అందువలన ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించాలి. ఈ విషయంలో విద్యుత్ నియంత్రణ మండలి జోక్యం చేసుకొని విద్యుత్ చార్జీలు తగ్గించటానికి విద్యుత్ సరఫరా సంస్థలకు తగు ఆదేశాలు ఇవ్వాలి.

**– పాతూరు దిలీప్ కుమార్, తిరుపతి**

## జల్లెడలోంచి జారిపోతున్న వలసజీవులు

కరోనా నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలన్నీ బావున్నాయి. అయితే ప్రభుత్వ చర్యల్లో ఇమడని, అవి అందజేస్తున్న సాయాలు వర్తించని వలసజీవుల వ్యథ ప్రస్తుతం పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. రోడ్లు పట్టి వందల కిలోమీటర్లు నడవటానికి సిద్ధమై, సంచుల్ని భుజాన్నేసుకుని, పిల్లల్ని వెంటబెట్టుకుని ఎండల్లో నడుస్తున్న వలస జీవుల వ్యథార్థ గాధలు హృదయాల్ని కదిలిస్తున్నాయి. వీళ్ళకి అక్కడక్కడా పౌరుల నుంచి అందుతున్న సాయాలు ముదావహమే. అయితే ప్రభుత్వాల నుంచి మాత్రం వీళ్ళకి వర్తించే విధంగా పెద్ద సాయమేమీ అందే పరిస్థితులు లేవు. తెలంగాణ ముఖ్యమంత్రి ఇటీవలి ప్రెస్‌మీట్‌లో ఈ వలస జీవులు కూడా తమ రాష్ట్ర అభివృద్ధి నిర్మాణంలో భాగస్వాములేననీ, వారినీ ఆదుకుంటామని ప్రకటించటం హర్షించదగ్గ విషయం. అయితే క్షేత్ర స్థాయిలో వీళ్ళకు ప్రభుత్వం వైపు నుంచి నిషేధాలు, అడ్డంకులు తప్ప సాయాలు అందే వ్యవస్థ ఇంకా ఏర్పడలేదన్నది నిర్వివాదాంశం. వీళ్ళు ఉన్నచోటే ఉండేలా, ఉన్నచోట వీళ్ళకు భద్రతా భావం కలిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ అందిస్తున్న భద్రత జల్లెడలోంచి వీళ్ళు జారిపోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇది వీరి క్షేమం కోసమే కాదు, వీరు వ్యాధివాహకాలుగా మారి సమాజానికి ఇబ్బంది కలిగించకుండా కూడా అవసరం.

**– పి. కేశవ కృష్ణ, హైదరాబాద్**

*21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించిన వారం రోజుల తర్వాత కూడా భారత ప్రజలు ప్రశాంతంగా, సంయమనంగా వ్యవహరించడం మొత్తం ప్రపంచాన్నే ఆశ్చర్యపరుస్తోంది. మోదీ సూచించినట్లుగా సామాజిక దూరం పాటించడం, మార్కెట్లలో, దుకాణాల వద్ద క్రమశిక్షణగా వ్యవహరించడం, మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల కొరత పెద్దగా లేకపోవడం, క్వారంటైన్‌కు రైళ్ల కోచ్‌లను ఉపయోగించుకోవడం వంటి వినూత్న పద్ధతులను పాటించడం విదేశీ మీడియాలో చర్చనీయాంశమవుతోంది.*

# కష్టకాలంలో ఆప్తబాంధవుడు

సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

జీవితంలో కష్టాలు వచ్చినట్లే ఆ కష్టాలనుంచి మనను గట్టెక్కింపజేసే ఆప్తులు కూడా ఎప్పుడూ ఉంటారు. ప్రమాదాల్లో ఆదుకునే పెద్ద మనసు గల వ్యక్తులు ఉంటారు. నిజానికి అలాంటి వ్యక్తులు ఉన్నారని మనకు అనిపించినప్పుడల్లా ఏ కష్టాన్నింఛైనా మనం గట్టెక్కగలం అన్న ధీమా మనకు కలుగుతుంది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మీడియా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నప్పుడు అత్యంత సీనియర్ అయిన ఒక పత్రికాధిపతి స్పందిస్తూ 'ఇవాళ్టి కష్ట సమయంలో మీరు ప్రధానమంత్రిగా ఉండడం మాకెంతో ధైర్యాన్నిస్తోంది' అన్నారు. ఇది ఆ ఒక్క పత్రికాధిపతి మనోగతం కాదు. దేశంలో కోట్లాది ప్రజల మనోగతం. కరోనా వైరస్ ప్రపంచాన్నంతటినీ అతలాకుతలం చేస్తున్న సమయంలో మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇవాళ ప్రజలకు ఒక తండ్రిగా, ఒక తల్లిగా, ఒక సోదరుడుగా కనపడుతూ మన దేశం ఈ సమస్యలనుంచి గట్టెక్కి తీరుతుందని, భయపడవద్దని ఒక ధైర్యం కల్పిస్తున్నారు. కోట్లాదిమంది బిక్కుబిక్కుమంటూ ఇళ్లలో చిక్కుబడిన సమయంలో టీవీ ఆన్ చేసి చూస్తే– మన ప్రధానమంత్రి కళ్లముందు కనపడగానే వారికి కొండంత ధైర్యం కలుగుతోంది. ఆయన చెప్పిన మాటల్ని వారు చాలా శ్రద్ధగా, చెవులు రిక్కించి వింటున్నారు. 'మరి కొద్ది రోజుల్లో కరోనాపై మనం యుద్ధంలో గెలుస్తాం' అని ఆయన చెప్పినప్పుడు వారి ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి.

ప్రధానమంత్రి ఇవాళ నిజంగా తాను దేశాధినేత అయిన ప్రధానమంత్రిని కానని, ప్రజల ప్రధాన సేవకుడినని నిరూపిస్తున్నారు. ప్రజలతోనూ, ప్రముఖులతోను ఆయన నేరుగా సంబంధాలు పెట్టుకుంటున్నారు. పత్రికాధిపతులతో ఆయన నేరుగా మాట్లాడి ప్రజలకు ఆత్మవిశ్వాసం కల్పించాల్సిందని అభ్యర్థిస్తున్నారు. కరోనా వాతపడి ఆస్పత్రిలో క్వారంటైన్‌కు గురై కోలుకుంటున్న పేషంట్లతోనే కాదు, వారి కోసం రాత్రింబగళ్లు సేవ చేస్తున్న నర్సులతో కూడా ఆయన నేరుగా మాట్లాడి వారికి భరోసాను అందిస్తున్నారు. కనీసం రోజుకు 200మందితో ఆయన సంభాషిస్తున్నారు. ఆయన ఒక్క పిలుపునకు స్పందించి పారిశ్రామిక వేత్తలు, సినీతారలు, సంపన్నులు మాత్రమే కాదు, పెద్ద సంఖ్యలో ప్రజలు ముందుకు వచ్చి కరోనాపై పోరాడేందుకు కోట్లాది రూపాయలు ప్రధానమంత్రి సహాయ నిధికి అందజేస్తున్నారు.

ప్రధానమంత్రి పట్ల ప్రజల విశ్వాసం ఏ విధంగా ఉన్నదో మార్చి 22న జనతా కర్ఫ్యూలో కోట్లాది మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయడంతోనే అర్థమయింది. ప్రజలు తనను అపార్థం చేసుకోవడం లేదని, తన అభ్యర్థనలను మన్నిస్తున్నారని తెలిసిన తర్వాత ప్రధానమంత్రి మరో 21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించారు. దీనికీ దేశం యావత్తు హృదయ పూర్వకంగా స్పందించింది. ఇవాళ ప్రజలే ప్రధానమంత్రి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. మోదీ ఇచ్చిన పిలుపును పాటించకపోతే నష్టాలేమిటో వారే అనేక సామాజిక మాధ్యమాల్లో చర్చించుకుని పరస్పరం సలహాలు పంచుకుంటున్నారు. లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత వారం రోజులకు పరిస్థితిని సమీక్షిస్తే కరోనాపై మోదీ ప్రకటించిన యుద్ధంలో మనం విజయం సాధించడంలో ముందడుగే వేస్తున్నామన్న విషయం స్పష్టమవుతోంది.



ఇవాళ దేశ ప్రజలకే కాదు, అంతర్జాతీయంగా పలువురు దేశాధినేతలకూ నరేంద్రమోదీ ఆదర్శంగా నిలిచారు. ఒక వైపు దేశంలో వివిధ వర్గాల ప్రతినిధులతోనూ, మంత్రివర్గ సహచరులతోనూ, అధికారులతోనూ, సైన్యాధిపతులతోనూ, వైద్యరంగంలో సేవలందిస్తున్న వారితోనూ, పేషంట్లతోనూ నిరంతరం సంబంధాలు పెట్టుకుంటూ ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి రాత్రింబగళ్లు చర్చిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్న నరేంద్ర మోదీ అదే విధంగా వివిధ దేశాధినేతలతోనూ సంబంధాలు పెట్టుకుంటున్నారు. తొలుత తానే చొరవ తీసుకుని సార్క్ దేశాధినేతలతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి ఆ దేశాల సంయుక్త నిధిని ఏర్పాటు చేశారు. అదే విధంగా చైనా అధ్యక్షుడితోనూ చర్చించారు. కరోనా వాతపడిన 130దేశాల ప్రభుత్వాధినేతలతోనూ మాట్లాడుతున్నారు. ప్రపంచ దేశాధినేతలంతా కూడా మోదీ వైపు చూస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి స్కాట్ మారిసన్ ఇవాళ ప్రపంచానికి మోదీ నాయకత్వం అవసరమని స్పష్టం చేశారు. కరోనా వైరస్ వ్యాధిని ఎదుర్కొనేందుకు జీ20 దేశాలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మోదీ చేసిన ప్రతిపాదనపై అన్ని దేశాలూ ముక్తకంఠంతో సంతోషం వ్యక్తం చేశాయి.

ప్రధానమంత్రి మోదీకి ఇలాంటి సంక్షోభాలు కొత్త కాదు. 2001లో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో గుజరాత్‌లోని భుజ్‌లో పెను భూకంపం సంభవించింది. అత్యంత సీనియర్ నాయకులను కాదని తన లాంటి యువకుడిని ముఖ్యమంత్రిగా నియమించిన సందర్భంలో ఆ విపత్తును ఎదుర్కోవడంలో తాను విఫలమైతే తన రాజకీయ జీవితం ముగిసిన అధ్యాయంగా మారుతుందన్న విషయం ఆయనకు బాగా తెలుసు. భుజ్ భూకంపంలో 12 లక్షల ఇళ్లు మట్టి పాలయ్యాయి. కాని ఆరు నెలల్లోపే మోదీ భూకంపానికి తట్టుకోగల 8 లక్షల ఇళ్లను నిర్మింపజేశారు. దాదాపు 4వేల మంది ఇంజనీర్లు, 27వేలమంది మేస్త్రీలు రాత్రింబగళ్లు పనిచేసి గుజరాత్‌ను పునర్నిర్మించారు. భారతదేశ చరిత్రలో మొదటి సారిగా భూకంప పీడిత ప్రాంతాల్లో గృహ నిర్మాణ టెక్నాలజీని ఉపయోగించారు. పూర్తిగా విధ్వంసమైన భుజ్ నగరాన్నే ఆయన అత్యాధునిక నగరంగా పునర్నిర్మాణం చేశారు. గుజరాత్‌లో విపత్తుకు గురైన అయిదు జిల్లాల్లో దాదాపు 6.6 లక్షల కొత్త బ్యాంకు ఖాతాలను తెరిపించి ప్రజలకు కావల్సిన ఆర్థిక సహాయాన్ని అందించారు.

కరోనా వైరస్ సృష్టించే బీభత్సాన్ని ముందుగానే ఊహించి యుద్ధ ప్రాతిపదికపై అనేక కీలక చర్యలు మోదీ చేపడుతున్నారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా తమ ప్రజలకు ఇవాళ నరేంద్రమోదీ భారత్ ప్రజలకు కలిగినంత విశ్వాసాన్ని కలిగించలేకపోయారు. ఇవాళ భారత్ ప్రజలు స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూలో పాల్గొనడాన్ని, 21 రోజుల లాక్‌డౌన్‌ను కూడా చిత్తశుద్ధితో స్వీకరించి అమలు చేయడాన్ని చూసి ప్రపంచ దేశాలే ఆశ్చర్యపోతున్నాయి. మోదీ నాయకత్వంలో భారత ప్రజలు చేసినట్లుగా తమ ప్రజలు కూడా తాము చేసిన సూచలను ఆమోదించి ఉంటే కరోనా వైరస్‌పై విజయం సాధించేవారమని యూరోపియన్ దేశాల్లో చర్చ జరుగుతోంది. 21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించిన వారం రోజుల తర్వాత కూడా భారత దేశంలో ప్రజలు ప్రశాంతంగా, సంయమనంగా వ్యవహరించడం మొత్తం ప్రపంచాన్నే ఆశ్చర్యపరుస్తోంది. అంతేకాదు, మోదీ సూచించినట్లుగా రకరకాల కొత్త పద్ధతుల్లో సామాజిక దూరం పాటించడం, మార్కెట్లలో, దుకాణాల వద్ద క్రమశిక్షణగా వ్యవహరించడం, మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల కొరత పెద్దగా లేకపోవడం, క్వారంటైన్‌కు రైళ్ల కోచ్‌లను ఉపయోగించుకోవడం వంటి వినూత్న పద్ధతులను పాటించడం, కంపెనీలు తమంతట తాము ముందుకు వచ్చి తక్కువ ఖర్చుతో వెంటిలేటర్లు, కిట్‌లను రూపొందించేందుకు సిద్ధపడడం విదేశీ మీడియాలో చర్చనీయాంశమవుతోంది.

ప్రజలు మోదీలో విశ్వసనీయమైన, సమర్థుడైన నాయకుడిని చూస్తున్నారు. ఆయనను తమలో ఒకరిగా భావిస్తున్నారు. 'మీలో చాలా మంది నాపై కోపం పెంచుకుని ఉంటారు. ఈ జీవన్మరణ పోరాటంలో మనం గెలిచేందుకే ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకున్నాను. ఇతర దేశాల్లో పరిస్థితులు చూస్తుంటే మిమ్మల్ని కాపాడడానికి ఇదొక్కటే మార్గమనిపించింది. నేను మీ అందరి కష్టనష్టాలను అర్థం చేసుకోగలను. వాటికి నన్ను క్షమించండి.' అని తన మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రాధేయపడడం ప్రజల మనసుల్లో మోదీ ఔన్నత్యాన్ని శిఖరాయమానం చేసింది. మోదీలాంటి నాయకుడికి ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో బాగా తెలుసు. దేశ ప్రజల మనసులను గెలుచుకోవడమే కాకుండా నరేంద్రమోదీ అంతర్జాతీయంగా ఏర్పడిన నాయకత్వశూన్యతను కూడా పూరించే పథంలో ఉన్నారు. ఆయనకు మనసా వాచా కర్మణా అండదండలివ్వడమే ఇవాళ చారిత్రక అవసరం.

*(బిజెపి జాతీయ కార్యదర్శి)*

# లాక్‌డౌన్‌పై కొత్త కోణం

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

ఆర్థిక వ్యవస్థలపై కరోనా వైరస్ దీర్ఘకాలిక ప్రభావానికి సంబంధించి మూడు అనిశ్చితాలను మనం ఎదుర్కోవలసివున్నది. వైరస్ వ్యాప్తిని అరికట్టగల వ్యాక్సీన్‌ను శాస్త్రవేత్తలు శీఘ్రగతిన కనిపెట్టగలరా, లేదా అనేది మొదటి అనిశ్చితి. ఆసన్నమయిన వేసవి కాలంలో ఈ విషక్రిమి హరించుకు పోతుందా లేక రాబోయే శీతాకాలంలో మళ్ళీ అది విజృంభిస్తుందా? అనేది రెండో అనిశ్చితి. వైరస్‌కు బలికాకుండా సామాన్య మానవుడు స్వీయ రక్షణను అభివృద్ధి పరచుకోగలుగుతాడా లేక అది తన వినాశనకాండను కొనసాగిస్తూనే వుంటుందా? అనేది మూడో అనిశ్చితి.

కరోనా ప్రభావం 'యు' వలే వుంటుందా, లేక 'ఎల్' వలే వుంటుందా అనే విషయాన్ని ఈ అనిశ్చితాలే నిర్ణయిస్తాయి. ఆర్థిక వ్యవస్థ కొంతకాలం మాంద్యంలోకి దిగజారిపోయి, ఆ తరువాత సత్వరమే పూర్వ స్థాయికి చేరడాన్ని 'యు' సూచిస్తుంది. అలా కాక ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం అసాధ్యమైపోయి చెప్పుకోదగిన కాలం పాటు అంతకంతకూ దిగజారిపోయే పరిస్థితి కొనసాగడాన్ని 'ఎల్' సూచిస్తుంది. దూరదృష్టితో ఆలోచించే వివేకవంతులమైతే మనం 'ఎల్' పరిస్థితులకు సంసిద్ధమవ్వాలి. ఎందుకంటే కరోనా మహమ్మారి చాలా కాలం పాటు ఆర్థిక కార్యకలాపాలకు తీవ్ర అవరోధంగా కొనసాగనున్నది.

ముంచుకొస్తోన్న ఈ ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా, కొన్ని యూరోపియన్ దేశాల ప్రభుత్వాలు ఆర్థిక ఉద్దీపన పథకాలను ప్రకటించాయి. ప్రభుత్వం భారీ రుణం తీసుకొని, ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునేందుకు మదుపు చేయడమనేది ఆర్థిక ఉద్దీపన మౌలిక భావన. ఈ అదనపు క్రియాశీలత వల్ల ప్రభుత్వం అదనపు పన్ను రాబడులను ఆర్జిస్తుంది. ఉద్దీపన కోసం తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం ఈ ఆదాయాన్ని ఉపయోగించుకుంటుంది.

అయితే ప్రస్తుత ఆర్థిక ఉద్దీపన అదనంగా ఎలాంటి ఆదాయాన్ని సమకూర్చదు. లాక్‌డౌన్ మూలంగా కోల్పోయిన ఆదాయ నష్టానికి పరిహారం మాత్రమే మాత్రమే సమకూర్చగలుగుతుంది. లాక్‌డౌన్ మూలంగా ప్రస్తుతం పడుతున్న ఆర్థిక భారాన్ని భవిష్యత్తుకు మార్చడం మాత్రమే ఈ ఆర్థిక ఉద్దీపనలు చేయగలుగుతాయి. అవి ఎలాంటి అదనపు ఆదాయాలను సమకూర్చవు.

ద్రవ్య విధానానికి కూడా ఇటువంటి పరిమితులే వున్నాయి. కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గిస్తాయి. వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని మదుపు చేస్తాయని, అలాగే వినియోగదారులు అప్పు తీసుకుని వినియోగిస్తారనే భావనతోనే వడ్డీరేట్లను తగ్గిస్తారు. అయితే వ్యాపార సంస్థలు రుణాలు తీసుకుని మదుపు చేసేందుకు సుముఖంగా లేవు. ఎందుకని? మార్కెట్‌లో డిమాండ్ లేక పోవడమే. అలాగే వినియోగదారులు రుణాలు తీసుకోవడానికి సిద్ధంగా లేరు. ఎందుకని? రాబోయే రోజుల్లో తమకు ఉద్యోగ భద్రత లేదనే భయం వెంటాడుతున్నప్పుడు ఎవరైనా విలాస జీవితానికి ఎలా ఆరాటపడతారు?

మరి మార్గాంతరమేమిటి? ఆర్థిక వ్యవస్థను, అంతర్ సంబంధాలు తక్కువగా వుండే రీతిలో, చిన్న విభాగాలుగా విభజించాలి. వ్యక్తికి వ్యక్తికి మధ్య సంపర్కం ద్వారానే కరోనా వైరస్ వ్యాపిస్తుందన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. ఇటువంటి సంబంధాలు, విదేశీ ప్రయాణాలు, వాణిజ్యం, మదుపుల మూలంగా విభిన్న ప్రాంతాలకు చెందిన వారి మధ్య నెలకొంటున్నాయి. మనదేశంలో కరోనా బారిన పడిన వారిలో అత్యధికులు విదేశాలలో నిర్దిష్ట ప్రాజెక్టులలో పని చేస్తున్నవారు లేదా విభిన్న దేశాలలో విద్యాభ్యాసం చేస్తున్నవారే కావడం గమనార్హం.

మనం మన ఆర్థిక వ్యవస్థను చిన్న విభాగాలుగా విడగొట్టి వాటి మధ్య సంబంధం తక్కువగా వుండేలా చేస్తే కరోనా హాని కారక సంబంధాలు తగ్గిపోతాయి. ఉదాహరణకు అంతర్జాతీయ స్థాయిలో ఇటలీ, స్పెయిన్‌లు, జాతీయ స్థాయిలో మహారాష్ట్ర, కేరళలపై కరోనా వైరస్ ప్రభావం అమితంగా ఉన్నది. ఇటలీ, స్పెయిన్, మహారాష్ట్ర, కేరళలే కాకుండా అన్ని దేశాలు, సకల రాష్ట్రాలను 'పరిదీకృత ప్రాంతాలు'గా చేసి, దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య సంబంధాలను తగ్గించి వేస్తే కరోనా కల్లోలం అంత తీవ్రంగా వుండబోదు.

*లాక్‌డౌన్‌ను అంతర్జాతీయ లేదా జాతీయ స్థాయిలో కాకుండా ఆర్థిక వ్యవస్థలోని వివిధ సెగ్మెంట్ల వారీగా అమలుపరచాలి. ప్రపంచీకరణ వల్ల చౌకగా నాణ్యమైన సరుకులు మనకు అందుబాటులోకి వచ్చాయి. వాటితో పాటు కరోనా లాంటి మహమ్మారులూ వచ్చాయి మరి! చిన్నచిన్న విభాగాలుగా విభజితమైన ఆర్థిక వ్యవస్థతో దేశంలోనే తయారైన ఖరీదైన సరుకులను కొనుగోలు చేసుకోవల్సివుంటుంది. దీనివల్ల కరోనా వైరస్‌లాంటి విషక్రిములు మనపై విరుచుకుపడే అవకాశాలూ సన్నగిల్లుతాయి.*

అయితే ఇందుకు ఇటలీ నుంచి సరఫరా అయ్యే ఆలివ్‌లకు, స్పెయిన్ నుంచి వచ్చే సిట్రస్ పండ్లకు, మహారాష్ట్ర ఉల్లిపాయలకు, కేరళ మిరియాలకు ప్రత్యామ్నాయాలను కనుగొనవలసివున్నది. బంగ్లాదేశ్‌లాంటి దేశాలు, ఒడిషా లాంటి రాష్ట్రాలు ఉక్కు, కార్లను తయారు చేసుకొనేందుకు తమ సొంత ఫ్యాక్టరీలను నెలకొల్పుకోవల్సివున్నది. పూణే, కోటలో వలే తామూ ట్యూషన్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

అంతర్ విభాగ వాణిజ్యం తగ్గుదల, కరోనా వైరస్ ప్రభావం సోకని రాష్ట్రాలలో ఆర్థిక కార్యకలాపాలను కొనసాగించేందుకు తోడ్పడుతుంది. లాక్‌డౌన్‌ను అంతర్జాతీయ లేదా జాతీయ స్థాయిలో కాకుండా ఆర్థిక వ్యవస్థలోని వివిధ సెగ్మెంట్ల వారీగా అమలుపరచాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ఈ ప్రతిపాదన చేస్తున్నందుకు నేనేమీ సంతోషంగా లేను. అయితే చేయక తప్పదు. చేసి తీరాలి కూడా. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ వల్ల నాణ్యమైన సరుకులు చౌకగా మనకు అందుబాటులోకి వచ్చాయి. అయితే వాటితో పాటు కరోనా లాంటి మహమ్మారులూ వచ్చాయి మరి. చిన్నచిన్న విభాగాలుగా విభజితమైన ఆర్థిక వ్యవస్థతో దేశంలోనే తయారైన ఖరీదైన సరుకులను కొనుగోలు చేసుకోవల్సి వుంటుంది. అయితే దీనివల్ల కరోనా వైరస్ లాంటి విషక్రిములు మనపై విరుచుకుపడే అవకాశాలూ సన్నగిల్లుతాయి. దేశీయ ఉత్పత్తులపైనే ఆధారపడడం అనేది సౌఖ్యదాయకం కాని మాట నిజమే. అయినా మనం ఇటువంటి కఠోర నిర్ణయాన్ని తీసుకోక తప్పదు.

చౌక వస్తువులు, వాటితో పాటే ప్రాణాంతక వ్యాధుల రాకను కోరుకుందామా లేక ఖరీదైన దేశీయ సరుకులు, మహమ్మారులు విజృంభించలేని పరిస్థితులను ఆశిద్దామా? దేశాల మధ్య ఇనుపతెరలు ఏర్పాటు చేయాలని నేను వాదించడం లేదు. ఆర్థిక వ్యవస్థల తక్కువ ఏకీకరణే మంచిదన్నది నా వాదన. ఆర్థిక వ్యవస్థలు మరింత స్వయం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలి. వాటికి మరింత స్వయం ప్రతిపత్తి వుండి తీరాలి. దీనివల్ల జీవనప్రమాణాలు అంత సమున్నతంగా ఉండకపోవచ్చు. అయితేనేం ఎటువంటి మహమ్మారుల భయం లేకుండా ప్రశాంతంగా జీవించగలుగు తాము కదా.




*(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)*

# చిరస్మరణీయుడు దుగ్గిరాల పూర్ణయ్య

'మీరందరూ ఢిల్లీలో స్థిరనివాసం ఏర్పరచుకుని ఉన్నారు కదా. మరి తెలుగు వారి భాషలో వస్తున్న మార్పులు మీరు ఎలా గమనిస్తారు. మీ అనువాదాన్ని ఎలా సజీవంగా మలుస్తారు' అని మూడు దశాబ్దాల క్రితం నేను ఆయనను అడిగిన ప్రశ్న గుర్తుకు వచ్చింది. అప్పటికి ప్రాంతీయ భాషలో లెక్కకు మించిన ఛానళ్ళు గానీ, చౌక ఇంటర్‌నెట్ గానీ, ఢిల్లీలో తెలుగు పత్రికల ప్రింటింగ్ గానీ, ఫోన్లు గానీ ఇప్పటిలా వుండేవి కావు. నా ప్రశ్నకు దుగ్గిరాల పూర్ణయ్య జవాబు చెప్పలేదు గానీ, కళ్ళతో అభినందించారు. పలుచటి శరీర ఆకృతి; తెల్లని షర్టు, ఇస్త్రీ లేకుండా చేతుల వద్ద మడిచి, గొంతు దగ్గర బొత్తాం వేసుకుని, కొంచెం పొడుగ్గా పెరిగిన జుట్టుతో ఢిల్లీ ఆకాశవాణి బ్రాడ్‌కాస్టింగ్ హౌస్‌లో, న్యూస్ యూనిట్ తెలుగు విభాగంలో కుర్చీలో కూర్చుని, బల్లమీద చేతులు పెట్టుకుని ఆలోచిస్తున్నట్టుగా గానీ; బ్రాడ్‌కాస్టింగ్ హౌస్ ప్రాంగణంలో నడుస్తూ, చేతులు వెనక్కి పెట్టుకుని అంతర్ముఖంగా ఆలోచిస్తూ సాగే భంగిమలో గానీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నారు. 2020 మార్చి 29 ఆదివారం మధ్యాహ్న సమయంలో కృష్ణాజిల్లా గుడివాడ దగ్గర వుండే తన సొంతవూరు అంగలూరులో 83 సం. 11 నెలల పైబడిన వయసులో స్వల్ప అస్వస్థతతో ఆయన కన్నుమూశారు.

ప్రత్యేకమైన మాడ్యులేషన్‌తో దుగ్గిరాల పూర్ణయ్య మూడు దశాబ్దాలపాటు చదివిన వార్తలు విలక్షణమైనవి. ఎంతోమంది వారి కంఠాన్ని అనుకరిస్తూ మిమిక్రీ చేసేవారు. ఆ తరం రేడియో న్యూస్ రీడర్లకు గ్లామర్ ఉండేది. ఇదే విషయం ఆయనతో అంటే, 'ఒక చిన్న యంత్రం నుంచి మానవ కంఠం వినపడటమే ఆకర్షణ' అంటూ ఆ విషయాన్ని దాటవేసేవారు. 1990లో నేను ఆకాశవాణి బాధ్యతల మీద గోవా కేంద్రం నుంచి ఢిల్లీ డైరెక్టరేట్‌లో కొన్ని రోజులుగా కొన్ని విడతలలో పనిచేశాను. అప్పటికి తెలుగు ప్రాంతం వదలి రెండేళ్ళయ్యింది కనుక తెలుగు అన్నా, తెలుగు వారన్నా కొంత వ్యామోహం వుండేది. అలాంటి సమయంలో ఢిల్లీ ఆకాశవాణి భవనంలో ఉద్యోగం చేస్తూ క్యాంటీనుకు వెళ్తుండగా తెలుగు న్యూస్ యూనిట్ అనే బోర్డు కుడివైపున కనబడింది. దాంతో టీ విషయాన్ని మరచిపోయి లోపలికి వెళ్ళి పూర్ణయ్యగారిని పలకరించాను. ఆయన గ్రామీణ ప్రాంతం నుంచి, వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. త్రిపురనేని రామస్వామిది తమ అంగలూరు అనే గౌరవం కూడా తమ స్వస్థలం మీద ఆయనకుండేదని మాటల మధ్య తెలిసింది. తొలి పరిచయం నుంచే వారు నన్ను పితృవాత్సల్యంతో చూసేవారు, చాలా విషయాలు వివరించేవారు. వారితో, వారి కుటుంబంతో నాకు మూడు దశాబ్దాల పరిచయం, స్నేహం.

1936 ఏప్రిల్ 15న వెంకట కృష్ణారావు, అన్నపూర్ణమ్మ దంపతులకు గుడివాడ దగ్గర అంగలూరులో దుగ్గిరాల పూర్ణయ్య జన్మించారు. ఆయన చదువు తొలుత స్వగ్రామంలో, తర్వాత పి.యు.సి. గుడ్లవల్లేరులోనూ; పిమ్మట బి.ఏ. డిగ్రీ గుడివాడ ఏఎన్ఆర్ కళాశాలలో చదివారు. భీమవరంలో ఎం.ఎ. ఇంగ్లీషు, పిమ్మట భాగల్పూర్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ చదివారు. ఉద్యోగంలో స్థిరపడ్డాక పూనా విశ్వవిద్యాలయం నుంచి నుంచి ఎల్ఎల్‌బి చేశారు. ఖమ్మంలో కొంతకాలం టీచరుగా పని చేసి, పిమ్మట 1961 ప్రాంతంలో ఢిల్లీ వెళ్ళినట్టు తెలుస్తోంది. తొలుత జనసంఘ్ పార్టీ వారి పత్రిక 'ఆర్గనైజర్'లో సబ్ ఎడిటర్‌గా కొంతకాలం పని చేశారు. ఆ సమయంలో ప్రముఖ రాజకీయ నాయకుడు లాల్ క్రిష్ణ ఆడ్వాణీ అదే పత్రికలో సబ్ ఎడిటర్. కనుక వారు సహ ఉద్యోగులు. 1964లో ఢిల్లీలో ఆకాశవాణి న్యూస్ యూనిట్‌లో తెలుగు న్యూస్ రీడర్‌గా చేరిన అన్నపూర్ణయ్య 58 సం. వయసులో 1994లో ఢిల్లీలోనే పదవీ విరమణ చేశారు. 1967లో తూర్పుగోదావరి జిల్లా పామర్రుకు చెందిన అనంతలక్ష్మితో వివాహమైంది. కృష్ణారావు, సత్యనారాయణ మూర్తి, ప్రసాద్ వీరి కుమారులు. రెండో కుమారుడు హైదరాబాదులో స్థిరపడగా, మిగతా ఇద్దరూ విజయవాడలో ఉంటున్నారు.

నివాళి



దుగ్గిరాల పూర్ణయ్య
(1936 – 2020)

వార్తల అనువాదంలో, పఠనంలో పన్యాల రంగనాథరావు, కొత్తపల్లి సుబ్రహ్మణ్యంగార్లు అంటే అభిమానం, గౌరవం అని చెప్పే దుగ్గిరాల పూర్ణయ్య మితభాషి, నిగర్వి! సూటిగా మాట్లాడే విధానం, లోతుగా అధ్యయనం చేయడం, కొంతవరకు ముభావంగా ఉండటం, కలివిడిగా దూసుకుపోయే తత్వం అసలు లేకపోవడం ఆయన విధానం. కాలక్షేపపు మాటలు, ఆర్భాటం, సభలలో పాల్గొవడం వంటివి అసలు పడదు. అందువల్ల మామూలుగా సాగే మెజారిటీవారికి ఇది కొరుకుడు పడని వ్యవహారం. సరిగా మాట్లాడడు, అహం అని కూడా కొందరు భావించవచ్చు. ప్రభుత్వ యంత్రాంగంలో కొందరి పద్ధతులు ఆయనకు నచ్చేవి కావు. అలాంటి వారిని కలవడం కూడా ఆయనకు ఇష్టం ఉండదు. కనుకనే ఆయన పెన్షన్ కాగితాలు ఆయనకు ఆలస్యంగా అందాయని అంటారు. నిజానికి న్యూఢిల్లీలో పార్లమెంటు వీధిలో ఉద్యోగం చేసే వ్యక్తి, అధిక చెలామణిలో వుండేకాలంలో ఆకాశవాణిలో నిత్యం పేరు, గొంతు వినబడే సౌలభ్యం ఉన్నవారు అక్కడ చేసే హడావుడి చాలా ఉంటుంది. ఆయనకు ఢిల్లీలో స్థిరపడాలనే ఆలోచన కూడా లేదు. కొన్న యిల్లును చౌకగా అమ్మివేశారు. అది ఇపుడు కోట్ల విలువ చేసేది. సొంత ఊరు అంటే అభిమానం. 2000 సంవత్సరంలో ఢిల్లీ నుంచి వచ్చేశారు. ఏడెనిమిది సంవత్సరాలు హైదరాబాదులో ఉన్నారు. ఆ సమయంలో స్ట్రోక్ రావడంతో ఆరోగ్యం దెబ్బతినింది. పన్నెండేళ్ళ క్రితం అంగలూరు వచ్చేశారు.

అప్పటి నుంచే ఆయన ఆరోగ్యం అంతంతమాత్రం. పెద్దగా తినరు. ఢిల్లీలో కూడా ఉద్యోగం అంటూ ఆఫీసుకొస్తే ఏడెనిమిది గంటలుండిపోయేవారు ఏదో చదువుకుంటూ, ఆకాశవాణి క్యాంటీన్‌లో మాకు మైసూర్ పాక్ వడ యిప్పించి తను టీ, బ్రెడ్ తినేవారు. స్వభావంలోనే కొంత బద్ధకం, వాయిదా వేసే లక్షణం ఉండేమో! ఆరోగ్యం బాగా దెబ్బతినింది. నాలుగేళ్ళ క్రితం మద్రాసు నుంచి విజయవాడ వచ్చినపుడు అంగలూరు వెళ్ళి వారిని కలిశాను. అంతకుముందు ఇంకోసారి వారితో ఒక రోజు గడిపాను. గత మూడు నెలలుగా ఆరోగ్యం బాగా చెడిపోయింది. మంచం మీద నుంచి లేవలేకపోయేవారు. భోజనం కూడా తినడం బాగా తగ్గిపోయింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక రెండు స్పూన్లు భోజనం చేసి పిమ్మట కనుమూశారు. ఇంకో 17 రోజులుండి ఉంటే 84 సం. పూర్తి అయ్యేవి.

గ్రామీణ జీవితం, వ్యవసాయం, రైతులు, వారిభాష, సహజత్వం పూర్ణయ్యకు ఇష్టం. ఆయన భాష, అనువాదం, అధ్యయనం కూడా అలానే ఉండేవి. వేమరాజు భానుమూర్తి, వాడ్రేవు పతంజలి వంటివారు పూర్ణయ్యగారి అనువాదాన్ని ఇష్టపడి గౌరవించేవారని పూర్ణయ్యను బాగా ఎరిగిన గణేశ్వరరావు చెబుతారు. మాట కొంత పెళుసు అయినా, మనసులో మర్మం లేదని ఆయనతో మూడు దశాబ్దాలు పనిచేసిన కందుకూరి సూర్యనారాయణ అంటారు. హోమ్ సెక్రెటరీగా పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి కె. పద్మనాభయ్య ఆయన బాల్య మిత్రులు. ఆయన ఎంత నిరాడంబరంగా జీవించారో అలాగే కనుమూశారు. ఇలా శ్రద్ధాంజలి వ్యాసం రాయడం కూడా వారికి ఇష్టం ఉండదు.

*ప్రత్యేకమైన మాడ్యులేషన్‌తో దుగ్గిరాల పూర్ణయ్య మూడు దశాబ్దాలపాటు చదివిన వార్తలు విలక్షణమైనవి. ఆ తరం రేడియో న్యూస్ రీడర్లకు గ్లామర్ ఉండేది. ఇదే విషయం ఆయనతో అంటే, 'ఒక చిన్న యంత్రం నుంచి మానవ కంఠం వినబడటమే ఆకర్షణ' అంటూ ఆ విషయాన్ని దాటవేసేవారు. గ్రామీణ జీవితం, వ్యవసాయం, రైతులు, వారిభాష, సహజత్వం పూర్ణయ్యకు ఇష్టం. ఆయన భాష, అనువాదం, అధ్యయనం కూడా అలానే ఉండేవి.*

□ డా. నాగసూరి వేణుగోపాల్

## దేవుణ్ణి చూశాను!

దేవుణ్ణి చూశాను
అవును నిజం
నేను దేవుణ్ణి చూశాను
ప్రాణాలను లెక్కచేయక
పొరుగువాడిని కాపాడేందుకు
ఆసుపత్రిలో అహరహం శ్రమించే
వైద్యుడిలో నేను దేవుణ్ణి చూశాను

ఖాకీ చొక్కాతో కాఠిన్యాన్ని
తొడుక్కొని, లాఠీతోనే భయపెడుతూ
అందరూ బాగుండాలని రోడ్డుమీద
పొద్దస్తమానం పహారా కాస్తున్న
పోలీసులో నేను దేవుణ్ణి చూశాను

మాయరోగం దేశమంతా కమ్మేసి
అందరినీ ఇంటికే పరిమితం చేసినా,
స్వచ్ఛతే మా మతమంటూ
శుభ్రతే మా కులమంటూ
ప్రాణాలకు తెగిస్తున్న
పారిశుధ్య కార్మికుడిలో
నేను దేవుణ్ణి చూశాను

కాలం అలా నిలిచిపోయినా,
జీవితం స్తంభించినా
చీకటి మీ ఇంటి గుమ్మం
తొక్కనివ్వనంటూ
వెలుగులు పంచే
కరెంటన్న కళ్లల్లో
నేను దేవుణ్ణి చూశాను

కాలమెంత కఠినమైనా
రోజులెంత దుర్భరమైనా
దేశానికి అన్నం పెట్టేందుకు
పంటపొలంలో కాయకష్టంచేసే
రైతన్న చెమట చుక్కలో
నేను దేవుణ్ణి చూశాను

దేవుణ్ణి చూశాను
అవును నిజం
నేను దేవుణ్ణి చూశాను
ప్రజలకు కష్టమొస్తే
ప్రళయమే ముంచుకొస్తే
తానే ఓ సైన్యమై
పాలనలో చైతన్యమై
రాష్ట్రాన్ని, దేశాన్ని
నడిపించే నాయకుడిలో
నేను దేవుణ్ణి చూశాను
అవును నిజం
నేను దేవుణ్ణి చూశాను.

– చక్రవర్తి గుంటుక

నవ్య
కుటుంబ కదంబం
ఆంధ్రజ్యోతి డాక్టర్
మంగళవారం ● 31 మార్చి 2020



ఆఫీసు ఒత్తిళ్లకు దూరంగా, పూర్తి సమయాన్ని కుటుంబ సభ్యుల మధ్య గడిపే అవకాశం దొరకడం ఎంతో అరుదు. లాక్‌డౌన్ ఈ అవకాశాన్ని కల్పించింది. అయితే, ఇలాంటప్పుడే ఆలుమగల మధ్య పొరపొచ్చాలు, పెద్దలు, పిల్లల మధ్య వాదోపవాదాలు తలెత్తుతాయి. కానీ ఈ ఆపదవేళ ఇంటిని ఆనంద మందిరంగా మలుచుకోవడం మన బాధ్యత. మానసిక కుంగుబాటు, ఆందోళనలు పెరిగేవేళ కుటుంబ సభ్యుల మధ్య అనురాగాలు, ఆప్యాయతలు మరింత పదిలపరుచుకునేందుకు ఇదే సరైన అదను!

# ఇల్లే... ఆనంద మందిరం!

గడప దాటలేని అసాధారణ పరిస్థితిలో ఇంట్లోనే వ్యాపకాలను వెతుక్కోక తప్పదు. ఇలాంటి హోం క్వారంటైన్‌ను కూడా ఆహ్లాదంగా మలుచుకోవచ్చు అని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. "ఇంటికే పరిమితమవడాన్ని కట్టడిగా అనుకోకూడదు. ఇలాంటి సమయంలో అలాంటి భావాలను ముందుగా మనసులో నుంచి తొలగించాలి" అని సీనియర్ సైకియాట్రిస్ట్ డా. ఎమ్.ఎస్ రెడ్డి సూచిస్తున్నారు.

## మాట్లాడుకోవడం మంచిది!

సాధారణ రోజుల్లో కుటుంబ సభ్యులంతా కలిసి గడిపే సమయం చాలా తక్కువ. ఇప్పుడు ఆ అవకాశం లభించింది. ఇలాంటి సమయంలోనే ఆలుమగల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తుతుంటాయి. ప్రస్తుతం చాలా కుటుంబాలలో కరోనాపై అవగాహన విషయంలోనే ఎక్కువగా వాద వివాదాలు చోటుచేసుకొంటున్నాయని సైకాలజిస్టు, ఫ్యామిలీ కౌన్సెలర్ డా. జి. పద్మజ చెబుతున్నారు. భార్యభర్తల్లో కరోనా జాగ్రత్తలపై ఎక్కువ అవగాహన కలిగిన ఒకరు చెప్పే సూచనలు, సలహాలను, అవగాహన లేని మరొకరు సులువుగా కొట్టిపారేసే అవకాశం ఉంది. దాంతో తన మాట వినలేదనే అహం అవతలి వ్యక్తిలోనూ, దాన్నే ఇవతలి వ్యక్తి చాదస్తంగానూ భావించడం జరుగుతుంది. ఇలా ఇరువురిలో చిరాకు, కోపం కలగడం సర్వసాధారణం. భావోద్వేగాలను అదుపుచేసుకోలేక గొడవలకు దారితీస్తాయి. కాబట్టి అభిప్రాయభేదాలు

తలెత్తినప్పుడు, ఆలుమగలిద్దరూ కలిసి కూర్చొని మాట్లాడుకోవడం ఉత్తమం. కరోనా వైరస్ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను మిగతా కుటుంబ సభ్యులు పాటిస్తున్న క్రమంలో కొంతమంది వృద్ధులు 'తమని దూరంపెడుతున్నారనే' భావనకు లోనయ్యే అవకాశమూ ఉంది. కనుక వారికి సమస్యను అర్థం చేయించాల్సిన బాధ్యతా కుటుంబ సభ్యులదే ! ఆ సమయంలో పెద్దలతో సున్నితంగా వ్యవహరించాలనే సంగతి మర్చిపోకూడదు.

## సంభాషణే బంధాలకు బలం..!

"ప్రస్తుత పరిస్థితుల్లో తల్లితండ్రులు పిల్లలకు మధ్య కాంట్రడిక్షన్స్ తలెత్తడం సహజం. ఇక పిల్లల మధ్య తగవులు, కొట్లాటలు అల్లరి వంటివి చెప్పనక్కర్లేదు. అయితే, ఇలాంటి సమయంలో పెద్దలు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. పిల్లలకు మంచి అలవాట్లను, అభిరుచులను అలవర్చడంలో ఇదే మంచి సమయం. లాక్‌డౌన్ అన్నిరోజులూ పిల్లలకు రెగ్యులర్ యాక్టివిటీని అప్పగించాలి. ఉదాహరణకు ఉదయాన్నే నిద్రలేచిన తర్వాత ఎవరికి వారు పక్కదుప్పట్లను మడతపెట్టడం. తిన్నతర్వాత ఎవరి ప్లేటును వారే కడగడం వంటి పనులను వారి నిత్యజీవితంలో భాగం చేయాలి. ఇంటి పనిలోనూ పిల్లలను ఇన్వాల్వ్ చేయాలి. పిల్లల కోసం కొన్ని కథలనైనా తల్లితండ్రులు నేర్చుకోవాలి. రోజులో ఒక్కసారైనా పిల్లలకు కథలు చెప్పాలి. లేదంటే, తమ జీవితంలోని మంచి అనుభవాలను పిల్లలతో పంచుకోవచ్చు. అదీ వాళ్లకు బోర్‌కొట్టకుండా చెప్పగలగాలి. పనిని ఆలుమగలిద్దరూ పంచుకోవాలి. టీవీ ఛానళ్లు చూసే సమయంలోనూ పిల్లలకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలి. అదీ మంచి కార్యక్రమాలను, పిల్లల వికాసానికి తోడ్పడే ప్రోగ్రామ్స్‌ను చూసేలా ప్రోత్సహించాలి. అనుక్షణం పిల్లలను ఒక కంట కనిపెడుతుండాలి. అతిగా బోర్ ఫీలైనా కుంగుబాటుకి లోనయ్యే ప్రమాదం ఉంది. కనుక ఇంట్లోనే రోజంతా బిజీగా ఎంగేజ్ అయ్యేలా చేసుకోవాలి. కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తినప్పుడు వాదనలకు దిగకుండా, సంభాషించుకోవాలి. ఇంట్లో ప్రశాంతత నెలకొనాలంటే కుటుంబ సభ్యుల మధ్య సంభాషణ చాలా అవసరం. అదే బంధాలకు బలం."



- డా. జి.పద్మజ
సీనియర్ సైకాలజిస్టు

## పిల్లలకు మార్గదర్శకులుగా నిలుద్దాం!

ప్రస్తుతం ఇంట్లో పిల్లల్ని సముదాయించడం పెద్దల ముందున్న అతి పెద్ద సవాల్. సాధారణ రోజుల్లో పిల్లలను టెలివిజన్, స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంచేందుకు తల్లితండ్రులు శతవిధాల ప్రయత్నించడం ప్రతీ కుటుంబంలో జరిగేదే. ఇప్పుడు మాత్రం పిల్లలు అడగకుండానే, వాళ్ల చేతికి సెల్‌ఫోన్ ఇచ్చేస్తున్నారు. చిన్నారులు మెచ్చే టెలివిజన్ ఛానళ్లనే పెద్దలూ చూస్తున్నారు. అందుకు కారణం వాళ్లను ఎలా ఎంగేజ్ చేయాలో తెలియనితనమే! కొందరు టీనేజర్లు తల్లితండ్రుల మాటలు వినకుండా బయటకు వెళ్లే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అలాంటి సమయంలో తల్లితండ్రులు ఆంక్షలు జారీచేస్తున్నట్లు వ్యవహరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలను తీర్చిదిద్దేందుకు, వారిలో మంచి వ్యాపకాలు, అభిరుచులను ఇష్టంగా అలవాటు చేసేందుకు తల్లిదండ్రులకు ఇంతకన్నా మంచి సమయం రాదు. అంతేకాదు, పిల్లలకు మాటలరూపంలో మంచిని బోధించడం కన్నా తమ ప్రవర్తన రూపంలో తల్లితండ్రులు స్ఫూర్తిగా నిలవాలి.

## తాగకుండా ఉండలేని వారికోసం..

లాక్‌డౌన్ వేళ నిత్యావసరాలు దొరకడమే కష్టమైన సందర్భంలో మద్యం దొరకడం అసాధ్యమే! అయితే, ఈ అలవాటు మానుకొనేందుకూ లాక్‌డౌన్ తోడ్పడుతుంది. మద్యం తాగేవారిలో వ్యసనపరుల సంఖ్య 5% నుంచి 7% లోపే అని ఆశా రిహాబిలిటేషన్ సెంటర్ వైద్యుడు, సైకియాట్రిస్టు డా. రమణ చెరుకూరి చెబుతున్నారు. అయితే పరిమితంగానైనా రోజూ మద్యం సేవించేవారు, ఒకేసారి ఆ అలవాటుకి దూరం అవడం వల్ల తలతిరగడం, చెమటలు పట్టడం, నిద్రలేమి, కోపం, చిరాకు వంటి సమస్యలు కలిగే అవకాశం లేకపోలేదు. అలాంటి సమయంలో వారు చీటికి మాటికి ఇరిటేట్ అవ్వడం, కోపం ప్రదర్శించడం వంటివి చేస్తుంటారు. కనుక ఆ సమయంలో వారు మంచినీరు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వీలైతే మల్టీ విటమిన్ మాత్రలనూ వాడవచ్చు. పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటే మాత్రం సైకియాట్రిస్టును సంప్రదించడం మంచిది. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే ఇల్లే ఆనందమందిరం అవుతుంది.

## పనిని పంచుకుందాం!

కుటుంబ వ్యవస్థలో ఇంటి, వంట పనంతా ఆడవాళ్ల పేటెంట్ అనుకొనే ధోరణి పాతుకుపోయింది. భర్త, పిల్లలంతా ఇంటి పట్టునే ఉండటం సగటు ఇల్లాలికి అత్యంత సంతోషదాయకమే.! అయినా ఆమెపై విపరీతమైన పనిభారం. "లాక్‌డౌన్ నేపథ్యంలో గృహిణులపై విపరీతమైన పనిభారం పెరిగిందని" సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇలాంటి సమయంలోనే ఆడ, మగ భేదాలు మరిచి, ఇంటి పనిని సమంగా పంచుకోవాలి. మగవాళ్లు అహంభావం తీసి అటకమీద పెట్టి ఇంటి పనుల్లో భార్యకు



సహాయపడవచ్చు. గరిట తిప్పడానికీ వారికి ఇదే మంచి సమయం. భార్య చేతివంట తినడమే కాదు, స్వీయపాకం భార్యకు, పిల్లలకూ తినిపిస్తూ ఉండాలి.

## రోజును పక్కాగా ప్లాన్ చేసుకోండి..!

ఈ లాక్‌డౌన్ రోజుల్ని కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపేందుకు పక్కాగా ప్లాన్ చేసుకోవాలి. అప్పుడు ఫియర్ కాంప్లెక్స్, డిప్రెషన్ దరిచేరవు. అందుకు ఇవి పాటించాలి.

- తప్పనిసరిగా ప్రతి గంటకు పది నిమిషాలు ఇంట్లోనే నడవాలి. తద్వారా రక్తప్రసరణ సజావుగా సాగుతుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యానికీ మంచిది.
- మనసుని తేలికపరిచేందుకు మంచి సంగీతం తోడ్పడుతుంది.
- ఎప్పటి నుంచో చదవాలనుకొని చదవలేకపోయిన పుస్తకాలను చదివేందుకు ఇప్పుడు సమయం దొరికింది.
- రోజంతా కరోనా వార్తలు చూస్తూ గడపకండి. దాని వల్ల భయాందోళనలు తప్ప మరొక ప్రయోజనం లేదు.
- సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండటం ఉత్తమం. అందులోని అవాస్తవాలను తెలుసుకోవడం ద్వారా ఆందోళన పెరుగుతుంది.
- ధ్యానం చేయడం మంచిది.
- మితాహారం, అందులోనూ ఆరోగ్యకరమైన పదార్థాలే తీసుకోవాలి. తద్వారా రోగనిరోధకశక్తిని కాపాడుకోవచ్చు.
- వైరస్‌లు, జబ్బుల పేరుతో భయపెట్టే సినిమాలను చూడకపోవడం మంచిది.
- పగటిపూట అర్థగంటకు మించి నిద్రపోవద్దు.
- రాత్రివేళ కనీసం ఎనిమిది గంటలు హాయిగా నిద్రపోవాలి. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు కలుగుతుంది.



- డా. ఎం.ఎస్.రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్టు

## కరోనా టెస్ట్



# ఇలా పరీక్ష చేస్తారు!

కరోనా వైరస్ నిర్ధారణ కోసం ప్రత్యేక పరీక్ష చేయవలసి ఉంటుంది.

నావెల్ కరోనా వైరస్‌ను కనిపెట్టే పరీక్షా విధానాన్ని 'రివర్స్ ట్రాన్స్‌క్రిప్షన్ క్వాంటిటేటివ్ పాలిమెరేజ్ చైన్ రియాక్షన్' అంటారు. ఈ పరీక్ష కోసం....

1. అనుమానిత వ్యక్తి ముక్కు, గొంతు నుంచి 'శ్వాబ్/నమూనాను సేకరించి, ల్యాబ్‌కు పంపిస్తారు.
2. 'రివర్స్ ట్రాన్స్‌క్రిప్షన్' ద్వారా, వైరస్ ఆర్.ఎన్.ఎ (రైబోన్యూక్లియక్ యాసిడ్)ను డి.ఎన్.ఎగా మార్చి, దాన్లోని కొంత భాగాన్ని లక్ష్యంగా చేసుకుని, సూక్ష్మంగా పరీక్షిస్తారు.
3. లక్ష్యంగా చేసుకున్న భాగం పరీక్షలో కొంత వెలుగును విరజిమ్ముతుంది.
4. ఈ వెలుగు తీవ్రతను కంప్యూటరు రికార్డు చేస్తుంది. ఈ ఫలితాన్ని పాజిటివ్, నెగటివ్ శాంపిళ్లతో సరిపోలుస్తారు.
5. పాజిటివ్ శ్యాంపిల్ అయిన పక్షంలో, దాన్ని నెగటివ్ శ్యాంపిల్‌తో సరిపోల్చినప్పుడు, అది ఎక్కువగా వెలుగును విరజిమ్ముతుంది.
6. వైరస్ రూపం మార్చుకోవడం వల్ల తప్పుడు ఫలితం వెలువడే ప్రమాదం ఉంటుంది కాబట్టి, నూటికి నూరు శాతం కచ్చితత్వం కోసం శాస్త్రవేత్తలు ఒకటికి మించి ఎక్కువ టెస్ట్ కిట్స్‌ను ఉపయోగించి, శ్యాంపిళ్లను పరీక్షిస్తారు.

## ● కామిక్ కరోనా

కార్టూన్: చారి పి.ఎస్



# వెంటిలేటర్ ఎందుకు?

కరోనా వైరస్ చికిత్సలో అత్యంత ప్రధానమైన, కీలకమైన పరికరం 'వెంటిలేటర్'. ప్రాణాపాయ స్థితిలో వాడే వెంటిలేటర్ కరోనా పీడితులలో ఎవరికి అవసరం ఎవరికి? ఎంతమేరకు? దీని ప్రభావం ఎంత? పని చేసే తీరు ఏంటి?

శ్వాసకోశ వ్యవస్థను పరిరక్షించుకోలేకపోతే శ్వాస అందక, రక్తంలో సరిపడా ఆక్సిజన్ కలవదు. ఫలితంగా ఊపిరితిత్తులతో పాటు అంతర్గత అవయవాలు ఒక్కొక్కటిగా పని చేయడం మానేస్తాయి. ఫలితంగా, అంతిమంగా మరణం సంభవిస్తుంది. కరోనా వైరస్ మరణాలకు మూల కారణం ఇదే! కాబట్టి శ్వాసకోస వ్యవస్థను రక్షించుకునే చర్యల్లో భాగంగా గొంతులో నుంచి నేరుగా ఊపిరితిత్తుల్లోకి గాలిని పంప్ చేసే వెంటిలేటర్లను వాడవలసి ఉంటుంది.

## అవగాహన



### ఎవరికి అవసరం?

రోగి ప్రాణాలను కాపాడడం కోసం వైద్యులు చేసే చివరి ప్రయత్నం వెంటిలేటర్ అమర్చడం! రోగి తనంతట తాను గాలి పీల్చుకోలేని దశలో వెంటిలేటర్ అవసరం. సాధారణంగా ఊపిరితిత్తులు గాలిని పీల్చుకుని, దాన్లోని ఆక్సిజన్‌ను సంగ్రహించి, రక్తంలో కలిసేలా చేస్తాయి. కార్బన్ డయాక్సైడ్‌ను తిరిగి ముక్కు ద్వారా బయటకు పంపిస్తూ ఉంటాయి. కరోనా వైరస్ ప్రభావంతో ఊపిరితిత్తుల సామర్థ్యం కుంటుపడినప్పుడు, రోగి తనంతట తాను గాలి పీల్చుకోలేని స్థితికి చేరుకున్నప్పుడు వెంటిలేటర్ మీద ఆధారపడక తప్పదు. ఈ పరికరం ఆస్పత్రిలో బెడ్ పక్కనే ఏర్పాటై ఉంటుంది. ఇది రోగి ఊపిరితిత్తుల్లోకి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పంపించడంతో పాటు, కార్బన్ డయాక్సైడ్‌ను సేకరించి, వెలుపలికి వదులుతుంది. అయితే రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి, అందుకు తగినట్లు వెంటిలేటర్ ద్వారా ఆక్సిజన్ ఒత్తిడి, పరిమాణాలను సరిచేయవలసి ఉంటుంది.

### వెంటిలేటర్ అమరిక ఇలా...

గొంతులో నుంచి స్వరపేటిక మీదుగా ఊపిరితిత్తుల్లోకి 'ఇంట్యుబేషన్' ట్యూబ్‌ను అమర్చే క్రమం కొంత క్లిష్టమైన ప్రక్రియ. దీన్ని అమర్చే సమయంలో పొరపాట్లు జరగకుండా ఉండడం కోసం సాధారణంగా వైద్యులు రోగులను మెలకువగానే ఉంచుతారు. రోగి మెలకువగా ఉన్న పక్షంలో, ఆరోగ్య పరిస్థితి గురించి రోగిని ఆరా తీయడం కోసం మత్తు ఇవ్వరు. అయితే వెంటిలేటర్ అమర్చే సమయంలో రోగికి మాట్లాడే వీలు ఉండదు కాబట్టి ప్రశ్నలు అడుగుతూ, రోగి సంజ్ఞల ద్వారా అతని స్థితిని అంచనా వేస్తూ వెంటిలేటర్ అమరిక కొనసాగుతుంది. వెంటిలేటర్ మీద ఉన్న రోగికి నొప్పి తగ్గించే మందులు కొన్ని సందర్భాల్లో వైద్యులు అందిస్తారు. అలాగే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం కోసం అవసరాన్ని బట్టి రోగికి ఇచ్చే మత్తు మందు మోతాదునూ తగ్గిస్తారు.

### ఇతర రుగ్మతల్లో కూడా....

కేవలం శ్వాసకోశ సమస్యల్లోనే కాకుండా కొన్ని ఇతర ఆరోగ్య సమస్యల్లో కూడా వెంటిలేటర్ అవసరం పడుతూ ఉంటుంది. నాడీకండర వ్యాధులు, అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్, బ్రెయిన్ డ్యామేజ్ మొదలైన సందర్భాల్లో రోగి ప్రాణాలు కాపాడడం కోసం వెంటిలేటర్ అమరుస్తారు.

### వెంటిలేటర్ల కొరత!

ప్రస్తుతం మన దేశంలో దాదాపు లక్ష వెంటిలేటర్లు ఉన్నాయి. అయితే వైద్య నిపుణుల అంచనాల ప్రకారం ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో కొవిడ్ - 19 రోగుల ప్రాణాలు కాపాడుకోవాలంటే, ప్రతి 10 వేల మంది రోగులకూ 2.1 వెంటిలేటర్లు అవసరం అవుతాయి. దీన్ని బట్టి ప్రస్తుతం మన దేశానికి 70 వేల వెంటిలేటర్ల తక్షణ అవసరం ఉంది. అయితే అతి తక్కువ సమయంలో నెలకు నాలుగు నుంచి ఐదు వేల వెంటిలేటర్ల చొప్పున వెంటిలేటర్లను ఏర్పాటుచేసుకోగలిగితే కరోనా రోగుల ప్రాణాలను కాపాడుకోవచ్చు అని అంటున్నారు వైద్య నిపుణులు.

**లాక్‌డౌన్ సమయంలో మద్యం దొరకని పరిస్థితిలో మద్యానికి బానిసలుగా మారిన వారికి ఇబ్బందులు ఎదురవడం అత్యంత సహజం. వ్యసనంగా మారిన మద్యం అందుబాటులో లేక అసహనానికి లోనవుతారు. ఇలాంటప్పుడు ఎలా వ్యవహరించాలి? వైద్యులు కొన్ని సూచనలు చేస్తున్నారు!**

# మత్తు వదలట్లేదా?

లాక్‌డౌన్ సమయంలో మద్యానికి అలవాటు పడిన వారిలో మైల్డ్, మోడరేట్, సివియర్... ఇలా మూడు రకాల లక్షణాలు కనిపిస్తాయి.

**మైల్డ్:** రాత్రుళ్లు నిద్ర పట్టకపోవడం, డిప్రెషన్, అసహనం

**మోడరేట్:** తీవ్ర అసహనం, చీకాకు, కోపం, ప్రతి ఒక్కరినీ తిడుతూ ఉండడం

**సివియర్:** ఈ కోవకు చెందినవారికి 'ఆల్కహాల్ విత్‌డ్రాయల్ సీజర్స్' వస్తాయి. ఈ పరిస్థితి తలెత్తినప్పుడు వైద్యులను సంప్రతించాలి. మైల్డ్, మోడరేట్ దశల్లో కనిపించే లక్షణాలను మందులతో తగ్గించగలిగినా, సివియర్ కోవకు చెందిన వ్యక్తులను వైద్యుల దగ్గరకు తప్పక తీసుకువెళ్లాలి.

## విత్‌డ్రాయల్ సిండ్రోమ్



### మానడానికి ఇదే అదను!

"కొందరు మద్యానికి బానిసలుగా మారకపోయినా, ఆల్కహాల్ తీసుకుంటేనే తాము సమర్థంగా పనిచేయగలం, ఉల్లాసంగా ఉండగలం అనే అపోహలో ఉండిపోతారు. ఈ స్వభావాన్ని 'ఆల్కహాల్ డిపెండెన్స్' అంటారు. ఈ సమస్యకు వాడే మందులతో మద్యం తాగాలనే ఆలోచనలు కూడా రాకుండా ఉంటాయి. నిజానికి మిగతా వారితో పోలిస్తే, ఈ కోవకు చెందిన వారు ఆల్కహాల్ మానేయడం తేలిక. మద్యం దొరకని ఈ సమయంలో, మందులతో వీరి చేత మద్యం శాశ్వతంగా మాన్పించవచ్చు. అందుకు ఇదే అనువైన సమయం."



- డాక్టర్ సోమశేఖర్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
హైదరాబాద్.

### వారం నుంచి పది రోజులు!

చిరాకు, అసహనం, డిప్రెషన్ మొదలైన లక్షణాలు సాధారణంగా వారం నుంచి పది రోజుల పాటు వేధించి, తగ్గిపోతాయి. మందులు వాడకపోయినా ఆరోగ్యపరంగా ఎలాంటి నష్టమూ కలగదు. అయితే తీవ్రతను బట్టి వైద్యులనూ సంప్రతించవచ్చు. లాక్‌డౌన్ కారణంగా కొంత మంది వైద్యులు ఆన్‌లైన్ కన్సల్టేషన్స్ ద్వారా అందుబాటులో ఉంటున్నారు. వారు సూచించే మందులతో విత్‌డ్రాయల్ సింప్టమ్స్‌ను తగ్గించుకోవచ్చు.

### ఇలా మనసు మళ్లించాలి!

యోగా, ధ్యానం వల్ల ఆల్కహాల్ విత్‌డ్రాయల్ సింప్టమ్స్ అదుపులోకి వస్తాయి. కుటుంబసభ్యులతో కాలక్షేప కార్యకలాపాల్లో పాల్గొనడం, పిల్లలతో ఆటలు ఆడడం, టి.వి చూడడం, మనసును ఉల్లాసంగా ఉంచే పనులు చేయడం ద్వారా కూడా విత్‌డ్రాయల్ లక్షణాలను తగ్గించుకోవచ్చు. వ్యాయామంతో ఫీల్ గుడ్ హార్మోన్లు విడుదలై మద్యం నుంచి మనసు మళ్లుతుంది. ఆల్కహాల్ ద్వారా పొందే కంఫర్ట్‌ను వ్యాయామంతోనూ భర్తీ చేయవచ్చు. ఫలితంగా మద్యం తాగాలనే ఆలోచనలు రావు.

## యూబీఐ, బీఓబీ రుణాలపై తగ్గిన వడ్డీ రేటు

ముంబై : రెపో ఆధారిత రుణాలపై బ్యాంకుల వడ్డీ రేటు తగ్గింపు కొనసాగుతోంది. తాజాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) వ్యక్తిగత, రిటైల్ రుణాలపై వడ్డీ రేటు 0.75 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. దీంతో ఫ్లోటింగ్ వడ్డీ రేటు ఉండే యూబీఐ రుణాలపై వడ్డీ రేటు 7.95 శాతం నుంచి 7.20 శాతానికి తగ్గుతుంది. బీఓబీ రుణాలపైనా వడ్డీ రేటు 8 శాతం నుంచి 7.25 శాతానికి తగ్గింది.

**ఇసుజు:** వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం వరకు బీఎస్-6 వాహనాల విడుదలను వాయిదా వేసింది.

**మారుతి సుజుకీ:** వినియోగదారుల వాహనాలకు సంబంధించి వారంటీ గడువు, సర్వీస్ తేదీలను పొడిగిస్తున్నట్లు తెలిపింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 మధ్య కాలంలో ఉచిత సర్వీస్, వారంటీ గడువు ముగుస్తున్న వారికి గడువు తేదీని జూన్ 3 వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

**సెబీ:** వడ్డీ, ప్రిన్సిపల్ రుణ మొత్తం చెల్లింపులో జాప్యాన్ని డిఫాల్ట్‌గా పరిగణించరాదని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలను సెబీ కోరింది. లాక్‌డౌన్ కారణంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని దీంతో రుణాల చెల్లింపులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని తెలిపింది.

## ట్రక్కులు, కార్మికులే పెద్ద సవాలు

▸▸ ఎఫ్ఎంసీజీ కంపెనీల వివరణ



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 21 రోజుల లాక్‌డౌన్ అమలులో ఉన్న నేపథ్యంలో కార్మికుల లభ్యతతో పాటుగా వస్తు రవాణాకు ట్రక్కులు లేకపోవడం పెద్ద సవాలుగా ఉన్నదని ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఐటీసీ, డాబర్ ఇండియా, పార్లే వివరించాయి. ఇటీవల ప్రభుత్వం తయారీ ప్లాంట్లు పని చేయడానికి, వస్తు రవాణా వాహనాలు తిరగడానికి అనుమతి ఇచ్చినందు వల్ల ఆ కష్టాలు కొంతవరకు తగ్గాయంటూ అన్ని రకాల నిత్యావసరాల సరఫరాలు క్రమంగా మెరుగురుస్తామని హామీ ఇచ్చాయి. ఇంతవరకు ప్రధాన అవరోధంగా ఉన్న ఆ రెండు సమస్యలు తీరడంతో సరఫరాల వ్యవస్థ క్రమంగా పనిచేయడం ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. అయితే చాలా మంది కార్మికులు స్వస్థలాలకు తరలిపోవడం వల్ల ఫ్యాక్టరీలు పని చేయడానికి అవసరమైన కార్మికుల లభ్యత పెద్ద సమస్యగానే ఉన్నదని డాబర్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షారుఖ్ ఖాన్, పార్లే ప్రొడక్ట్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ మయాంక్ షా అన్నారు. అంతర్ రాష్ట్ర వాహనాల రవాణాకు గల ఆంక్షలు కూడా అతి పెద్ద సవాలని ఐటీసీ ప్రతినిధి చెప్పారు.



చరిత్ర పుటల్లోకి

# ఆంధ్రా బ్యాంక్!

## తొమ్మిది దశాబ్దాలకుపైగా సేవలు

### రేపు యూనియన్ బ్యాంకులో విలీనం

ఆంధ్రా బ్యాంక్ దాదాపు తొమ్మిది దశాబ్దాలుగా తెలుగు నేలతో పాటు వివిధ రాష్ట్రాల్లో బ్యాంకింగ్ సేవలు అందించింది. అలాంటి బ్యాంక్ పేరు బుధవారం నుంచి చరిత్రలో కలిసిపోతోంది. విలీనాల ద్వారా పీఎస్‌బీల బలో

**తెలుగు రాష్ట్రాల్లో సుపరిచిత బ్యాంకుగా**

పేతం పేరుతో తెలుగు ప్రజలతో ముడిపడి రెండు ప్రముఖ పీఎస్‌బీలను కేంద్ర ప్రభుత్వం ఇతర పీఎస్‌బీల్లో కలిపేస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో కలిసిపోయింది. ఇప్పుడు తాజాగా ఆంధ్రా బ్యాంక్.. యూబీఐలో విలీనమవుతోంది.

ఆంధ్రా బ్యాంక్ కథ నేటితో కంచికి చేరుతోంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య 1923 నవంబరులో ప్రైవేటు బ్యాంకుగా ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించారు. డిపాజిట్లు రూ.50 కోట్ల కంటే కొద్దిగా తక్కువగా ఉండడంతో 1969లో జాతీయకరణను తప్పించుకుంది. ఇందిరా గాంధీ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత 1980 ఏప్రిల్‌లో మాత్రం ఆంధ్రా బ్యాంక్ జాతీయకరణను తప్పించుకోలేకపోయింది. బుధవారం (ఏప్రిల్ 1) నుంచి మరో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో విలీనమవుతూ తన ఉనికినే కోల్పోతోంది. ఆంధ్రా బ్యాంక్‌తో పాటు కార్పొరేషన్ బ్యాంక్ యూబీఐలో విలీనమవుతోంది.

**ఆంధ్రా బ్యాంక్ చరిత్ర**

- 20-11-1923న నమోదు
- 28-11-1923 నుంచి బ్యాంకింగ్ కార్యకలాపాలు
- 1969-1980 మధ్య దేశంలో నెంబర్ వన్ ప్రైవేటు బ్యాంక్‌గా గుర్తింపు
- 15-4-1980లో జాతీయకరణ
- 2019 మార్చి నాటికి 26 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2,885 శాఖలు, 3,798 ఏటీఎంలు
- 1981లో దేశంలో తొలిసారిగా క్రెడిట్ కార్డుల వ్యాపారం ప్రారంభం
- 01-04-2020న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం

కాగా యూబీఐలో విలీనాన్ని ఆంధ్రా బ్యాంక్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. పీఎస్‌బీల బలోపేతానికి విలీనాలు పరిష్కారం కాదని, దీనివల్ల ఉద్యోగుల ఉద్యోగ భద్ర

**ఉద్యోగుల వ్యతిరేకత**

తకూ ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విలీనం తర్వాత దాదాపు 700 శాఖలను హేతుబద్ధం చేయాల్సి ఉంటుందని యూబీఐ ఎండీ, సీఈఓ ప్రకటించడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. కోవిడ్-19తో దేశం వణికిపోతున్నా, ప్రభుత్వం మొండి పట్టుదలతో ఆంధ్రా బ్యాంక్‌ను యూబీఐలో విలీనం చేయడాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా తప్పుపట్టాయి.

**ఆస్తులూ అమ్మేస్తాం**

విలీనం తర్వాత ఆంధ్రా బ్యాంక్‌కు చెందిన కొన్ని స్థిరాస్తులను అమ్మేయాలని యూబీఐ నిర్ణయించింది. ఇందు కోసం ఇప్పటికే కొన్ని నివాస, వాణిజ్య సముదాయాల్ని గుర్తించినట్టు యూబీఐ ఎండీ, సీఈఓ రాజ్‌కిరణ్ రాయ్ ప్రకటించారు. ఈ ఆస్తులతో పాటు ఇండి యా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, మలేషియాలోని ఇండియా ఇంటర్నేషనల్ బ్యాంక్ మలేషియాలో ఉన్న వాటానూ విక్రయించాలని నిర్ణయించింది.

**ఇక ఏపీ ఎస్ఎల్‌బీసీ యూబీఐ**

విలీనాలతో ఆయా రాష్ట్రాల స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్లు కూడా మారిపోయారు. ఏప్రిల్ 1 నుంచి యూబీఐ ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్‌బీసీ కన్వీనర్‌గా వ్యవహరిస్తుంది. ఆర్‌బీఐ ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఆంధ్రా బ్యాంక్.. ఆంధ్రప్రదేశ్ ఎస్ఎల్‌బీసీ కన్వీనర్‌గా వ్యవహరించింది. విలీనంతో ఆ బాధ్యత ఇప్పుడు యూబీఐకి వచ్చింది.

# 17 ఏళ్ల కనిష్ఠ స్థాయికి క్రూడాయిల్

▸▸ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథం
▸▸ 'ఎక్సైజ్' రూపంలో బాదేస్తున్న ప్రభుత్వం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర సోమవారం మరింత పడిపోయింది. ఫ్యూచర్స్ మార్కెట్లో పీపా (బ్యారల్) బ్రెంట్ రకం ముడి చమురు ధర 23 డాలర్లకు దిగొచ్చింది. 2002 నవంబరు తర్వాత బ్రెంట్ ముడి చమురు ధర ఈ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. అమెరికాలో ఉత్పత్తి అయ్యే ముడి చమురు ధర కూడా సోమవారం కొద్దిసేపు 20 డాలర్ల దిగువన ట్రేడైంది. కరోనా వైరస్‌తో ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోవడం, డిమాండ్‌ను మించి సరఫరా ఉండడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

కాగా ఏప్రిల్ 1 నుంచి సౌదీ అరేబియా, రష్యా రోజువారీ ఉత్పత్తిని 36 లక్షల పీపాల మేర పెంచబోతున్నాయి. సౌదీ అరేబియా అయితే మే నెల నుంచి రోజువారీ ఎగుమతులనూ ప్రస్తుత కోటి బ్యారళ్ల నుంచి 1.6 కోట్ల బ్యారళ్లకు పెంచాలని నిర్ణయించింది. దీంతో బ్యారల్ ముడి చమురు ధర త్వరలోనే 20 డాలర్ల దిగువకు దిగొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**దేశీయంగా అవే ధరలు**

ఈ నెల 16 నుంచి అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 20 శాతం వరకు తగ్గింది. భారత వినియోగదారులకు మాత్రం ఆ ప్రయోజనం దక్కడం లేదు. ఆయిల్ కంపెనీలు గత 14 రోజులుగా అవే ధరలు కొనసాగిస్తున్నాయి. ఈ నెల 14న కేంద్ర ప్రభుత్వం లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని మూడు రూపాయలు పెంచడమే ఇందుకు ప్రధాన కారణం. ఆ రూ.3 భారాన్ని భర్తీ చేసుకునేందుకు ఆయిల్ కంపెనీలు గత 14 రోజులుగా అవే ధరలు కొనసాగిస్తున్నట్టు భావిస్తున్నారు.

**భారత్‌లో తగ్గటం డౌటే**

బ్యారల్ ముడి చమురు ధర 20 డాలర్ల దిగువకు దిగొచ్చినా మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధర పెద్దగా తగ్గే సూచనలు కనిపించడం లేదు. కరోనా దెబ్బతో కుదేలైన ఆర్థిక వ్యవస్థను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇటీవలే రూ.1.7 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించింది. అదే సమయంలో లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని మరో రూ.8 పెంచేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఈ ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం లీటర్‌కు రూపాయి పెంచినా కేంద్ర ప్రభుత్వానికి ఏటా అదనంగా రూ.14,500 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఉద్దీపన ప్యాకేజీ కోసం ఖర్చు చేసే రూ.1.7 లక్షల కోట్లను ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ సుంకం రూపంలో రాబట్టుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**మళ్లీ చతికిలపడిన స్టాక్ మార్కెట్**

స్టాక్ మార్కెట్ సోమవారం మళ్లీ చతికిలపడింది. వారం ప్రారంభం తొలి రోజే సెన్సెక్స్ 1,375.27 పాయింట్ల నష్టంతో 28,440.32 వద్ద, నిఫ్టీ 379.15 పాయింట్ల నష్టంతో 8,281.10 వద్ద క్లోజయ్యాయి. దీంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ దాదాపు రూ.2.85 లక్షల కోట్ల మేర తుడిచి పెట్టుకుపోయింది. అమ్మకాల హోరుతో ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 1,500 పాయింట్లకుపైగా నష్టపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో కేవలం ఆరు కంపెనీల షేర్లు మాత్రమే కొద్దిపాటి లాభాలతో క్లోజయ్యాయి. కరోనా వైరస్ బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరగడం, రేటింగ్ ఏజెన్సీలు భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను వరుసపెట్టి కుదించడం, కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు మార్కెట్‌ను భయపెట్టాయి. ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి ప్రవేశించిందన్న ఐఎంఎఫ్ హెచ్చరికా, మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

## జీఎంఆర్ భాగస్వామి గ్రూపే ఏడీపీకి రూ.20,750 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) అంతర్జాతీయ భాగస్వామి గ్రూపే ఏడీపీ బాండ్ల జారీ ద్వారా 250 కోట్ల యూరోలు (దాదాపు రూ.20,750 కోట్లు) సమీకరించింది. జీఏఎల్‌లో గ్రూపే 49 % వాటాను ఫిబ్రవరిలో రూ.10,780 కోట్లకు కొనుగోలు చేసింది.

## ఆర్థిక సంవత్సరం జూన్‌కి వాయిదా వేయండి

న్యూఢిల్లీ: కోవిడ్-19 కారణంగా ఆర్థిక సంవత్సరాన్ని జూన్ చివరి వరకు వాయిదా వేయాలని పారిశ్రామిక సమాఖ్యలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. సీఐఐ, ఫిక్కీ, అసోచాం ప్రతినిధులు కార్పొరేట్ వ్యవహారాల శాఖ అధికారులను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను నివేదించడంతో పాటు ప్రస్తుత పరిస్థితిని దీటుగా ఎదుర్కొనడానికి కొన్ని సూచనలు కూడా అందించాయి.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 30వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 335 | విశాఖపట్నం | 345 |
| 31వ తేదీకి.. | | వరంగల్ | 338 |
| చిత్తూరు | 353 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 345 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 70 | విజయవాడ | 62 |
| వరంగల్ | 70 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 70 | ఒంగోలు | 58 |
| కరీంనగర్ | 70 | చిత్తూరు | 75 |
| కర్నూలు | 70 | నెల్లూరు | 75 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 56 |
| గోదావరి | 65 | | |

# స్పోర్ట్స్

## సెప్టెంబరులో ఐపీఎల్?



**మ్యాచ్‌ల కుదింపు**

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ తాజా సీజన్‌ను రద్దు చేసేందుకు బీసీసీఐ ఇష్టపడడం లేదా? ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ ఏడాది జరపాలనుకుంటోందా? బోర్డు ఆలోచనలను బట్టి చూస్తే ఇది నిజమేననిపిస్తోంది. కొవిడ్-19 ధాటికి ఈనెల 29 నుంచి ఆరంభం కావాల్సిన ఈ లీగ్ ఏప్రిల్ 15 వరకు వాయిదా పడింది. అప్పుడైనా జరుగుతుందా? అనే విషయంలో స్పష్టత లేదు. కానీ బోర్డు ఆంతరంగిక సమాచారం ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరు మధ్య ఐపీఎల్‌ను నిర్వహించాలన్న పట్టుదలతో బీసీసీఐ ఉంది.

**రద్దయినా నష్టం లేదు:** ఐపీఎల్ రద్దయితే బీసీసీఐ భారీగా నష్టపోతుందనే కథనాలు కూడా నిజం కాదట. ఎందుకంటే బ్రాడ్‌కాస్టర్లతో కూడిన ఒప్పందంలో 'ఫోర్స్ మెజ్యూర్' నిబంధన బోర్డుకు వరం కానుంది. దీని ప్రకారం విపత్కర పరిస్థితులు నెలకొన్నపుడు లీగ్‌ను రద్దు చేసే వెసులుబాటు ఉంది. అలాగని అటు బ్రాడ్‌కాస్టర్లు కూడా పెద్దగా నష్టం ఎదురుకాదని, ఐపీఎల్ పూర్తి ఇన్సూరెన్స్ చేయబడిన ఆస్తిగా బోర్డు వర్గాలు తెలిపాయి.

**తక్కువ మ్యాచ్‌లతోనే:** కరోనా నియంత్రణలోకి వచ్చి ఐపీఎల్ జరిగినా తక్కువ మ్యాచ్‌లతోనే ముగించే ఆలోచనలో నిర్వాహకులు ఉన్నారు. అప్పటికి టీ20 ప్రపంచకప్ సమీపంలోనే ఉంటుండడంతో ఈ లీగ్‌ను కుదించే అవకాశం ఉందని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి.

## ధోనీ డిసైడయ్యాడా!



**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తిరిగి భారత జట్టులోకి ఎప్పుడు వస్తాడనేది అంతు పట్టకుండా ఉంది. గతేడాది వన్డే వరల్డ్‌కప్ సెమీస్ తర్వాత టీమిండియాకు ఎంఎస్ దూరమయ్యాడు. కానీ ఐపీఎల్‌లో తన సత్తా ఏమిటో నిరూపించుకుని టీ20 ప్రపంచకప్‌లోనూ ఆడతాడని చాలా మంది భావించారు. అయితే ఊహించని విధంగా ఆ లీగ్ జరగడం కష్టంగానే మారింది. దీంతో ఇప్పుడు అంతా అతడి భవితవ్యం గురించే ఆలోచిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే అతడు తన రిటైర్మెంట్ ఆలోచనను కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పంచుకున్నాడని సమాచారం. అంతర్జాతీయ కెరీర్ ఇక ముగిసినట్టేనని, అయితే సీఎస్‌కే తరపున మరో రెండు సీజన్ల వరకు కొనసాగుతానని చెప్పాడట. 38 ఏళ్ల వయస్సులో జాతీయ జట్టుకు ఆడాల్సిన అవసరం లేదనే భావనలో ఈ మిస్టర్ కూల్ ఉన్నాడని, సమయమొచ్చినప్పుడు రిటైర్మెంట్‌ను అధికారికంగా ప్రకటిస్తాడని ఓ కథనం. మరోవైపు ఐపీఎల్‌లో తన ఫామ్‌ను అంచనా వేసుకున్నాకే ఏదో ఓ నిర్ణయం తీసుకుంటాడని, లేకపోతే ఎప్పుడో ఆట నుంచి వైదొలిగేవాడని సీఎస్‌కే సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా స్పాన్సర్‌షిప్ కారణంగానే ధోనీ త్వరగా వీడ్కోలు నిర్ణయం ప్రకటించడం లేదని, ఇది అతడిని ఆర్థికంగా నష్టపరుస్తుందని బోర్డు అధికారి ఒకరు తెలిపారు.

## బ్రయంట్ టవల్ @ రూ.25 లక్షలు



**లాస్‌ఏంజిల్స్:** బాస్కెట్‌బాల్ దిగ్గజం కోబి బ్రయంట్‌కు చెందిన టవల్‌కు భారీ ధర పలికింది. 2016లో లాస్‌ఏంజిల్స్ లేకర్స్ తరపున చివరి ఎన్‌బీఏ మ్యాచ్ ఆడిన బ్రయంట్ చివర్లో అభిమానులను ఉద్దేశించి మాట్లాడాడు. ఆ సమయంలో చెమటను తుడుచుకునేందుకు భుజంపై టవల్ వేసుకున్నాడు. ఆదివారం ఆన్‌లైన్‌లో జరిగిన వేలంలో అదే టవల్‌ను లేకర్స్ వీరాభిమాని ఒకరు 33 వేల డాలర్ల (రూ.25 లక్షలు)కు కొనుగోలు చేశాడు. ఈ జనవరిలో బ్రయంట్‌తో పాటు అతడి కుమార్తె హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు.



# వచ్చేసింది.. కొత్త తేదీ

**2021లో జూలై 23 నుంచి ఒలింపిక్స్**
**ఆగస్టు 8న ముగింపోత్సవం**
**కొత్త షెడ్యూల్ ప్రకటన**

**టోక్యో:** కరోనా వైరస్ కారణంగా వాయిదా పడిన ఒలింపిక్స్.. సరిగ్గా ఏడాది తర్వాత జరగనున్నాయి. 'కరోనా వైరస్‌పై మానవాళి విజయం'గా 2021 ఒలింపిక్స్‌ను నిర్వహించనున్నట్టు టోక్యో ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు యోషిరో మోరీ సోమవారమిక్కడ చెప్పారు. వాయిదా నిర్ణయం వెలువరించిన వారం రోజులలోపే రీషెడ్యూల్‌ను ప్రకటించారు. '2021, జూలై 23 నుంచి ఆగస్టు 9 వరకు విశ్వక్రీడలను, ఆగస్టు 24 నుంచి సెప్టెంబరు 5 వరకు పారాలింపిక్స్‌ను షెడ్యూల్ చేశామ'ని మోరీ తెలిపారు. వాస్తవంగా ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు ఒలింపిక్స్ జరగాలి. కానీ, ప్రపంచ వ్యాప్తంగా కరోనా కోరలు చాస్తున్న నేపథ్యంలో వాయిదా వేయాల్సిన పరిస్థితి..! కానీ, వచ్చే ఏడాది ఇంచుమించు ఇదే సమయానికి మెగా ఈవెంట్ ఆరంభం కానుంది. చలికాలంలో విశ్వక్రీడలను నిర్వహిస్తారనే ఊహాగానాలు వచ్చినప్పటికీ.. యూరోపియన్ సాకర్, నార్త్ అమెరికా స్పోర్ట్స్ లీగ్‌లు అడ్డు వస్తుండడంతో ఇదే టైం స్లాట్‌ను ఖరారు చేశారు. దాదాపు ఏడేళ్లుగా టోక్యో ఒలింపిక్స్ కోసం సన్నాహకాలు చేశారు. కానీ, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య అత్యయిక పరిస్థితి నెలకొనడంతో ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాలు విశ్వక్రీడల్లో పాల్గొనడం లేదని ప్రకటించాయి. అన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెరగడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో మెగా ఈవెంట్‌ను వచ్చే ఏడాదికి వాయిదా వేస్తున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), ఆర్గనైజింగ్ కమిటీలు ప్రకటించాయి.

**రూ. 95 వేల కోట్ల అదనపు భారం..!**



నూతన షెడ్యూల్ ప్రకటిస్తున్న టోక్యో క్రీడల చీఫ్ యోషిరో మోరీ

రీషెడ్యూల్ చేయడం వల్ల ఆర్థికంగా తీవ్రమైన భారాన్ని మోయాల్సి ఉంటుందని ఆర్గనైజింగ్ సీఈఓ తోషిరో మూటో చెప్పారు. తాజా బడ్జెట్ అంచనాల ప్రకారం దాదాపుగా రూ. 95 వేల కోట్ల అదనపు భారం పడుతుందని భావిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఆర్గనైజింగ్ కమిటీ, జపాన్ ప్రభుత్వం, టోక్యో సిటీ సంయుక్తంగా మోయనున్నాయి. 2011లో జరిగిన ప్రకృతి విలయాలు భూకంపం, సునామీ, ఫుకుషిమా న్యూక్లియర్ ప్రమాదం నుంచి జపాన్ కోలుకొన్న తీరుకు గుర్తుగా 2020 ఒలింపిక్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, కరోనా మహమ్మారి కారణంగా విశ్వక్రీడలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఈ వైరస్‌పై మానవాళి విజయానికి గుర్తుగా ఈ ఒలింపిక్స్‌ను నిర్వహించనున్నట్టు మోరీ గుర్తుచేశారు. ప్రస్తుతం మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని కొత్త తేదీల ప్రకటన సమయంలో ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ అన్నారు. కానీ, ఒలింపిక్స్ కారు చీకట్లో కాంతిపుంజమని చెప్పారు.

## విరుష్క విరాళం ఎంత..?



**ముంబై:** దేశవ్యాప్తంగా కరోనా వైరస్ భయాందోళనలు రేకెత్తిస్తుండగా అటు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రముఖుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు అతడి భార్య అనుష్క శర్మ కూడా తమవంతు విరాళాన్ని ప్రకటించారు. అయితే బహిరంగంగా ఈ మొత్తాన్ని వెల్లడించకపోయినా ఇద్దరూ కలిసి ప్రధాని అత్యవసర నిధి, మహారాష్ట్ర సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.3 కోట్లను అందించినట్టు సమాచారం. 'పీఎం కేర్స్ ఫండ్ అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ (మహారాష్ట్ర)కు నేను, అనుష్క మద్దతు ఇస్తున్నాం. బాధితులను చూసి మా హృదయాలు బద్దలవుతున్నాయి. మా వితరణతోటి ప్రజానీకానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం' అని కోహ్లీ ట్వీట్ చేశాడు.

## సచినే బెస్ట్ బ్యాట్స్‌మన్

**షేన్ వార్న్**



**మెల్‌బోర్న్:** బరిలోకి దిగాక ఎలాంటి పరిస్థితుల్లోనైనా బ్యాటింగ్ చేయగల సామర్థ్యం సచిన్ టెండూల్కర్ సొంతమని ఆసీస్ దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ కొనియాడాడు. తాను క్రికెట్ ఆడిన సమయంలో సచినే బెస్ట్ బ్యాట్స్‌మన్ అని అభిమానులు అడిగిన ప్రశ్నకు బదులిచ్చాడు. 'కఠిన పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయగల సామర్థ్యమున్న ఆటగాళ్లలో సచిన్, లారా ముందుంటారు. కానీ, ఇద్దరిలో ఒక్కరినే ఎంచుకోమంటే నేను సచిన్ వైపే మొగ్గు చూపుతా. అయితే చివరి రోజు 400 పరుగులను ఛేదించాల్సి వస్తే లారాను ఎంపిక చేస్తా. ఇక మా మాజీ కెప్టెన్ స్టీవ్ వా మ్యాచ్ విన్నర్‌గా కాకుండా మ్యాచ్‌ను రక్షించేవాడిగా చెబుతా' అంటూ వార్న్ తెలిపాడు.

## రొనాల్డో బాటలో మెస్సీ

**బార్కా ప్లేయర్ల జీతాల్లో కోత**



**మాడ్రిడ్:** కరోనా వైరస్‌తో.. క్రీడారంగం కూడా స్తంభించిపోయింది. దీంతో ఫుట్‌బాల్ క్రీడాకారులు తమ జీతాల్లో కోత విధించుకుంటున్నారు. ఇప్పటికే స్టార్ ఆటగాడు, యువెంటస్ జట్టుకు చెందిన క్రిస్టియానో రొనాల్డో 4 నెలల వేతనాన్ని వదులుకోగా.. తాజాగా బార్సిలోనా క్లబ్ ఆటగాడైన లియోనెల్ మెస్సీ తన వేతనంలో 70 శాతం కోత విధించుకుంటున్నట్టు ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపాడు. బార్కా జట్టు ఆటగాళ్లంతా జీతంలో 30 శాతం మాత్రమే తీసుకుంటారనీ.. క్లబ్‌కు చెందిన కిందిస్థాయి ఉద్యోగులకు మాత్రం 100 శాతం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మెస్సీ తెలిపాడు.

## ట్రాన్స్‌జెండర్లకూ ఓ ఫుట్‌బాల్ జట్టు

**దేశంలో తొలిసారి మణిపూర్‌లో**



**న్యూఢిల్లీ:** క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు సాధారణంగా కనిపించేవే. కానీ, దేశంలో తొలిసారి మణిపూర్‌లో ట్రాన్స్‌జెండర్ ఫుట్‌బాల్ టీమ్ ఏర్పాటైంది. యవోల్ అనే స్వచ్ఛంద సంస్థ విద్యార్థులు, ఆటపట్ల ఆసక్తి ఉన్న 14 మంది ట్రాన్స్‌జెండర్లతో ఈ టీమ్‌ను తయారు చేసింది. హోలీ పండుగ సమయంలో సెవెన్ ఎ సైడ్ ఫుట్‌బాల్ మ్యాచ్‌తో ఈ జట్టును అధికారికంగా పరిచయం చేశారు. 'ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం. కానీ, ఆడటానికి ఎన్నో ఇబ్బందులు, వివక్ష. ఇప్పుడు నా లాంటి వారితో టీమ్‌ను తయారు చేయడం ఎంతో ఆనందంగా ఉంది' అని ఆటగాడు చకి హుడ్రోమ్ తెలిపాడు.

## మిథాలీ సాయం 10 లక్షలు



**న్యూఢిల్లీ:** కొవిడ్-19 మహమ్మారిపై పోరు కోసం తెలుగమ్మాయి భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ రూ. 10 లక్షలు విరాళం ప్రకటించింది. పీఎం కేర్స్ ఫండ్‌కు, తెలంగాణ సీఎం ఫండ్‌కు చెరి ఐదేసి లక్షలు ఇవ్వనుంది. ఇక మరో క్రికెటర్ పూనమ్ యాదవ్ రెండు లక్షలివ్వనుండగా, బాక్సింగ్ దిగ్గజం, రాజ్యసభ సభ్యురాలైన మేరీకోమ్ తన నెల వేతనం ప్రకటించింది. ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ భూటియా తన సొంతరాష్ట్రం సిక్కింలో వలసకూలీకి స్థావరం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాడు.

# కరోనా కల్లోలం

## 'లాక్‌డౌన్' సమన్వయ బృందాలు

- అఖిల భారత సర్వీసు అధికారులతో ఏర్పాటు
- రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- జిల్లాల్లో జేసీ నేతృత్వంలో ఏర్పాటు



అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి విస్తరిస్తోన్న నేపథ్యంలో లాక్‌డౌన్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ సందర్భంగా నిత్యావసరాల లభ్యత, దానితో ముడిపడిన ఏ ఒక్క అంశంలోనూ సమస్య రాకుండా పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అఖిల భారత సర్వీసు అధికారులతో అత్యున్నత స్థాయి సమన్వయ బృందాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఐఐఎస్‌లతోపాటు ఐపీఎస్ అధికారులకూ ఇందులో భాగస్వామ్యం కల్పించారు. లాక్‌డౌన్ పక్కాగా అమలయ్యేలా అత్యవసర సేవల్లో పాల్గొనే విభాగాలను ఎప్పటికప్పుడు సమన్వయం చేయడం, నిత్యావసర సరుకులు పక్కాగా ప్రజలకు చేరేందుకు అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవడాన్ని ఈ బృందాలు పర్యవేక్షిస్తుంటాయి. ఇక ఆయా అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు, సలహాలు తీసుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తాయి.

**కమిటీల విధులు:** రాష్ట్రంలో లాక్‌డౌన్ ఎలా అవుతోందో నిర్ధారిస్తాయి. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిత్యావసరాలు అందుతున్నాయా? లేదా?, సరుకు రవాణాలో ఏమైనా చిక్కులు ఎదురవుతున్నాయా? అన్నది పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలను సిఫారసు చేస్తాయి. అంతేకాదు, ఈ మొత్తం వ్యవహారంతో ముడిపడిన, సంబంధించిన శాఖల వ్యవహారాల్లో ఈ బృందాలు పాలుపంచుకొంటాయి. నిత్యావసరాల ప్రస్తుత ధరలు, రానున్న రోజుల్లో ఉండే ట్రెండ్ ఎలా ఉంటుందో ముందుగానే ప్రకటిస్తారు. 1902, స్పందన కాల్ సెంటర్లకు వచ్చే ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాయి. మార్కెటింగ్, పౌరసరఫరాలు, పోలీసు, డైయిరీ డెవలప్‌మెంట్, పశుసంవర్థక, మత్స్య, పురపాలక, పంచాయితీరాజ్, కార్మిక శాఖల నుంచి వచ్చే సమాచారాన్ని క్రోడీకరిస్తారు. ఈ సమన్వయ బృందం ఇన్‌చార్జి నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

## 55 ఏళ్లు దాటిన పోలీసులు స్టేషన్‌లోనే

విజయవాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 55 ఏళ్లు పైబడిన ఉద్యోగులను లాక్‌డౌన్ విధులకు దూరంగా ఉంచినట్టు డీజీపీ గౌతమ్ సవాంగ్ చెప్పారు. వారిని కార్యాలయాలు, స్టేషన్లలో విధులకు మాత్రమే వినియోగిస్తున్నామని తెలిపారు. విజయవాడలో లాక్‌డౌన్ అమలు తీరును సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. రాణీగారితోట, రైల్వేస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్, బెంజ్‌సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు.

## కళ్లుగప్పి తెలంగాణ నుంచి ఏపీకి

రాజంపేట, మార్చి 30: లాక్‌డౌన్ నేపథ్యంలో తెలంగాణ నుంచి 30 మంది అధికారుల కళ్లుగప్పి ఏపీలోని స్వగ్రామాలకు చేరుకోవడం కడప జిల్లా రాజంపేటలో తీవ్ర కలకలం రేపింది. కరోనా కారణంగా బయట తిరగలేని పరిస్థితి ఏర్పడడంతో నాలుగు రోజుల క్రితం వారు మోటారు సైకిళ్లు, ఇతర వాహనాల ద్వారా అధికారుల కళ్లుగప్పి స్వగ్రామాలకు చేరుకున్నారు. అయితే వారంతా ఐసోలేషన్‌లో లేకుండా బయట తిరుగుతుండడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. నందలూరు మండల వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌వో పిల్లి పిచ్చయ్య ఆధ్వర్యంలో వైద్య బృందం ఆ గ్రామానికి వెళ్లింది. తమను ఐసోలేషన్‌కు తరలిస్తారన్న భయంతో వారంతా పొలాల్లో దాక్కున్నారు. పోలీసులు అక్కడకు చేరుకుని..తెలంగాణ నుంచి వచ్చిన వారందర్నీ పిలిపించి 14 రోజులు తప్పనిసరిగా గృహ నిర్బంధంలో ఉండాల్సిందేనని లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పుల్లంపేట మండలానికి చెందిన ఓ మహిళ ఈ నెల 18న సింగపూర్ నుంచి స్వగ్రామానికి వచ్చింది. అదే విమానంలో ప్రయాణించిన ఓ మహిళకు కరోనా పాజిటివ్ తేలడంతో పుల్లంపేట మహిళను అధికారులు సోమవారం కడప రిమ్స్‌కు తరలించారు.

## కష్టకాలం.. కలిసి ఎదుర్కొందాం: గవర్నర్



అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి నేపథ్యంలో దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. ప్రజలందరం ఉమ్మడిగా ఎదుర్కోవడమే దీనికి మార్గమని పిలుపునిచ్చారు. ఇంట్లోనే ఉండడం, తరచూ చేతులు కడుక్కోవడం, భౌతిక దూరం పాటించడమే కరోనా వైరస్‌ను ఎదుర్కొనే మార్గమని స్పష్టం చేశారు. ప్రపంచ పరిణామాలు చూస్తుంటే ప్రతి ఒక్కరూ ఎంత జాగ్రత్తగా ఉండాలో అర్థమవుతోందన్నారు. జాగ్రత్తలు పాటించాలని, కరోనాపై యుద్ధంలో భాగస్వాములు కావాలని సోమవారం ప్రజలకు ప్రత్యేక సందేశం ఇచ్చారు. పేదలు, అనాథలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని సహాయనిధికి పారిశ్రామికవేత్తలు, సినీ పరిశ్రమ, వ్యాపారవర్గాలు విరివిగా విరాళాలు ఇస్తున్నాయని అభినందించారు. మరింతగా విరాళాలు ఇచ్చి సహకరించాలన్నారు. తనవంతుగా సీఎం సహాయనిధికి లక్ష రూపాయలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

## కరోనాపై పోరులో మేము సైతం: ఎంటీఎఫ్

కరోనా మహమ్మారిపై పోరులో భాగస్వాములయ్యేందుకు తామూ సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. తమతోపాటు అర్బన్ మండల విద్యాశాఖాధికారి పరిధిలో పని చేస్తున్న జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల సేవలను కూడా వినియోగించుకోవచ్చని ప్రభుత్వానికి సూచించారు ఈ అంశాలన్నింటినీ సోమవారం పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, కమిషనర్ అండ్ డైరెక్టర్ జేఎస్సార్కేఆర్ విజయ్‌కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ తెలిపారు.

## విభిన్న ప్రతిభావంతులకు 'వర్క్ ఫ్రమ్ హోం'

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్లకు లాక్‌డౌన్ కాలంలో అత్యవసర సేవలలో పని చేయకుండా మినహాయింపు ఇవ్వాలని దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. దీంతోపాటు ఆఫీసులకు రావాలన్న నిబంధనకూ మినహాయింపు ఇచ్చి, ఇంటి నుంచి పని చేసే అవకాశం కల్పించేలా(వర్క్ ఫ్రమ్ హోం) చర్యలు తీసుకోవాలని ఆయా ప్రభుత్వ శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేస్తూ మెమో జారీ చేశారు. వర్క్ ఫ్రమ్ హోం అవకాశం కల్పించిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి, ఈ ఉత్తర్వులు సాధించడంలో కృషి చేసిన ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ఏపీ విభిన్న ప్రతిభావంతుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

## తప్పుడు వార్తలతో కష్టాలు తెచ్చుకోవద్దు!

కరోనా వైరస్‌కు సంబంధించిన వార్తలు ఏవైనా సంబంధిత అధికారులతో ధ్రువీకరించుకోకుండా ప్రచురణ, ప్రసారం, సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాప్తి చేయరాదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే చట్టపరంగా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

## అన్న క్యాంటీన్లు తెరవండి: బీజేపీ

పొరుగు రాష్ట్రాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న మన రాష్ట్ర కూలీలకు తగిన ఏర్పాట్లు చేసేలా ఆయా ప్రభుత్వాలతో మాట్లాడాలని ముఖ్యమంత్రి జగన్‌కు బీజేపీ కార్యదర్శి, జాతీయ లేబర్ బోర్డు చైర్మన్ జయప్రకాశ్ నారాయణ సోమవారం లేఖ రాశారు. ఏపీలో కూడా దినసరి కూలీలు, భిక్షగాళ్లు, వికలాంగులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని, వైసీపీ ప్రభుత్వం మూయించిన అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాలని ఆయన కోరారు.

## కన్నతల్లి కడసారి చూపూ దక్కనివ్వని కరోనా

కంచికచర్ల రూరల్, మార్చి 30: కృష్ణాజిల్లా కంచికచర్ల పట్టణంలో ప్రముఖ ఫ్యాన్సీ వ్యాపారవేత్త దొడ్డా ప్రసాద్ తల్లి తులశమ్మ ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ప్రసాద్‌కు సోదరి కూడా ఉంది. ఆమె గుంటూరులో భర్తతో నివాసముంటోంది. తల్లి మృతి వార్త తెలిసినా కరోనా లాక్‌డౌన్ కారణంగా అధికారులు అనుమతించకపోవటంతో చివరి చూపునకూ వెళ్లలేకపోయింది. బంధువులు కూడా గ్రామంలో ఉన్న కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ఆమె మృతదేహాన్ని ఆటోలో శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.




కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎం జగన్. కింది ఫొటోలో గవర్నర్ విశ్వభూషణ్‌తో భేటీ

# ఇళ్లల్లో జల్లెడ!

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. లాక్‌డౌన్ అమలు తీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇకముందూ మరింత పకడ్బందీగా వ్యవహరించాలి. లేదంటే లక్ష్యం నీరుగారిపోతుంది" అని సూచించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం కలెక్టర్లు, ఎస్పీలతో కరోనా వైరస్ నివారణ చర్యలపై ఆయన వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. "కరోనాకు సంబంధించి మనం ఇప్పటి వరకూ గట్టి చర్యలు తీసుకున్నాం. సమష్టిగా అందరమూ పనిచేస్తున్నాం. గ్రామవార్డు వలంటీర్లు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, డాక్టర్లు, నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పోలీసు సిబ్బంది గట్టిగానే పని చేస్తున్నారు' అని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

వసతులు పెంచిన ప్రత్యేక ఆస్పత్రులు ఇవే.. (బ్రాకెట్లలో ప్రస్తుత సామర్థ్యం)

| | విశాఖ విమ్స్ | కృష్ణా సిద్ధార్థ | నెల్లూరు జీజీహెచ్ | తిరుపతి పద్మావతి |
|---|---|---|---|---|
| నాన్ ఐసీయూ బెడ్లు | 400 (-) | 500 (450) | 400(200) | 380 (320) |
| ఐసీయూ బెడ్లు | 148 (36) | 114 (55) | 132 (32) | 50 (25) |

### జనం మధ్య రెండు బృందాలు

"పట్టణ, గ్రామప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. రెండు రకాల బృందాలు దీనికోసం పనిచేయాలి. మొదటి దశలో వార్డు వలంటీర్లు, డ్వాక్రా బృందాలు, ప్రైమరీ రీసోర్సు పర్సన్లు, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు, అదనపు ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఉంటారు. విదేశాల నుంచి వచ్చిన వారు ఉన్నా.. లేకున్నా ప్రతి ఇంటినీ సర్వే చేసి వైరస్ ఉన్న వారిని గుర్తించాలి. ప్రతి రోజూ ప్రతీ కుటుంబాన్నీ పరిశీలించాలి. రెండో స్థాయిలో.. ప్రతి కార్పొరేషన్‌లోనూ ప్రతి వార్డుకు ఒక డాక్టరును ఏర్పాటు చేయాలి. మునిసిపాలిటీల్లో ప్రతి మూడు వార్డులకూ ఒక డాక్టరును ఉంచాలి. టీమ్‌లను పర్యవేక్షించే బాధ్యత కలెక్టర్లు, కమిషనర్లదే"

### ప్రైవేటు సేవలు వాడుకోవాలి

"ప్రతి రోజూ ప్రతి ఇంటినీ సర్వే చేయాలి. ఇంట్లోనే వైద్యం చేయించుకుని కోలుకునే సందర్భాలు ఉన్నాయి. వయస్సు ఎక్కువగా ఉన్నవారు, బీపీ, షుగరు వ్యాధులతో బాధపడుతున్నవారిపై ఎక్కువగా దృష్టి సారించాలి. ప్రైవేటు వైద్యుల సేవలను వినియోగించుకోవాలి. శానిటరీ వర్కర్లకు మాస్కులు ఇవ్వాలి. రేషన్ దుకాణాల దగ్గర భౌతిక దూరం పాటించాలి. గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో పారిశుధ్య పనులు విస్తృతంగా జరగాలి. నిత్యావసర వస్తువులు అధిక ధరలకు అమ్మితే జైలుకు పంపుతాం. విశాఖలో విమ్స్, కృష్ణా జిల్లాలో సిద్ధార్థ హాస్పిటల్, నెల్లూరు జీజీహెచ్, తిరుపతిలో పద్మావతి అస్పత్రుల్లో క్రిటికల్ కేర్ కోసంఏర్పాట్లు చేస్తున్నాం. వీటిలో ఉన్న 1370 బెడ్లను 1680కు పెంచుతున్నాం. వెంటిలేటర్లతో కూడిన బెడ్‌లనూ 148నుంచి 444 కు పెంచుతున్నాం"

### జిల్లాలవారీగా..

"కరోనా సోకిన దాదాపు 15 శాతం కేసులు ఆసత్రులలో చేర్పించాల్సి ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికోసం జిల్లాల వారీగానూ ఆసుపత్రుల్లో సౌకర్యాలను పెంచుతున్నాం. ఈ ఆసుపత్రుల్లో నాన్ ఐసీయూ బెడ్లను 6762 నుంచి 8050కు, ఐసీయూ బెడ్‌లను 336 నుంచి 515కు పెంచుతున్నాం. ఇవిపూర్తిగా కోవిడ్ -19 సోకినవారికి ఆయా జిల్లాల్లో సేవలు అందిస్తాయి. కలెక్టర్లు వీటిని స్వయంగా పర్యవేక్షించాలి. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించాలి. ఇళ్లల్లో ఉండటం ఇష్టంలేనివారు నేరుగా క్వారంటైన్ కేంద్రాలకు రావచ్చు. కల్యాణ మండపాలు, హోటళ్లు, వసతులు ఉన్న కాలేజీలు, హస్టళ్లు ఇలాంటి వాటివన్నీ తీసుకుని వాటిని శానిటైజ్ చేసి ప్రతి జిల్లాకూ ఐదువేల బెడ్లు చొప్పున సిద్ధం చేయాలి. పట్టణ పేద నిరాశ్రయుల కోసం ఏర్పాటుచేసిన నైట్ షెల్టర్లలో అన్ని సదుపాయాలు ఉంటాయి. తిండిలేనివారికి సరైన సదుపాయాలు లేవన్న మాట రానివ్వొద్దు. సరిహద్దుల్లో ఉన్న మనవాళ్లను కూడా ఇదే విధంగా చూసుకోవాలి. ప్రతి షెల్టరు వద్ద ఒక రెసిడెంట్ అధికారిని పెట్టాలి. జాగ్రత్తలతో వ్యవసాయ కార్యకలాపాలు నిర్వర్తించాలి. అంపెడా ప్రకటించిన రేట్ల ప్రకారం ఆక్వా రైతులకు ధర వచ్చేలా చూడాలి. గ్రామ సచివాలయాల్లో ఈ ధరలు ప్రకటించాలి. భౌతిక దూరం పాటిస్తూనే వ్యవసాయ కార్యకలాపాలు చేపట్టాలి. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వలంటీర్లు, వైద్యులు నిర్వహించే సర్వేకు రైతులు వారి కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండాలి. రబీ ధాన్యం వస్తున్నందున రైతుకు మంచి రేటు వచ్చేలా చూడాలి. వ్యవసాయోత్పత్తులు తరలించే వాహనాలపై ఆంక్షలొద్దు."

## దాతృత్వం చాటుకోండి

- 20-35 ఏళ్ల లోపు యువకులంతా క్వారంటైన్‌లో పనికి రండి: సీఎం

కరోనా వైరస్ కారణంగా పాలన స్తంభించి, పౌర సేవలకు విఘాతం కలుగుతున్న ఈ ఆపత్కాలంలో దాతలు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపిచ్చారు. సోమవారం రాష్ట్రంలోని పెద్ద మనుషులు, దాతలు, సేవా దృక్పథం కలిగిన వారికి సీఎం తరఫున ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 14 వరకూ లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలు స్తంభించాయని.. ఖజానా ఖాళీ అయ్యే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దాతలు, ట్రస్టులు, ఎన్‌జీవోలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ సంస్థల అధిపతులు వివిధ రూపాల్లో సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సర్జికల్ మాస్కులు, ఎన్-95 మాస్కులు, పీపీఈ యూనిట్‌లు, శానిటైజర్లు, మొబైల్ ఎక్స్‌రే మిషన్లు, వెంటిలేటర్లు, పల్స్ ఒక్స్ మీటర్లు, బీఐపీఏపీలనూ అందించాలని కోరారు. 20 నుంచి 35 ఏళ్ల లోపున్న నాన్ మెడికల్ సిబ్బంది క్వారంటైన్ సెంటర్లు, ఐసోలేషన్ కేంద్రాలలో సేవలందించేందుకు ముందుకు రావాలని కోరారు.

## గవర్నర్‌తో సీఎం భేటీ

- కరోనా కట్టడి చర్యలపై వివరణ
- 15 రోజుల్లో రెండో సారి భేటీ

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. సోమవారమిక్కడ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కరోనా వైరస్ నివారణపై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం విజయవాడలోని రాజ్‌భవన్‌కు గవర్నర్‌ను కలిశారు. రాష్ట్రంలో అమలులో ఉన్న లాక్‌డౌన్.. జిల్లాల వారీగా నియంత్రణలో ఉన్న కరోనా వైరస్ కేసులు.. విదేశాల నుంచి వచ్చినవారి సంఖ్య, వారిపై నిఘా తదితర అంశాలను ఆయనకు వివరించారు. కాగా.. గవర్నర్‌ను ముఖ్యమంత్రి ఈ నెలలో కలవడం ఇది రెండోసారి. కరోనా వైరస్ ఉధృతి నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసినందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌పై ఆగ్రహించిన ఆయన.. ఈ నెల 15వ తేదీన విశ్వభూషణ్‌ను కలిసి ఫిర్యాదుచేసిన సంగతి తెలిసిందే. కరోనా తీవ్రత లేదని, స్థానిక ఎన్నికలు జరపవచ్చునని గవర్నర్‌కు చెప్పిన 15 రోజుల్లోనే కరోనా కట్టడికి తీవ్రతకు తీసుకున్న చర్యలను వివరించడానికి మళ్లీ రాజ్‌భవన్‌కు వెళ్లడం కొసమెరుపు.



## పడి లేచిన కోడి!

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకూ బతికున్న కోడి రూ.10-20కి కూడా కొనేవారు లేక కోళ్ల కంపెనీలు, పౌల్ట్రీ రైతులు నష్టాల్లో కొట్టుమిట్టాడారు. ఇప్పుడు లాక్‌డౌన్ పుణ్యమాని పరిస్థితి తారుమారైంది. అందరూ ఇళ్లల్లోనే ఉండడంతో వినియోగం ఎక్కువై చికెన్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. దీంతో కేజీ చికెన్ ధర పుంజుకుని రయ్‌మంటూ రూ.170-200 మార్కుని తాకింది. ఇన్నాళ్లూ నష్టాల్లో కొట్టుమిట్టాడిన కోడి రైతు, కంపెనీలు కొత్త బ్యాచ్‌ను పెంచడం ఆపేశాయి. ఇప్పుడు ఉన్నట్టుండి పెరగడంతో డిమాండ్‌కు సరిపడా స్టాకు లేకపోవడం కూడా ధరలు ఎగబాకడానికి కారణమైంది. కరోనా కారణంగా మొన్నటివరకు కిలో కోడి రూ.20లోపే పలకడంతో రైతుకు పెంపకం ఖర్చులు కూడా రాలేదు. దీంతో కోళ్లను మేపలేక వదిలేశారు. మరికొన్ని చోట్ల గొయ్యి తీసి పాతేశారు. ఈ పరిణామాలతో 60శాతం కోళ్ల ఫారాల్లో అసలు కోళ్లే లేకుండా పోయాయి. ల లాక్‌డౌన్ నేపథ్యంలో మాంసాహార ప్రియులు మళ్లీ చికెన్‌పై పడ్డారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న కోళ్ల ఫారాల్లో స్టాకు అంతంతమాత్రమే ఉంది. మళ్లీ కోళ్ల కంపెనీలు కోడి పిల్లల్ని సరఫరా చేసి.. వాటిని పెంచాలంటే కనీసం 45రోజులు పడుతుంది. అప్పటి వరకూ ప్రస్తుతం ఉన్న స్టాకు సరిపోకపోతే కోడి మాంసం రేటు మరింత పెరిగే అకాశాలున్నాయి.



కడపలో రేషన్ షాపు వద్ద గుంపులుగుంపులుగా జనం

# రెండో రోజూ బారులే

- కార్డుదారులకు 'రేషన్' చుక్కలు
- క్యూ లైన్లలో గంటల తరబడి నిరీక్షణ
- 'కరోనా' భౌతిక దూరానికి చెల్లుచీటీ

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల కోసం షాపులకు వెళ్తున్న లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పంపిణీలో స్పష్టత లేకపోవడం, ఉదయం నుంచే భారీ సంఖ్యలో కార్డుదారులు షాపులకు పోటెత్తడంతో గంటల తరబడి క్యూ లైన్లలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాక్‌డౌన్ వల్ల బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు కొనలేక కష్టాలు పడుతున్న పేదలు రేషన్ సరుకుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 29వ తేదీ నుంచే రేషన్ దుకాణాల్లో సరుకులు లభ్యమవుతున్నా లబ్ధిదారులు అందరూ ఒకే సమయంలో రావడం, లాక్‌డౌన్ సమయం కుదించిన నేపథ్యంలో భౌతిక దూరం పాటించడం కూడా కష్టమైపోతోంది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రేషన్ పంపిణీని పరిశీలిస్తే ఒక్కో షాపు ఎదుట వందల మంది లబ్ధిదారులు బారులు తీరారు. మరోవైపు రేషన్ దుకాణాల దగ్గర ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించినా వలంటీర్లు అటువైపు వెళ్లడం లేదు. కరోనా కారణంగా లబ్ధిదారులు వేలిముద్రలు తీసుకోకుండా వీఆర్‌ఏ వేలిముద్రతో ప్రస్తుతం సరుకులు ఇస్తున్నారు. కానీ కొన్ని చోట్ల వీఆర్‌ఏలు సమయానికి రాకపోవడంతో డీలర్లు, కార్డుదారులు వారికోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రేషన్ కోసం దుకాణాలకు వస్తున్న వినియోగదారులు కరోనా నేపథ్యంలో పాటించాల్సిన భౌతిక దూరాన్ని పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో షాపుల వద్ద భౌతిక దూరాన్ని పాటించే గీసిన బరుల్లో.. సంచీలను పెడుతున్న లబ్ధి దారులు సమీపంలోని చెట్లు, నీడగా ఉన్న ప్రాంతాల్లో గుంపులుగా కూర్చుని సేదదీరుతున్నారు. దీంతో భౌతిక దూరం దూరమవుతోంది.

### అందరికీ ఇచ్చే వరకూ..

- పౌరసరఫరాల మంత్రి కొడాలి నాని

రేషన్ సరుకుల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల మంత్రి కొడాలి నాని చెప్పారు. అందరికీ రేషన్ ఇచ్చే వరకూ షాపులు తెరిచే ఉంచుతామన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రతి లబ్ధిదారునికీ రేషన్ సరుకులు అందజేస్తామని, సరుకులకు కొరత లేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కోన శశిధర్ తెలిపారు. చాలా చోట్ల రేషన్ షాపుల్లో కార్డుదారులు పరిమితికి మించి రావడంతో రద్దీ పెరుగుతోందన్నారు. ఏ సమయానికి ఎవరు రావాలనేది వలంటీర్లు స్లిప్పులు పంచి చెబుతున్నారని, సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్డుదారులు సహకరిస్తే ఐదారు రోజుల్లోనే పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

## రేషన్ కోసం వచ్చి.. వృద్ధురాలి మృతి

చోడవరం, మార్చి 30: నిత్యావసర సరకుల కోసం రేషన్ డిపోకు వచ్చిన ఓ వృద్ధురాలు ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి ప్రాణం విడిచింది. విశాఖపట్నం జిల్లా చోడవరం ద్వారకానగర్‌కు చెందిన మీరాబీ(69) సోమవారం ఉదయం సరకులు తీసుకునేందుకు బాలాజీనగర్‌లోని డిపోకు వెళ్లారు. డిపో వద్ద అప్పటికే భారీ ఎత్తున క్యూ ఉండడంతో చాలాసేపు వేచివున్నారు. ఉదయం 10 గంటల సమయానికి ఎండ తీవ్రత ఎక్కువైంది. అసలే వృద్ధాప్యం, ఆపైన మండుటెండలో నిలబడాల్సి రావడంతో తట్టుకోలేక మీరాబీ సొమ్మసిల్లి పడిపోయింది. విషయం తెలిసిన ఆమె మనవడు డిపో వద్దకు వచ్చి ఇంటికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచింది. మీరాబీకి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని ఆమె బంధువు తార తెలిపారు. డిపో వద్ద జరిగిన ఆలస్యం వల్ల ఎండ తీవ్రతకు స్పృహ తప్పి పడిపోయినట్టు చెప్పారు.



మీరాబీ(ఫైల్)

మీరాబీ డిపో వద్ద మృతిచెందలేదని, ఆమె అనారోగ్యంతో ఉన్నట్లు బంధువులు కూడా చెప్పారని అనకాపల్లి ఆర్డీవో సీతారామారావు చెప్పారు.

# ప్రైవేటు ఆస్పత్రులూ సిద్ధం!

- కరోనా కట్టడిలో భాగం కావాలి
- మధ్యాహ్నం 1 గంట వరకు వ్యవసాయోత్పత్తుల రవాణా
- మరిన్ని చర్యలు తీసుకున్న సర్కారు

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరోనా కట్టడి కోసం ప్రైవేటు మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉండే ఆస్పత్రులను, ప్రైవేటు ఆస్పత్రుల సేవలనూ ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై సోమవారం ఆరోగ్య శాఖ నుంచి కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. "ప్రైవేటు ఆస్పత్రుల పరిధిలో అన్ని రకాల పరికరాలు, పడకలు, ల్యాబ్స్, వెంటిలేటర్లతోపాటు సిబ్బందిని కూడా సమాయత్తం చేయాలి. విపత్తు కాలంలో సూచనలు, సలహాలు ఇవ్వడానికి వైద్య నిపుణులు, కన్సల్టెంట్లను సిద్ధంగా ఉంచాలి. ప్రభుత్వానికి అవసరమైన అతి కీలకమైన సదుపాయాలను ఆయా ఆస్పత్రులే ఏర్పాటు చేసుకోవాలి. ప్రైవేటు, ఎన్జీవో సంస్థలు ఎలాంటి తారతమ్యాలు చూపించకుండా తమ సేవలను కొనసాగించాలి" అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అత్యవసరం అనుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు, ఎన్జీవోల పరిధిలోని ఆస్పత్రుల్లో, వైద్యాలయాల్లోని స్పెషలిస్ట్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందితోపాటు పారా మెడికల్ సిబ్బందిని విపత్తు సేవలకు వాడుకోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో... జిల్లా కలెక్టర్/నిర్దేశిత అధికారి ఇచ్చే ఆదేశాలు, ఉత్తర్వులను ప్రైవేటు ఆస్పత్రులు పాటించి తీరాల్సిందే అని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణం అమలులోకి వస్తాయన్నారు.

### బాధ్యత కలెక్టర్లదే: మంత్రి కన్నబాబు

రాష్ట్రంలో కరోనా వైరస్ సోకిన బాధితులను ఆసుపత్రుల్లో చేర్పించి, వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు మంత్రి కురసాల కన్నబాబు వెల్లడించారు. సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వ్యవసాయ రవాణాకు అనుమతిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. కరోనా కట్టడిలో ప్రజాప్రతినిధులందరూ పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలని సీఎం ఆదేశించినట్లు వివరించారు.

# బాధ్యత ఉండక్కర్లేదా!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడం, కొన్నిచోట్ల 'ఆపడానికి మీరెవరు? ఏ సెక్షన్ కింద ఆపుతున్నారు?' అని పిచ్చి ప్రశ్నలు సంధించడం వంటివీ జరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో వారిపై పోలీసులు లాఠీలు ఝుళిపించక తప్పడంలేదు. ముందు జరిగిన తంతు ఎలాగున్నా, సరిగ్గా పోలీసులు కొడుతున్న దృశ్యాలు మాత్రమే వాట్సా్‌ప్‌లో షేర్ అవుతున్నాయి! అలాగని... ఏమిటి, ఎవరు అని అడక్కుండా ఎడాపెడా కొట్టేస్తున్న సంఘటనలు లేవా, అంటే అవీ ఉన్నాయి. అక్కడక్కడ కొందరు పోలీసులు దూకుడుగా, నేరుగా లాఠీలకు పని చెబుతున్నారు.

### 'విచక్షణ' ఎలా?

పోలీసులు ప్రస్తుతం తీవ్రమైన పని ఒత్తిడిలో ఉన్నారు. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసే పరిస్థితి కూడా లేదు. ఒకవైపు జనం కోసం తాము ఇంతగా శ్రమిస్తుండగా... మరోవైపు కొందరు బాధ్యతలేకుండా రోడ్లపైకెక్కడమేమిటని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఇదే క్రమంలో అక్కడక్కడా లాఠీలు పైకి లేస్తున్నాయి. రైతులు, రైతు కూలీలు, నిత్యావసరాల రవాణా, ఇతర అత్యవసర విభాగాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అంటే సంబంధిత రంగాలకు చెందిన వారు విధి నిర్వహణ కోసం బయటికి రావొచ్చు. కానీ వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు/అనుమతి పత్రాలు ఇవ్వలేదు. పై స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ... దీనిపై పోలీసులకు సమాచారం అందడంలేదు. మరి ఎవరు, ఎందుకు బయటికి పోలీసులు గుర్తించేదెలా? సరిగ్గా ఇక్కడే సమస్య వస్తోంది. అనుమతిపత్రాలను జారీ చేసినట్లయితే తమకు సమస్య ఉండదని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

### ప్రత్యామ్నాయం ఏమిటి?

- పొలానికి వెళ్తున్న రైతును కొట్టడం, పిల్లల ముందే తండ్రిని కొట్టడం వంటి ఘటనలు పోలీసులపై విమర్శలకు కారణమయ్యాయి. లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన వారిని దండించకుండా... 'సామాజిక' శిక్షలు వేయాలనే సూచనలు వస్తున్నాయి. అనవసరంగా బయటికి వచ్చిన వారి వాహనాలను సీజ్ చేయాలి. కరోనా కట్టడి, లాక్‌డౌన్‌పై ప్లకార్డులు పట్టించి, ప్రధాన రహదారుల్లో మూడు నాలుగు గంటలు నిలబెట్టాలి.పారిశుధ్య సిబ్బందికి సహాయకారులుగా నియమించాలి. పదేపదే అకారణంగా బయటికి వచ్చే వారిపై కేసు పెట్టి... మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి.

## రోజుకు 900 కేసులు!

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పదేపదే చెప్తున్నా లాక్‌డౌన్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా రోజుకు కనీసం 900కు తగ్గకుండా కేసులు నమోదవుతున్నాయి. సోమవారం సాయంత్రానికి సెక్షన్ 269, 270 కింద ఏపీ పోలీసులు 7,060 కేసులు నమోదు చేశారు. సుమారు పదివేల వాహనాలు సీజ్ చేశారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రధానమంత్రి నుంచి స్థానిక పోలీసుల వరకూ చెబుతూనే ఉన్నా కొందరు రోడ్లపైకి వస్తుండటంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. దీనిపై వ్యతిరేకత రావడంతో కేసులు నమోదు చేస్తున్నారు. ఈ విషయమై డీజీపీ సవాంగ్ మాట్లాడుతూ.. "ప్రజల ప్రాణాలే ముఖ్యం. వాళ్ల కోసమే పని చేస్తున్నాం. అందుకే నిబంధనలు విధించి ఇళ్లల్లో ఉండాలని చెప్తున్నాం. అయినా కాదని రోడ్లపైకి వస్తే కేసులు పెట్టక ఏం చేస్తాం' అనిప్రశ్నించారు. కాగా విదేశాల నుంచి వచ్చిన 22వేల మందిని గుర్తించామని, జియో ట్యాగింగ్ ద్వారా నిఘా పెట్టామని, ఇళ్లు దాటి యాభై మీటర్లు బయటికి వస్తే కంట్రోల్ రూములో అలారమ్ మోగుతుందని, వెంటనే పోలీసులు వెతుక్కుంటూ వెళతారని వివరించారు.

# లాక్ డౌన్ 14 వరకే!

## పొడిగింపు అవకాశాల్లేవు.. కేంద్ర కేబినెట్ సెక్రటరీ స్పష్టీకరణ

**కొత్త కేసులు ఆగితే పొడిగించం: కిషన్‌రెడ్డి**

న్యూఢిల్లీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో లాక్ డౌన్‌ను మరికొన్ని రోజులు పొడిగించే అవకాశాలు లేవని కేంద్రం స్పష్టం చేసింది. ఏప్రిల్ 14 వరకు విధించిన లాక్‌డౌన్‌ను మరికొన్ని రోజులు పొడిగిస్తారని వచ్చిన వార్తలు నిరాధారమైనవని కేంద్ర కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా చెప్పారు. ఈ మేరకు ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పిన విషయాన్ని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కూడా ధ్రువీకరించింది. ప్రధాని మోదీ కూడా ఏప్రిల్ నెలాఖరులో మన్ కీ బాత్ సమయానికి ఆంక్షలు ఉండక పోవచ్చునని శనివారం సూచన ప్రాయంగా చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి కూడా కరోనా లాక్ డౌన్‌ను పొడిగించే అవకాశాలు లేవని తెలిపారు. విదేశాల నుంచి వచ్చిన వారిలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 901 అని, 27 మంది మరణించారని చెప్పారు. ఒక ట్రెండు రోజుల్లో పరిస్థితి నియంత్రణలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విదేశాల నుంచి వచ్చిన చాలా మందికి 14 రోజుల క్వారంటైన్ పూర్తయిందని, వారందర్నీ త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. క్వారంటైన్‌లో ఉన్న వారిలో 10% మంది ఇప్పటికే విడుదలయ్యారని తెలిపారు. మరో వారం రోజుల్లో వారి సంఖ్య 50 శాతానికి చేరుకుంటుందన్నారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో ఉన్నట్లే భావించాలని, ఇదే పరిస్థితి కొనసాగుతూ కొత్త కేసులేవీ నమోదు కాని పక్షంలో లాక్ డౌన్ పొడిగించాల్సిన అవసరం ఉండక పోవచ్చునని చెప్పారు. అమెరికా, ఇటలీతో పోలిస్తే భారత్ సురక్షితంగా ఉందన్నారు. ప్రజలంతా భౌతిక దూరాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. శాంతి భద్రతలు, ఆహారం, రైల్వే, వైద్యం మొదలైన అనేక అంశాలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిని కరోనా టెస్టింగ్ సెంటర్‌గా ప్రకటించే ఆలోచనలో ఉన్నామని ఆయన వెల్లడించారు.



లాక్‌డౌన్‌తో పట్నా నుంచి స్వస్థలాలకు వెళ్తున్న వలస కార్మికులు

### గడువులోగా అడ్డుకోగలమా?

ఆదివారం నాటికి కరోనా వైరస్ పాజిటివ్ కేసులు వెయ్యి దాటడం, మరణాలు 27కు చేరుకోవడంతో ఏప్రిల్ 14 కల్లా మహమ్మారి వ్యాప్తిని అడ్డుకోగలమా? అన్నది తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో మిగిలిన 14 రోజులు లాక్‌డౌన్ మరింత కట్టుదిట్టంగా, కఠినంగా అమలు చేస్తారని అధికార వర్గాలంటున్నాయి. ఉపాధి కోల్పోయిన వేలమంది వలస కార్మికులు ఈ లాక్‌డౌన్ ఎంత కాలం ఉంటుందో తెలియక సొంత గ్రామాలకు తరలివెళుతున్న నేపథ్యంలో స్పష్టతనిచ్చేందుకే కేబినెట్ కార్యదర్శి ప్రకటన చేసి ఉంటారని భావిస్తున్నారు. వలస వెళ్లాలనుకున్న వారికి జాతీయ రహదారుల వద్ద ఆశ్రయం కల్పించాలని కేబినెట్ సెక్రటరీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

## దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని**



న్యూఢిల్లీ, మార్చి 30: కరోనా వైరస్‌పై తప్పుడు సమాచారం, మూఢ నమ్మకాల వ్యాప్తిని అడ్డుకోవడంలో సేవా సంస్థలే కీలకపాత్ర పోషించాలని ప్రధాని మోదీ అన్నారు. మత విశ్వాసం పేరిట భౌతిక దూరం నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిని చైతన్యపర్చాల్సిన బాధ్యత సేవా సంస్థలదేనని చెప్పారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సామాజిక సేవలో పాల్గొంటున్న సంస్థలను ఉద్దేశించి మాట్లాడారు. ఇక తాను శారీరకంగా దృఢంగా ఉండడానికి యోగా కారణం అంటూ యోగా చేస్తున్న 3డీ యానిమేటెడ్ వీడియోలను ప్రధాని ట్విటర్‌లో ఉంచారు.

## లాక్‌డౌన్ తర్వాత ఎలా?

**11 ఉన్నత స్థాయి కమిటీల ఏర్పాటు**

న్యూఢిల్లీ, మార్చి 30: కరోనా నేపథ్యంలో కేంద్రం విధించిన లాక్‌డౌన్ ఏప్రిల్ 14తో ముగిసిపోతుంది. ఆ తర్వాత పరిస్థితి ఏంటి? ప్రజలంతా ఒకేసారి రోడ్లపైకి వస్తే ఎలా? ఆస్పత్రుల నిర్వహణ ఎలా? పరిశ్రమల్లో తిరిగి ఉత్పత్తి ఏ స్థాయిలో జరగాలి? వంటి అంశాలపై కేంద్రం దృష్టిసారించింది. లాక్‌డౌన్ తర్వాత ఎదురయ్యే సమస్యలను 11 వర్గాలుగా విభజించిన కేంద్రం.. కేటగిరీల వారీగా కమిటీలను ఏర్పాటు చేసింది. వీటిలో తొమ్మిదింటికి సెక్రటరీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తుండగా.. ఒకదానికి నీతిఆయోగ్ సీఈవో, మరో కమిటీకి నీతిఆయోగ్ సభ్యుడు అధ్యక్షులుగా ఉండనున్నారు. ప్రతి కమిటీలో ఆరుగురు చొప్పున సభ్యులు ఉంటారు. ఈ కమిటీలు లాక్ డౌన్ తర్వాత ఉత్పన్నం కానున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నివేదికలు సిద్ధం చేస్తాయి.

## రెండో దశలోనే ఉన్నాం!

**అభివృద్ధి చెందిన దేశాల కన్నా మెరుగే: లవ్ అగర్వాల్**

**ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'**

కరోనా వైరస్ కేసుల విషయంలో భారత్ ఇప్పటికీ స్థానిక వ్యాప్తి(రెండో) దశలోనే ఉందని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. భారత్‌లో కరోనా పాజిటివ్ కేసులు వంద నుంచి వెయ్యికి పెరగడానికి 12 రోజులు పట్టిందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే కరోనా వైరస్ వ్యాప్తి మనదేశంలో తక్కువగా ఉందని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గడిచిన 24 గంటల్లో 92 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఒక్కరోజులో నలుగురు మరణించారని చెప్పారు. దేశవ్యాప్తంగా 1071 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీరిలో ఇప్పటివరకు 29 మంది మృతి చెందారని వెల్లడించారు. మనకన్నా చాలా తక్కువ జనాభా ఉన్న 7 అభివృద్ధి చెందిన దేశాల్లో 12 రోజుల్లో అనేక రెట్లు పాజిటివ్ కేసులు పెరిగాయని ఆయన వెల్లడించారు. (తొలి వంద కేసుల తర్వాత కరోనా వైరస్ వ్యాప్తి తీవ్రతపై ఆ ఏడు దేశాలతో భారత్‌ను పోలుస్తూ ఆంధ్రజ్యోతి సోమవారమే కథనం ప్రచురించడం గమనార్హం).

## ఇంట్లో ఉండడమే ఏకైక మార్గం!

**కరోనా నుంచి కోలుకున్న మహిళ స్పష్టీకరణ**

అహ్మదాబాద్, మార్చి 30: విదేశాలకు వెళ్లాలన్న తన నిర్ణయంపై పశ్చాత్తాపం వ్యక్తం చేసిందో కరోనా బాధితురాలు. అహ్మదాబాద్‌కు చెందిన 34 ఏళ్ల మహిళ ఈ నెల తొలివారంలో ఫిన్లాండ్ వెళ్లి వచ్చింది. కరోనా వైరస్ పరీక్షలు చేయగా పాజిటివ్ అని తేలింది. ఈ నెల 18 నుంచి అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిలో చికిత్స పొంది.. కోలుకొని ఆదివారం డిశ్చార్జ్ అయింది. వ్యాధి నయమై ఇంటికి చేరుకున్న ఆమెకు ఇరుగుపొరుగువారు కరతాళ ధ్వనులతో ఘనంగా స్వాగతం పలికారు. "నా వ్యక్తిగత అనుభవంతో చెబుతున్నా. ఇంట్లోనే ఉండడం తప్ప ఈ వ్యాధిని అడ్డుకునేందుకు మరో ప్రత్యామ్నాయం లేదు. విదేశాలకు వెళ్లడం నేను చేసిన పెద్ద తప్పు. అక్కడ ఎన్-95 మాస్కు ధరించడంతోపాటు పలు జాగ్రత్తలు తీసుకున్నా. అయినా వైరస్ సోకింది. కాబట్టి మీరు ఇంట్లో ఉంటేనే భద్రంగా ఉంటారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లండి" అన్నారు. ఇక మహారాష్ట్రలో వ్యాధి నయమైన మరో 59 ఏళ్ల వ్యక్తి.. కొవిడ్ రోగులను నిందించవద్దని విజ్ఞప్తి చేశారు. ఆయన రష్యా వెళ్లి ఈ నెల 3న ఔరంగాబాద్ చేరుకున్నారు. కాగా కరోనా బాధితుల్లో వృద్ధులు ఎక్కువగా ఉంటున్న సంగతి తెలిసిందే. అయితే ఇది అన్ని వయసుల వారిలోనూ ఎక్కువగానే ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. కరోనా సోకడానికి ముందు వారు ఎంత ఆరోగ్యంగా ఉన్నారనేది ముఖ్యమైన అంశంగా నిపుణులు భావిస్తున్నారు.

## ఒకే కుటుంబంలో 25 మందికి కరోనా

(మొదటి పేజీ తరువాయి)

మరో 21 మంది కుటుంబ సభ్యులకు కూడా వైరస్ సోకింది. వారిలో రెండేళ్ల బాలుడు కూడా ఉన్నాడు. ఇరుకు ఇంట్లో అంతా కలిసుండడం వల్ల వారం వ్యవధిలోనే పాతిక మందికి కరోనా సోకిందని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా కరోనా కేసులు పెరుగుతున్నాయి. సోమవారం 1,071కు పెరిగాయి. 24 గంటల్లో 106 కొత్త కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయి. దీంతో దేశంలో మృతుల సంఖ్య 29కి చేరింది. ఒక్క మహారాష్ట్రలోనే 10 మరణాలు నమోదయ్యాయి. ఇది మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువ. పుణెలో కరోనా సోకిన 52 ఏళ్ల వ్యక్తి సోమవారం మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో 3 రోజుల క్రితం మరణించిన 38 ఏళ్ల వ్యక్తి నమూనాల పరీక్షా ఫలితాలు సోమవారం వచ్చాయి. అతనికి కరోనా ఉన్నట్లు తేలింది. కేరళలో కొత్తగా 32 కరోనా కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 213కు చేరింది. దేశంలో ఇదే అత్యధికం. 193 కేసులతో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. ఒక్క రోజులో తమిళనాడులో 17, ఉత్తరప్రదేశ్‌లో 16 కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ రాష్ట్రాల్లో మొత్తం కేసులు వరుసగా 67, 88కి చేరాయి. కర్ణాటకలో 80, ఉత్తర ప్రదేశ్ 88, గుజరాత్ 69, రాజస్థాన్ 60, ఢిల్లీ 53, పంజాబ్ 38, హరియాణా, మధ్యప్రదేశ్ 33 చొప్పున, జమ్మూ కశ్మీర్ 45, పశ్చిమ బెంగాల్ 22, లద్దాఖ్ 13, బిహార్ 11, అండమాన్ నికోబార్ 10, చండీగఢ్ 8, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ 7 చొప్పున, గోవా 5, హిమాచల్ ప్రదేశ్, ఒడిసాలో మూడు చొప్పున, పుదుచ్చేరి, మి జోరాం, మణిపూర్ ఒక్కో కేసు నమోదయ్యాయి. ఎయిరిండి యా ఎయిర్‌పోర్ట్స్ సర్వీసెస్ (ఏఐఏఎస్ఎల్) మహిళా ఉద్యోగికి కరోనా సోకింది. ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. ఆమె సహోద్యోగులు 14 మందిని హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని ఆదేశించినట్లు సంస్థ చీఫ్ ఏకే శర్మ తెలిపారు.

### గర్భిణీ.. 100 కి.మీ. నడక



మీరట్, మార్చి 30: 8నెలలు నిండిన గర్భిణి. సహరన్‌పూర్‌లో ఒక పరిశ్రమలో ఆమె భర్త పనిచేస్తున్నాడు. లాక్‌డౌన్ కారణంగా పరిశ్రమ యజమాని భర్త ఉద్యోగాన్ని తొలగించి, పనిచేసిన నెలకు జీతం ఇవ్వకుండానే.. వారికి ఇచ్చిన గది నుంచి బయటికి గెంటేశాడు. దీంతో.. ఆ దంపతులిద్దరూ 191 కిలోమీటర్ల దూరంలో ఉన్న బులంద్‌షహర్‌లోని స్వగ్రామానికి నడక మొదలుపెట్టారు. సుమారు 100కి.మీ. ప్రయాణం చేసి మీరట్ చేరుకున్న తర్వాత వారి అవస్థలు చూసిన స్థానికులు ఆహారాన్ని, ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం పోలీసుల సాయంతో వాళ్ల ఊరికి చేర్చారు.

### బరేలీలో దారుణం



లాక్‌డౌన్‌తో ఉపాధి కరవై స్వగ్రామాలకు చేరుకుంటున్న వలస కూలీల పట్ల ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో స్థానిక యంత్రాంగం అమానుషంగా వ్యవహరించింది. పాతికమందిపై అంటురోగ నివారణ ద్రావకం స్ప్రే చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో జిల్లా కలెక్టర్ అభిషేక్ ప్రకాష్ బాధ్యులపై చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. **- బరేలీ**

## అయ్యో.. ఐరోపా!

**25వేలు దాటిన మరణాలు..**

**అమెరికాలో 2లక్షల వరకూ చనిపోవచ్చు: ట్రంప్**

న్యూయార్క్, మార్చి 30: కరోనా వైరస్ విలయతాండవం ప్రపంచాన్ని, ముఖ్యంగా యూరప్‌ను మంచాన పడేసింది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా సంభవించిన 36వేల పైచిలుకు మరణాల్లో మూడింట రెండొంతులు ఈ ఒక్క ఖండాన చోటు చేసుకున్నవే! ఒక్క ఐరోపా దేశాల్లోనే దాదాపు 4లక్షల పైచిలుకు మందికి వైరస్ సోకగా 25వేల మంది మరణించారు. ఇటలీ (సుమారు 11వేలు), స్పెయిన్ (7340) ల్లో మృతుల సంఖ్య ఎక్కువగా ఉంది. స్పెయిన్‌లో గంటకు 35 మంది చనిపోతున్నారు. ఒక్కరోజులో అక్కడ 812 మంది మృత్యువాత పడ్డారు. ఇంకా ఘోరం ఏంటంటే- వైరస్ సోకిన వారిలో దాదాపు 15శాతం మంది అంటే సుమారు 13వేల మంది వైద్య సిబ్బందే. కొంతభాగం యూరప్‌లో ఉన్న రష్యాకు ఈ సెగ తగలడంతో మాస్కో నగరంలో లాక్‌డౌన్ ప్రకటించింది. 1836 మందికి ఇది సోకినట్లు, ఇంతవరకూ 9 మంది మరణించినట్లు రష్యా ప్రభుత్వం వెల్లడించింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా కరోనా పాకిన 183 దేశాల్లో కేసుల సంఖ్య 7.52 లక్షలు దాటింది. మరణాల సంఖ్య 36, 205 కాగా- ఇప్పటివరకూ డిశ్చార్జి అయినవారు 1,58, 688 మంది.

అమెరికాలో పరిస్థితి పూర్తి గందరగోళంగా, భయానకంగా ఉంది. గడచిన 24 గంటల్లోనే 518 మంది చనిపోవడంతో మరణాల సంఖ్య 2500కు చేరువవుతోంది. కేసుల సంఖ్య 1,43,000కు పెరిగింది. మరణాల సంఖ్య లక్ష దాకా పెరగవచ్చని సుప్రసిద్ధ ఎండమాలజిస్ట్ ఆంథోనీ ఫాసీ అంచనా వేయగా, అమెరికా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి మరణాలు 2లక్షలకు చేరినా ఆశ్చర్యపోనక్కరలేదని అంటోంది. ఇటలీలో కరోనా ఉధృతి కాస్త తెరిపినిచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. తాజా లెక్కల ప్రకారం మరణాల సంఖ్య 5.6 శాతం మేర తగ్గింది. వైరస్ వచ్చాక 6 శాతం కంటే తక్కువ నమోదు కావడం ఇదే ప్రథమం. ప్రస్తుతం మరణాలు 11వేలు దాటగా, కేసుల సంఖ్య లక్ష దాటేశాయి. వైరస్ మొదలైన చైనాలో తాజాగా నలుగురు మరణించారు. ఇవన్నీ వుహాన్‌లోనే. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్వీయ-నిర్బంధంలోకి వెళ్లారు. కొవిడ్-19 బారిన పడ్డ బ్రిటన్ యువరాజు ఛార్లెస్ స్వీయ-ఏకాంతం నుంచి బయటపడ్డారు. ఆయన కోలుకున్నట్లు రాజప్రతినిధి ఒకరు చెప్పారు. ఇరాన్‌లో పరిస్థితి మరీ గడ్డుగా తయారైంది. ఒక్క రోజులో 117 మంది మరణించారు. కేసుల సంఖ్య 21,600 దాటింది. ఆస్ట్రేలియాలో ఇప్పటిదాకా 18 మంది మరణించారు. న్యూజిలాండ్‌లో తొలి మరణం నమోదైంది. ప్రముఖ జపనీస్ కమెడియన్ కెన్ షిముర (70), గ్రామీ పురస్కార గ్రహీత, అమెరికన్ సింగర్ జో డిఫ్ఫే (61) కరోనాతో మృతిచెందారు. మరో దిగ్గజ గాయకుడు జాన్ ప్రైన్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.



న్యూయార్క్ సెంట్రల్ పార్క్‌లో తాత్కాలిక ఆస్పత్రుల నిర్మాణం

## 'ఢిల్లీ' దడ!

(మొదటి పేజీ తరువాయి)

హాజరైన వారే. ఢిల్లీ నిజాముద్దీన్ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రార్థనా మందిరంలో రెండున్నర రోజుల పాటు ఒక సదస్సు జరిగింది. ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 2 వేల మంది హాజరయ్యారు. వీరిలో అత్యధికులు ఈనెల 14-15వ తేదీల్లో తమతమ ప్రాంతాల నుంచి రైళ్లలో బయలుదేరారు. 16, 17, 18వ తేదీ మధ్యాహ్నం వరకు జరిగిన సదస్సులో పాల్గొన్నారు. 15 నుంచి 20 మందితో కూడిన బృందాలుగా వెళ్లిన వారంతా కలిసే ప్రయాణించారు. ఢిల్లీలో ఉన్నన్ని రోజులు కలిసే బస చేశారు. ఆ తర్వాత ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రకారం రైళ్లలో బృందాలుగా వచ్చారు. ఏపీకి చెందిన వారు దురంతో ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లలో ప్రయాణించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి బావమరిదికి, ఆయనతోపాటు ఢిల్లీకి వెళ్లిన మరో ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ఆయన సతీమణికి కూడా వైరస్ సోకింది. ఇక... ప్రకాశం జిల్లా చీరాల నుంచి ఢిల్లీకి వెళ్లిన భార్యా భర్తలకూ పాజిటివ్ సోకింది. సోమవారం తెలంగాణలోనూ 'ఢిల్లీ కనెక్షన్' ఉన్న వారిలో ఏకంగా ఐదుగురు మరణించారు. మరో ఆందోళనకరమైన విషయమేమిటంటే... ఢిల్లీ సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన వారిలో పలువురు ఆ వివరాలు తెలిపేందుకు స్థానికంగా మరిన్ని ప్రార్థనా మందిరాల్లో చిన్నపాటి సమావేశాలు నిర్వహించారు.

### ఇతర దేశాల నుంచీ...

రైలులో ప్రయాణిస్తున్న సమయంలోనే వీరికి వైరస్ సోకి ఉండవచ్చుననే తొలుత భావించారు. కానీ... వేర్వేరు రైళ్లలో, వేర్వేరు బోగీలలో ప్రయాణించిన వారికి 'పాజిటివ్' వచ్చింది. వీరు ఢిల్లీలో జరిగిన మత సదస్సుకు హాజరైన ఉమ్మడి నేపథ్యం ఉండటంతో... అక్కడే వైరస్‌తో 'కాంటాక్ట్' అయ్యారనే నిర్ధారణకు వచ్చారు. ఈ మత సదస్సుకు ఇరాన్, ఇండొనేషియా, ఉజ్బెకిస్థాన్, మలేషియా తదితర దేశాల నుంచి కూడా మత పెద్దలు హాజరయ్యారు. ఇరాన్‌లో భారీ స్థాయిలో కరోనా కేసులు, మరణాలు నమోదవుతున్న సంగతి తెలిసిందే. సంస్థ ప్రధాన కార్యాలయంలో మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు వరుసగా సమావేశాలు జరిగాయని... దీనికి కొనసాగింపుగా మరిన్ని భేటీలు జరిగాయని తెలుస్తోంది.

### నిజాముద్దీన్‌లో హైఅలర్ట్

ఢిల్లీకి వెళ్లి వచ్చిన ఒక మతపెద్ద గత వారం శ్రీనగర్‌లో కరోనాతో మరణించారు. ఆ వెంటనే కలకలం మొదలైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నిర్ధారణ అయిన కరోనా కేసుల్లోనూ 'ఢిల్లీ కనెక్షన్' బయటపడింది. ఇక... ఢిల్లీలోని సదరు మత సమావేశం జరిగిన సంస్థ ప్రధాన కార్యాలయం ఉన్న నిజాముద్దీన్ ప్రాంతంలో అనేక మందికి కరోనా లక్షణాలు బయటపడ్డాయి. వీరు కూడా సదరు సమావేశానికి హాజరైనట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆదివారం రాత్రి ఆ ప్రాంతం మొత్తాన్ని పోలీసులు, పారామిలటరీ బలగాలు స్వాధీనంలోకి తీసుకున్నాయి. వైద్య సిబ్బంది రంగంలోకి దిగారు. 163 మంది అనుమానితులను ఆస్పత్రికి తరలించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సదరు సమావేశం జరిగిన 'మర్కజ్ భవంతి' వైపు ఇతరులెవరూ వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. సదరు సమావేశాన్ని నిర్వహించిన సంస్థ ప్రధాన కార్యాలయాన్ని , చుట్టుపక్కల ఇళ్లను పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నారు. ఎవ్వరూ బయటికి రాకుండా డ్రోన్లతో నిఘా వేశారు. సదస్సుకు హాజరైన వారు బస చేసిన చుట్టుపక్కల హోటళ్లను కూడా సీజ్ చేశారు. కరోనా అనుమానితులను ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా బస్సులను కూడా సిద్ధం చేశారు. పశ్చిమ నిజాముద్దీన్, నిజాముద్దీన్ బస్తీలో దాదాపు 30 వేల మంది నివసిస్తున్నారు. కరోనా నేపథ్యంలో 50 మందికి మించిన సభలు, సమావేశాలు, ప్రార్థనల నిర్వహణపై ఢిల్లీ ప్రభుత్వం మార్చి 1వ తేదీనే నిషేధం విధించింది. అయినప్పటికీ... 'మర్కజ్' సమావేశాలు నిర్వహించిన మత పెద్దపై కేసు నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సోమవారం ఆదేశించారు.

## ప్రభుత్వానికి సహకరించండి!

**ఒంగోలుకు చెందిన మత పెద్ద పిలుపు**

ఒంగోలు నగరం, మార్చి 30: ఢిల్లీ ప్రార్థనలకు వెళ్లిన వారంతా పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వానికి సహకరించాలని ఒంగోలుకు చెందిన షురా పెద్ద సయ్యద్ హమీద్ పిలుపునిచ్చారు. "ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ ప్రాంతంలోని బంగ్లేవాలి మసీదులో ప్రార్థనలు జరిగాయి. యాత్రకు వెళ్లిన వారందరికీ కరోనా వచ్చిందనే వాదనలో నిజం లేదు. చీరాలకు చెందిన వ్యక్తికి వైరస్ పవిత్ర మసీదులో సోకే అవకాశమే లేదు. ప్రయాణంలో రైలులో కానీ, ఇతర ఏదో మార్గంలో కానీ సోకి ఉంటుంది. సోమవారం నిజాముద్దీన్ ప్రాంతంలోని 2 వేల మందికి మిలటరీ వైద్యులు కరోనా పరీక్షలు నిర్వహించగా... ఒక్కరికీ పాజిటివ్ రాలేదు" అని తెలిపారు.

## బతికే చాన్సుంటేనే బెడ్..?

**వయసు పైబడితే నో వెంటిలేటర్**

**అమెరికాలోనూ బాధాకర సన్నివేశాలు**

**న్యూయార్క్‌లో 1000 దాటిన మృతుల సంఖ్య**

(న్యూయార్క్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి కిలారు అశ్వనీకృష్ణ)



ఆస్తమాతో ఓ నర్స్, కేన్సర్‌తో బాధపడుతున్న ఓ వయోవృద్ధుడు, కిడ్నీ సమస్యతో ఓ ఉద్యోగి, ఆవాసమే లేని ఓ అనాథ.. వీరంతా కరోనా సోకిన రోగులు. ఆస్పత్రికి వచ్చారు. వీరిలో ఎవరికి చికిత్స అందించాలి? ఆస్పత్రులన్నీ కిక్కిరిసిపోయినపుడు, వేల సంఖ్యలో వచ్చే వారికి సరిపడా బెడ్లు, ఐసీయూలు, వెంటిలేటర్లు, ఇతర వైద్య ఉపకరణాలు లేనపుడు ఎవరికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి? ఎలా అందించాలి? ఇటలీలో ఈ సమస్య ఉన్నట్లు చదివాం.. ఇపుడు అత్యంత సంపన్న దేశం, అగ్రరాజ్యం అమెరికాలోనూ ఇదే పరిస్థితి! సరైన మార్గదర్శకాలు లేక, ఏం చేయాలో పాలుబోక, నిర్ణయం తీసుకోలేక వైద్యసిబ్బంది నిస్సహాయంగా మిగిలిపోతున్నారు. ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులున్న అమెరికాలోని ప్రధాన నగరాల్లో ఇదే పరిస్థితి! దీంతో అధికారులు ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలను సమీక్షిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ప్రాధాన్య క్రమంలో పేషెంట్లను ఎంపిక చేసి అడ్మిట్ చేసుకునేట్లుగా మార్గదర్శకాలు సవరిస్తున్నారు. ఖచ్చితంగా బతుకుతారు అని భరోసా ఉన్న వారికే ప్రథమ ప్రాధాన్యం. సామాజిక నైతిక నియమాల ప్రకారం పిల్లలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ఐసీయూలో పెట్టినా, వెంటిలేటర్ అమర్చినా బతకరు అన్న కేసులకు బయటే చికిత్స! అమెరికాలో కనీసం 9 లక్షల వెంటిలేటర్లు కావాలి. ప్రస్తుతం ఉన్నవి 2.25 లక్షలే.. ఇవి కూడా ఓ సారి వాడినవే.

### న్యూయార్క్‌లో 60వేల కేసులు

అమెరికాలో వైరస్‌కు కేంద్రస్థానంగా మారిన న్యూయార్క్‌లో ప్రతి గంటకు కేసుల సంఖ్య పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి ఈ ఒక్క రాష్ట్రంలోనే కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య దాదాపు 60వేలకు పెరిగింది. సుమారు వెయ్యి మంది మరణించారు. అమెరికా ఆర్థిక మూలాలకు న్యూయార్క్ కేంద్రబిందువు కావడంతో అక్కడ లాక్‌డౌన్‌ను నిర్బంధం చేయడానికి ట్రంప్ సర్కార్ వెనుకాడుతోంది. మెట్రో రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయి. నిత్యావసరాల కోసం దుకాణాల ముందు ప్రజలు బారులు తీరుతున్నారు. న్యూయార్క్ పక్కనే ఉన్న న్యూ జెర్సీ, కనెక్టికట్ రాష్ట్రాలకు కరోనా శరవేగంగా విస్తరిస్తోంది. అనేక భారతీయ అమెరికన్ గ్రూపులు సంయుక్తంగా కొవిడ్-19 బాధితులకు సాయపడుతున్నాయి.

### ఇరువురు తెలుగు వారికి కరోనా వైరస్

కరోనా ధాటికి అమెరికా నలుమూలల ఉన్న తెలుగు వారిలోనూ భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. న్యూయార్క్‌లో ఒక తెలుగు యువకుడికి కరోనా సోకింది, అయితే అతను కోలుకున్నాడు. ప్రస్తుతం అతని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆ యువకుడు తన అనుభవాలను నాట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ వెబినార్‌లో (కరోనా అవగాహన) వివరించాడు. కాలిఫోర్నియాలో ఒక తెలుగు వృద్ధ మహిళకు కూడా కరోనా సోకి మరణించినట్లు సమాచారం. న్యూయార్క్ పరిసరాల్లో నివసిస్తున్న ఇరువురు తెలుగు వైద్య దంపతులకు కరోనా సోకిందని, వారు కోలుకున్నారని వెల్లడైంది. కాగా, తెలుగు వారు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసే 'పటేల్ బ్రదర్స్ తమ దుకాణాలను మూసివేశారు.

## 'ఢిల్లీ సభ'కు వెళ్లొచ్చారా!?

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్ర యంత్రాంగాన్ని 'ఢిల్లీ కనెక్షన్' కలవర పెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో బయటపడిన కొవిడ్-19 పాజిటివ్ కేసుల్లో ఆరుగురికి 'ఢిల్లీ ప్రయాణం'తో సంబంధముంది. కరోనా పాజిటివ్ వచ్చిన వారితోపాటు రైలులో ప్రయాణించిన వారు, వారి కుటుంబ సభ్యులను గుర్తించి క్వారంటైన్‌కు పంపించే ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అధికారులు 'ఢిల్లీ కనెక్షన్‌'పై ఆరా తీశారు. అనుమానితులను క్వారంటైన్‌కు తరలించారు. ఢిల్లీకి వెళ్లి వచ్చిన ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన వ్యక్తికి, ఆయన భార్యకూ కరోనా సోకినట్లు ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. వీరికి తొలుత వైద్యం చేసిన చీరాలకు చెందిన ఐదుగురు డాక్టర్లను హోంక్వారంటైన్‌లో ఉండాలని అధికారులు కోరారు. వీరి నమూనాలను కూడా పరీక్షలకు పంపించారు. ఇక.. ప్రకాశం జిల్లా నుంచి ఢిల్లీ సదస్సుకు వెళ్లిన 74 మందిని అధికారులు గుర్తించారు. వీరందరినీ క్వారంటైన్‌కు తరలించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఢిల్లీ సదస్సుకు 22 మంది వెళ్లినట్లు సమాచారం. వీరిలో 13 మందిని ఐసొలేషన్‌కు పంపించారు. మరో 9 మందిని కూడా గుర్తించి ఇంటివద్దే నమూనాలు సేకరించారు. ఇక... ఈ సమావేశానికి నెల్లూరు నుంచి 70 మంది హాజరైనట్లు సమాచారం. ప్రస్తుతం 25 మందిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని కరోనా సెంటర్‌కు పంపించారు. మిగిలిన వారిని గుర్తించే పనిలో పడ్డారు. ఇక... కృష్ణా జిల్లా నుంచి దాదాపు 40 మంది ఢిల్లీకి వెళ్లారు. వీరందరినీ అధికారులు హోం క్వారంటైన్‌లో ఉంచారు. కర్నూలు నుంచి పెద్ద సంఖ్యలో ఢిల్లీ సదస్సుకు వెళ్లి వచ్చారు. వీరిలో 123 మందిని వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలకు తరలించారు. మరో 66 మంది వివరాలు సేకరించి, వారి పరిస్థితిని గమనిస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఢిల్లీకి 13 మంది వెళ్లినట్లు తెలుస్తోంది. వారిలో 8 మందిని గుర్తించి శ్రీకాకుళం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి, నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. కడప జిల్లా నుంచి 49 మంది ఢిల్లీ సదస్సుకు హాజరయ్యారు. వీరిలో 47 మందిని ఐసొలేషన్ వార్డులకు తరలించారు. అదేవిధంగా విశాఖ నుంచి ఢిల్లీకి వెళ్లి వచ్చిన 30 మందిని అధికారులు గుర్తించి క్వారంటైన్‌కు పంపారు. అయితే, వీరంతా వచ్చి 14 రోజులు దాటిందని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికిపైగానే ఈ ఢిల్లీ వెళ్లినట్టు తెలిసింది. వీరిలో 50 మంది అనంతపురం జిల్లా కదిరిలో ప్రత్యేక సభ నిర్వహించారు. వీరిలో రాజమండ్రికి చెందిన వృద్ధుడికి పాజిటివ్ వచ్చింది.

### ఏపీలో 6 పాజిటివ్ కేసులతో కనెక్షన్

**దాదాపు ప్రతి జిల్లా నుంచి హాజరు**

### మొన్న భార్య.. నిన్న భర్త మృతి

**ఢిల్లీ సభకు వెళ్లొచ్చాకే ఘటన**

**'కరోనా'ను ధ్రువీకరించని వైద్యులు**

విజయవాడ/కాకినాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఏపీలో ముగ్గురు వ్యక్తులు కరోనా అనుమానిత లక్షణాలతో మరణించారు. వైద్యాధికారులు మాత్రం ఇతర అనారోగ్య కారణాలవల్లే వీరు చనిపోయినట్లు తెలిపారు. వీరు ముగ్గురూ ఇటీవల ఢిల్లీలో జరిగిన మత ప్రార్థనలకు హాజరైన వారే. విజయవాడకు చెందిన మహిళ ఆదివారం మరణించగా, సోమవారం ఆమె భర్త కూడా చనిపోయారు. తూర్పు గోదావరి జిల్లా కాతేరుకు చెందిన వ్యక్తి (62) సోమవారం రాత్రి చనిపోయాడు. ఆదివారం ఆయనకు కరోనా నెగిటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో 14 రోజులు ఐసొలేషన్‌లో ఉన్న తర్వాత మళ్లీ పరీక్షలు చేస్తామని వైద్యులు చెప్పారు. అయితే సోమవారం రాత్రి హఠాత్తుగా చనిపోయారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.